www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 30 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి వైశాఖ బహుళ ద్వాదశి
03-09 జూన్ 2024
వెల : ₹20/-

# మన భూమి... మన భవిష్యత్తు...

ప్రపంచ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ
ఒకే నాణానికి అటు ఇటు ఉంటాయన్న వాస్తవం
మనిషికి అర్థమవుతున్నదనే అనుకోవాలి.



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక







# అదిగో ఊటీ..

తమిళనాడులోని ఊటీ పేరు చెప్పగానే వేసవి విడిది గుర్తుకు వస్తుంది. కానీ ఆ పచ్చదనాల కొండ ప్రత్యేకత అదొక్కటే కాదు. ఉదకమండలం అని పిలిచే ఊటీలో ఏటా వేసవికే బొటానికల్ గార్డెన్‌లో ఒక గొప్ప ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. ఏటా మే నెలలోనే నిర్వహించే ఈ ప్రదర్శనలో అన్నీ పళ్లూ పూలూ, కూరగాయలతోనే కళాకృతులు ఉంటాయి. ఇంకా గులాబీల ప్రదర్శన, సుగంధ ద్రవ్యాల ప్రదర్శన కూడా ఉంటాయి. యువ కళాకారులను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ప్రదర్శన ఇది. ఈ సంవత్సరం మే 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగింది. పళ్లనీ, పూలనీ, కూరగాయలనీ రకరకాల జంతువుల, ఇతర రూపాల ఆకృతితో తీర్చి దిద్దుతారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే దాదాపు మూడు లక్షల పర్యాటకులను ఇది విశేషంగా ఆకర్షిస్తూ ఉంటుంది. దీనికి గొప్ప చరిత్ర కూడా ఉంది. ఇది 126వ ప్రదర్శన. అంటే 126 ఏళ్లుగా దీనిని నిర్వహిస్తున్నారు. ఇది భారతదేశంలోని ఫలపుష్పాల వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటుతుంది.





# జాతీయవాద జర్నలిజమే శ్రీరామరక్ష

**తెలుగు పత్రికా రచన ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుందని, సోషల్ మీడియా యుగం నడుస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అన్నారు. గతంలో జర్నలిజంలో అంతా మేనేజ్‌మెంట్ యుగమే నడిచిందని, ఇప్పుడు పాత్రికేయులే కాకుండా సామాన్య పౌరులు కూడా సోషల్ మీడియా ద్వారా క్రియాశీలకమవుతున్నారని, ఇదో కొత్త పంథా అని తెలిపారు. నారద జయంతి నేపథ్యంలో సమాచార భారతి సంస్థ హైదరాబాదులో పాత్రికేయులకు మే 24 న అందించిన పురస్కార ప్రదానోత్సవానికి ఐవైఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.**

ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ మీడియాతో జర్నలిజం పోకడే మారిపోయిందన్నారు. ఇందులో మంచీచెడూ రెండూ ఉన్నాయని, అయితే ఫేక్ న్యూస్ బాగా ప్రచారం అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కమ్యూనిస్టులు చాలా పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని, జాతీయవాదులు పూర్తిగా సంఘటితం కావడం ద్వారానే దానిని తట్టుకోగలమని పేర్కొన్నారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులు చాలా ఉన్నాయని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వాటిని నిరోధించాలంటే జాతీయవాదశక్తులు ఏకం కావాల్సిందేనని నొక్కి చెప్పారు.

నారద జయంతి వంటి కార్యక్రమాల ద్వారా ఈ పనిని సమాచార భారతి చేస్తోందని ప్రశంసించారు. ఇక అన్ని యుగాలలోనూ నారదుడు ఉన్నారని పేర్కొంటూ రావణాసురుడు, నరకాసురుడు వంటి రాక్షసుల దగ్గరకు కూడా వార్తలు చెప్పడానికి నారదుల వారు వెళ్లారన్నారు. అయితే ఆ రాక్షసుల నుంచి నారదునికి బెదిరింపులు ఉండేవి కావని, అదే నేటి ఆధునిక యుగంలో తమకు అనుకూలంగా రాయాలంటూ పాత్రికేయులను బెదిరించే రోజులు వచ్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**అత్యంత బలంగా జాతీయ భావాల వ్యాప్తి: గోపాల్ రెడ్డి**

జాతీయవాదులు, జర్నలిస్టులందరి కోసం సమాచార భారతి నడుస్తోందని సంస్థ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి అన్నారు. గత 20 సంవత్సరాలుగా పాత్రికేయ ప్రముఖులను గుర్తించి, వారిని సత్కరిస్తూ వస్తున్నామని తెలిపారు. జాతీయవాదాన్ని ప్రచారం చేయడానికి సమాచార భారతి పనిచేస్తోందంటూ గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ భావాలను పెంపొందించడానికి లోకహితం పత్రిక కూడా కృషి చేస్తోందన్నారు.

పత్రిక చిన్నదే అయినా జాతీయ భావాలను అత్యంత బలంగా వ్యాప్తిచేస్తున్నామని గోపాల్ రెడ్డి చెప్పారు. ఈ క్రమంలో సినిమా రంగంలో వున్న యువత టాలెంట్‌ను బయటికి తీసుకురావడానికి మూడేళ్లకొకసారి కాకతీయ ఫిల్మ్ ఫెస్టివల్ అనే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని తెలియజేసారు. మంచి సందేశాలు గల లఘు చిత్రాలను బలంగా వ్యాప్తి చేయడానికి ఈ వేడుక పనిచేస్తోందన్నారు. అలాగే గోల్కొండ లిటరరీ ఫెస్టివల్ అనే కార్యక్రమం ద్వారా సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇది సోషల్ మీడియా యుగం అయినందున సోషల్ మీడియా సంగమం పేరుతో మీడియా కార్యశాలలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

రానున్న రోజుల్లో సమాచార భారతి నిర్వహించే అన్ని కార్యక్రమాలకు సమాజం మద్దతివ్వాలని గోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.

నారద జయంతి కార్యక్రమంలో భాగంగా సమాచార భారతి నారద పురస్కారం అందుకున్న పాత్రికేయులు– యాబలూరి సీతారామ శర్మ, గుళ్ళపూడి శ్రీనివాస కుమార్, డా. చిరువోలు పార్థ సారథి, కందికట్టు దుర్గా నరసింహారావు, పొన్నపల్లి నాగవాణి, గంగం మహేష్ రెడ్డి. పురస్కార ప్రదానం, సన్మానం అందుకున్న తర్వాత సన్మాన గ్రహీతలందరూ తమ స్పందనను తెలియచేశారు. చివరగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ★





Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి. తుకారాం: సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ




ముఖపత్ర కథనం

**మన భూమి..**

**మన భవిష్యత్తు..**

6లో

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అంకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000

సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

**ఆర్**ఎస్ఎస్‌లో మహిళలకు ప్రవేశం లేదంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఒక అజ్ఞానిలా మాట్లాడుతున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలోనే కాదు, గతంలోను ఆయన నోటి నుంచి ఇలాంటి వక్రభాష్యాలు వచ్చాయి. అయోధ్య వెళ్లినందుకు తనను గదిలో బంధించారని ఖైరా అనే కాంగ్రెస్ మహిళా నేత కన్నీటి పర్యంతమై మీడియా ముందుకు వచ్చిన సంగతిని ఆయన మరచిపోయారు. ఆయన మిత్రుడు, కూటమి భాగస్వామి అరవింద్ కేజ్రీవాల్ పార్టీలో స్వాతి మలీవాల్‌కు జరిగిన అవమానం గురించి నోరు విప్పని రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలకు తెగబడడం సిగ్గుచేటు. ఆర్ఎస్ఎస్, అసలు హిందూసంస్థలు మహిళకు ఇచ్చే స్థానం, గౌరవం ఎలాంటిదో, ఎందుకో ఆయనకు అర్థం కావు. ఆయన పెరిగిన వాతావరణం, నాయకత్వం వహిస్తున్న సంస్థ, చుట్టూ ఉన్న విష సంస్కృతి ఇంతటి గొప్ప భావనలను దరి చేరనీయవు.

రాష్ట్ర సేవికాసమితి ప్రస్తావన ద్వారా రాహుల్ ఎంత అజ్ఞానంతో మాట్లాడుతున్నారో వివరించవచ్చు. జాతీయవాదం, దేశభక్తి, సమాజసేవ వంటి చింతన; నాయకత్వం పురుషులకే పరిమితమన్న అవాంఛనీయ భావన ఆధునిక భారతీయ సమాజానికి సోకిన రుగ్మతలు. దీనిని పటాపంచలు చేసిన సంస్థ రాష్ట్ర సేవికా సమితి. సమితిని అక్టోబర్ 25,1936న వందనీయ లక్ష్మీబాయి కేల్కర్ (మౌసీజీ) ప్రారంభించారు. ఇది మహిళలను సంఘటిత పరచడానికి ఆవిర్భవించిన హిందూ జాతీయవాద సేవా సంస్థ. దీని క్లుప్త నామం కూడా ఆర్ఎస్ఎస్. కానీ ఇది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మహిళా విభాగమని చెప్పడానికి వీలులేదు. అయితే ఇలాంటి అభిప్రాయం లేకపోలేదు. ఆ రెండూ ఒకే ఆశయంతో, కార్యాచరణతో పనిచేసే రెండు వేర్వేరు సంస్థలు. రెండు సంస్థలు భగవాధ్వజాన్నే సమున్నతంగా భావిస్తాయి. భారత చరిత్రనే చోదకశక్తిగా స్వీకరించాయి. సేవికాసమితి ఒక స్వతంత్ర సంస్థ. ఈ సంస్థలో సభ్యత్వమే కాదు, నాయకత్వం కూడా కచ్చితంగా మహిళలకే పరిమితం. జాతీయవాదంతో హిందూ మహిళా లోకాన్ని చైతన్యవంతం చేయడమే సేవికా సమితి ప్రథమ ఆశయం. 3500 శాఖలతో సంస్థ పురోగమనంలో ఉంది.


**శాలివాహన 1946 శ్రీ క్రోధి వైశాఖ బహుళ ద్వాదశి**

*లోపలి పేజీలలో...*

మమత బుజ్జగింపు..
కోర్టుల యావగింపు
**క్రాంతి**

36లో





ధారావాహిక నవల
**జన్మ**
– సంబరాజు లీల (లట్టుపల్లి)

20లో

# జాగృతి

## సంపాదకీయం

వందనీయ లక్ష్మీబాయి సేవికాసమితిని స్థాపించడానికి ముందు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తొలి సర్ సంఘచాలక్ పరమ పూజనీయ డాక్టర్ కేశవరావ్ బలీరామ్ హెడ్గేవార్‌ను కలుసుకున్నారు. సంఘానికి ఒక మహిళా విభాగం ఏర్పాటు అవసరం గురించి ఆ ఇద్దరు చర్చించుకున్నారు. అయితే ఒకే సిద్ధాంతం కలిగి ఉన్నప్పటికీ సేవికాసమితి స్వతంత్ర ప్రతిపత్తితోనే పనిచేయాలని, దాని నాయకత్వం, సభ్యత్వం అంతా మహిళలకే పరిమితం కావాలని డాక్టర్‌జీ సూచించారు. అంటే మహిళా సంస్థ అనుబంధ సంస్థ కారాదు. స్వతంత్ర ప్రతిపత్తితో పని చేయాలని ఆశించారు. కానీ సేవికా సమితికి డాక్టర్ హెడ్గేవార్

# ఆర్‌ఎస్‌ఎస్- మహిళాశక్తి

తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కొన్ని సలహాలు సూచనలు కూడా ఇచ్చేవారు. మహిళా సంస్థకు మహిళే నాయకత్వం వహించాలన్న ఆయన ఊహ, మహిళా సంస్థను మహిళలే నడిపించాలన్న ఆయన దృష్టి స్మరణీయమైనవి. వార్ధాలో ఆరంభమైన సేవికా సమితి సిద్ధాంతం, ఆచరణ అంతా హిందూ ధర్మ సూత్ర జనితమే. భారతీయ చరిత్ర క్రమం నుంచి తీసుకున్నదే. శివాజీ మాతృమూర్తి జిజాబాయి వారికి ఆదర్శం. శాఖ అనే ప్రక్రియ ద్వారానే హిందూ ధర్మానికి గత వైభవాన్ని తీసుకురావడమే లక్ష్యం.

మహిళ అంటే సృష్టికే ఆదిశక్తి అని నమ్ముతుంది హిందూధర్మం. ఈ చరాచర జగత్తులో దృగ్గోచరమవుతున్న ప్రతి అంశం కూడా ఆ శక్తికి ప్రతిరూపమేనని కూడా చెబుతుంది. కాబట్టి చైతన్యమంటే అదే. ఆ సమున్నత శక్తినే మనం మహాలక్ష్మి, మహా సరస్వతి, మహాకాళి రూపంలో దర్శిస్తాం. పరబ్రహ్మ శక్తిగా కూడా ఆరాధిస్తాం. ప్రతి స్త్రీ ఆ శక్తి తత్త్వంలో భాగమే. భారతీయ నాగరికత మొత్తానికి ఇదే స్ఫూర్తికేంద్రం. భారతీయవ్యవస్థ బ్రహ్మచైతన్య శక్తిలో అంతర్భాగం. ఈ శక్తి కూడా స్త్రీ ఉనికి చుట్టూ అల్లుకున్నదే. అలాంటి శక్తిని చైతన్యపరచి, జాతినిర్మాణంలో ఉపయోగించాలన్నదే వందనీయ లక్ష్మీబాయి కేల్కర్ ఆశయం.

వందనీయ లక్ష్మీబాయిని ఆద్య ప్రముఖ సంచాలికగా మన్నిస్తారు. స్త్రీశక్తి సంఘటిత కావాలన్న ఆమె మంత్రం భారతదేశంలోనే కాదు, చాలా దేశాలలో కూడా తనదైన ప్రభావం చూపుతున్నది. ఎక్కడైనా సమితికి చోదక శక్తిగా ఉండేది హిందూత్వ విలువలే. మాతృత్వాన్ని జాతీయవాదం వైపు మళ్లించడానికి ఆమె గొప్ప ప్రేరణ. మాననీయ శాంతక్కాజీ (వెంకటరామయ్య శాంతకుమారి) ప్రస్తుతం సేవికాసమితి ప్రముఖ సంచాలికగా (అధిపతి) వ్యవహరిస్తున్నారు. నాగపూర్ కేంద్రంగా ఆమె కార్యకలాపాలు సాగిస్తారు. ఎంఎస్‌సీ ఎంఈడీ చేసి, బెంగళూరు భారతీయ విద్యా భవన్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన శాంతక్కాజీ సమితికి పూర్తి సమయం సంచాలికగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మాతృత్వం, కర్తృత్వం, నేతృత్వం అనే ఆశయాలతో పని చేస్తున్నామని ఆమె అంటారు. ఆర్‌ఎస్‌ఎస్ బాటలోనే విద్య, వైద్యం, సేవా రంగాలలో సమితి శరవేగంగా అడుగులు వేస్తున్నది. దేవీ అహల్యాబాయి స్మారక సమితి వంచిత మహిళలు, బాలికల కోసం పనిచేస్తున్నది. పిల్లల వికాసం కోసం పనిచేసే సంస్థ బాలగోకులం. సంస్కృతి సేవా ట్రస్ట్ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పనిచేస్తున్నది. ఇవి దేశమంతటా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

భారతీయ సమాజంలో కులాల మధ్య రిజర్వేషన్‌ల రద్దు అన్న అబద్ధపు నినాదంతో విభజన తేవడానికి రాహుల్ ప్రయత్నిస్తున్నారు. సైన్యంలో కూడా అలాంటి పంథాతో కలహాలు సృష్టించే పనిలో ఉన్నారు. మహిళలకు ప్రవేశం లేదన్న అజ్ఞానపు వ్యాఖ్య ద్వారా ఇప్పుడు హిందూ మహిళకు ఆర్‌ఎస్‌ఎస్ మీద దురభిప్రాయం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది భారత చరిత్రలోనే అత్యంత జుగుప్సాకర వ్యూహం. ★

03 జూన్ 2024, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




40లో

కథ


**తరాల స్నేహం**

- స్వాతీ శ్రీపాద





గెలుపోటములపై పందేల హోరు (ఆంధ్రప్రదేశ్) - 16
సంప్రదాయ మేథో సంపత్తి రక్షణకు ఒప్పందం (వేదిక) - 23
భారత్-ఇరాన్ సంబంధాల భవిష్యత్తు? (అంతర్జాతీయం) - 24
బీజేపీని ముంచబోయి... (జాతీయం) - 26
ప్రభుత్వం మారినా పోకడలు అవే...!! (తెలంగాణ) - 32
ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యాతో కీలక సహకారం (పరిశోధన) - 34
భారత్‌కు టీ-20 ప్రపంచకప్ ' చిక్కే'నా? (క్రీడ) - 43
ధైర్యముంటేనే 'లవ్ మీ'! (సినిమా) - 50



జూన్ 5
ప్రపంచ
పర్యావరణ
దినోత్సవం

# మన భూమి...

**కళ, సంగీతాల మాదిరిగానే ప్రకృతి ఆరాధన కూడా ఉమ్మడి భాష వంటిదే. దానికి రాజకీయ, సామాజిక హద్దులు ఉండవు. కానీ ప్రకృతిని ఆరాధించడానికీ, రక్షించుకోవడానికీ మధ్య ఇప్పుడు భేదాన్ని చూడరాదు. పుడమి మన నివాసం. ఇక్కడ 'మన' అంటే మానవాళి అని అర్థం. కాబట్టి భూమి లేదా పంచభూతాల పరిరక్షణ మానవాళి ఉమ్మడి బాధ్యత. ఆ ఆనందమయ వాతావరణాన్ని ఆహ్వానించడానికి కావలసిన మొదటి షరతు– మనిషికీ, ప్రకృతికీ మధ్య బంధం బద్దలు కాకూడదు. పర్యావరణ పరిరక్షణ ఇవాళ ప్రపంచం ముందు ఉన్న తక్షణ కర్తవ్యం. మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పర్యావరణం పట్ల మనం వహిస్తున్న విపరీత ధోరణే కారణం. అందుకే ప్రపంచం మొత్తం పర్యావరణాన్ని రక్షించుకోవడం గురించే మాట్లాడుతున్నది. అయితే ఈ మహా స్వప్నం సాకారం కావడానికి విశ్వం చిత్త శుద్ధితో పనిచేస్తున్నదా? ఆ ప్రశ్న ఉన్నప్పటికి మంచి ప్రయత్నమే జరుగుతున్నది. దాని ఫలితమే ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5). ప్రపంచ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ ఒకే నాణానికి అటు ఇటు ఉంటాయన్న వాస్తవం మనిషికి అర్థమవుతున్నదనే అనుకోవాలి.**

ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5వ తేదీన సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిర్వహిస్తారు. దీని ఇతివృత్తం 'భూమి పునరుద్ధరణలో, ఎడారీకరణ నిరోధ ప్రకియలో, కరవు కాటకాల నివారణలో ప్రతి ఒక్కరు నిర్వహించగలిగిన భూమిక'. నినాదం, 'మన భూమి, మన భవిష్యత్తు!'

దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత మొట్టమొదటి సారి మధ్య ఆసియా ప్రాంతానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించే అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఇతివృత్తంలో పేర్కొన్న మూడు అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తారు. ఐక్యరాజ్య సమితి ప్రారంభించిన 'యునైటెడ్ నేషన్స్ డికేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రెస్టొరేషన్ (2021–30)' కార్యక్రమం కూడా భూమి పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. జర్మనీ అధ్యక్షులు ఫ్రాంక్–వాల్టర్ స్టెయిన్‌మీర్ జూన్ 5న బెర్లిన్‌లోని బెల్లివ్యూ భవనంలో నిర్వహించే 'ఫోరం విత్ యూత్' కార్యక్రమంలో పాల్గొని 'యు.ఎన్. డికేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రెస్టొరేషన్' కింద ప్రకృతి పునరుద్ధణకు చేపట్టే కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఎంతో ప్రకటిస్తారు.

ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేదిక సౌదీ అరేబియా ఇప్పటికే భూక్షీణత, ఎడారీకరణను అడ్డుకునేందుకు 'సౌదీ గ్రీన్ ఇనిషియేటివ్' పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది. దీని కింద దేశంలో 30శాతం ప్రాంతాన్ని 'సురక్షిత ప్రకృతి' ప్రదేశంగా తీర్చిదిద్దనుంది. దీనితోపాటు దేశ వ్యాప్తంగా 10 బిలియన్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. కరవు, ఎడారీకరణ, భూక్షీణత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లోని 40 మిలియన్ హెక్టార్ల భూమిని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి సంప్రదాయిక దేశం సౌదీ అరేబియాలో 2015 పర్యావరణ దినోత్సవం సందర్భంగా 15 మంది మహిళలు రెండువేల ప్లాస్టిక్ బ్యాగ్‌లను రీసైకిల్ చేయడం అప్పట్లో వార్తలలో నిలిచింది.

## పడిపోతున్న భూమి స్థాయి

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1/5వ శాతం భూమి స్థాయి పడిపోయింది. సరస్సులు శుష్కించి పోతున్నాయి. అడవులు క్రమంగా అంతరిస్తున్నాయి. వ్యవసాయ క్షేత్రాలు చెత్తకుండీలుగా మారుతున్నాయి. ఈ స్థాయి పర్యావరణ అంశాల క్షీణత నమోదు కావడం ప్రపంచ వ్యాప్తంగా మూడు బిలియన్ల మంది ప్రజల జీవనంపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నది. ప్రస్తుత నిర్లక్ష్య వైఖరే కొనసాగితే పరిస్థితి మరింత దుర్భరం కాకమానదు. ఈ దుస్థితి నుంచి

# .. మన భవిష్యత్తు...

బయటపడేందుకు యు.ఎన్. డెకేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రిస్టోరేషన్ (పర్యావరణ పునరుద్ధరణకు దశాబ్దకాల లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి చేపట్టిన కార్యక్రమం)కు ప్రపంచ దేశాలు తమవంతు సహకారం అందిస్తున్నాయి. 2021లో ఐక్యరాజ్య సమితి ప్రారంభించిన ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం, ఇప్పటికే మానవాళివల్ల పర్యావరణానికి జరిగిన హానిని నివారించి, పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం. ఇందులో భాగంగా ఆయా దేశాలు రాబోయే మూడేళ్ల కాలంలో బిలియన్ హెక్టార్ల భూమిని (ఇది సౌదీ అరేబియా కంటే విస్తీర్ణంలో నాలుగు రెట్లు అధికం) పునరుద్ధరించడానికి శపథం చేశాయి. ఈ ప్రయత్నం ఇంకా ప్రారంభదశలోనే ఉన్నప్పటికీ, ఫలితాలు మాత్రం ఆశాజనకంగా ఉండటం విశేషం. 2030 నాటికి మనం కనీసం 1.5బిలియన్ హెక్టార్ల భూమిని పునరుద్ధరించగలిగితే భూమిపై 'వెబ్ ఆఫ్ లైఫ్' (పర్యావరణంలోని జీవులు, నిర్జీవుల మధ్య ఉండే సంబంధం)ను పరిరక్షించడం సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో పర్యావరణ క్షీణతను సమర్థంగా అడ్డుకోవాల్సిన తరుణం ఆసన్నమైందనే చెప్పాలి. ఇందులో భాగంగా పర్యావరణ మార్పులను అడ్డుకునేందుకు సౌదీ అరేబియా 2.5 బిలియన్ డాలర్లు ఖర్చుచేయనున్నది. మరో ముఖ్యాంశమేమంటే భూమికి జరుగుతున్న ప్రమాదాన్ని గుర్తించి దాన్ని నివారించడానికి ముందడుగు వేస్తున్న తొలితరం కూడా ఇదే. భావి తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత ఈ తరంపై ఉంది. ఇందుకోసం తక్షణం వన్యప్రాణులకు స్వర్గధామంగా ఉండేరీతిలో అడవుల పునరుద్ధరణ, నేల పరిరక్షణ పనులు తక్షణమే చేపట్టాలి. వీటివల్ల అడవులు, నదులు పునరుజ్జీవితమైతే కర్బన స్థిరీకరణ జరిగి భూవాతావరణానికి రక్షణ దొరుకుతుంది. అంతేకాదు వివిధ తెగల ప్రజలు నివసించే ప్రాంతాల చుట్టుపక్కల ప్రదేశాలు ప్రకృతి విపత్తుల నుంచి వారికి రక్షణ కల్పించే విధంగా రూపొందుతాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు తీవ్రమైన ప్రకృతి విపత్తుల బారిన పడటం చూస్తూనే ఉన్నాం. క్షీణదశలోని భూములను పునరుద్ధరించడానికి ఖర్చుచేసే ప్రతి డాలరుకు ప్రతిఫలంగా 30 డాలర్ల మేర ప్రయోజనం కలుగుతుంది. 1992లో బ్రెజిల్‌లోని రియో డి జనైరోలో జరిగిన సదస్సు సందర్భంగా వాతావరణ మార్పు, జీవవైవిధ్యం, భూక్షీణతను నివారించేందుకు ప్రపంచ దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇప్పుడు ఈ మూడు లక్ష్యాల సాధన ప్రపంచదేశాల ప్రథమ కర్తవ్యం. భూసారం పెరిగితే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సులభం. భూమిని ఎంతగా కాపాడతామో అంతేస్థాయిలో పేదరిక నిర్మూలన సాధ్యం కాగలదు. ఇప్పటివరకు పర్యావరణాన్ని ఎంతగానో పాడుచేశాం. కానీ ఇక ముందు దీన్ని నివారించి, పునరుద్ధరించడం ద్వారా రేపటి తరాలకు మంచి భవిష్యత్తును అందించవచ్చు.

### నష్టాన్ని పెంచుతున్న భూవినియోగం

ప్రపంచంలోని మొత్తం భూభాగంలో 54% వరకు పసరిక బయళ్లు (savannas), చిన్న పొదలు (shrublands), తేమ నేలలు (wetlands), మంచుటెడారులు (undra) ఆక్రమించాయి. ప్రపంచంలోని మొత్తం ఆహార ఉత్పత్తిలో 1/6శాతం వీటినుంచే జరుగుతోంది. అంతేకాదు ప్రపంచంలో 1/3వ వంతు కార్బన్ నిల్వలు కూడా ఈ ప్రాంతాల్లోనే ఉండటం విశేషం. 'యు.ఎన్. కన్వెన్షన్ టు కంబాట్ డిజర్టిఫికేషన్' ఇటీవల ఒక నివేదికను విడుదల చేసింది. ఈ భూముల వినియోగం విపరీతంగా పెరగడం వల్ల జీవ వైవిధ్యానికి వాటిల్లుతున్న నష్టాన్ని, వాతావరణంలో ప్రతికూల మార్పులకు కారణమవుతున్న తీరును ఈ నివేదిక వివరించింది. ఈ భూములపై ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్ల జనాభా తమ జీవనోపాధి కోసం ఆధారపడుతున్నారు. ఈ భూముల పరిరక్షణ, స్థిరీకరణకోసం ఆయా దేశాల ప్రభుత్వాలు తగిన విధానాలు రూపొందించాలని నివేదిక స్పష్టం చేసింది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం రెండు బిలియన్ల హెక్టార్ల విస్తీర్ణంలో భూక్షీణత నెలకొంది. ప్రపంచ జనాభాలో సగంమందిపై దీని ప్రతికూల ప్రభావం తీవ్రంగా కనిపించింది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో కొన్నివేల జాతుల మొక్కల ఉనికి ప్రమాదంలో పడింది. ప్రపంచ వ్యాప్తంగా భూక్షీణత క్రమంగా విస్తరిస్తుండటం, కరవు నెలకొనే కాలం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కసారి భూక్షీణత మొదలైతే దాన్ని పునరుద్ధరించడం చాలా కష్టం. అయినప్పటికీ పటిష్టమైన భూమి పునరుద్ధరణ చర్యల ద్వారా భూక్షీణతను, ఎడారీకరణను, కరవు కాటకాలను సమర్థంగా నిరోధించవచ్చు. దీనివల్ల జీవనోపాధులు పెరిగి, పేదరికం తగ్గుముఖం పడుతుంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న తీవ్రమార్పులను అడ్డుకొని, స్థితిస్థాపకతను కలుగజేయవచ్చు. కేవలం 15 శాతం భూమిని పునరుద్ధరించడం ద్వారా, అంతరించిపోయే ప్రమాదం ఎదుర్కొంటున్న జాతుల్లో 60శాతం వరకు రక్షించవచ్చు. ఈ భూక్షీణత, క్షామం, ఎడారీకరణకు

## బైష్ణోయీ ఉద్యమం

ఈ ఉద్యమం 1700 సంవత్సరంలో రాజస్థాన్‌లోని మార్వార్‌కు చెందిన ఖేజర్లీలో చోటుచేసుకుంది. అమృతాదేవి నాయకత్వంలో ఖేజర్లీ ప్రాంతంలోని బైష్ణోయీ గ్రామం దీని కేంద్రస్థానం.తాము పవిత్రంగా భావించే వృక్షాలను రాజసైనికులు కొట్టేస్తుంటే, అమృతాదేవి నాయకత్వంలో గ్రామ ప్రజలు వృక్షాలను కౌగలించుకోవడం ద్వారా దీన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా 363 మంది బైష్ణోయి గ్రామస్థులు మరణించారు. గురుమహారాజ్ జంభాజీ బోధనలకు ప్రభావితులైన గ్రామస్థులు మొక్కల పరిరక్షణకు పూనుకున్నారు. ఆయన 1485లో బైష్ణవీ మతాన్ని స్థాపించాడు. మొక్కలకు, జంతువుకు హాని తలపెట్టకూడదనేది ఈ మతసిద్ధాంతం. తర్వాత విషయం తెలుసుకున్న మహారాజు ప్రజలకు క్షమాపణలు చెప్పి, ఈ ప్రాంతాన్ని రక్షిత ప్రదేశంగా ప్రకటించాడు.



# పర్యావరణ దినోత్సవ నేపథ్యం, ప్రస్థానం




పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగించడమే ప్రధాన లక్ష్యంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏటా జూన్ 5వ తేదీన జరుపుకుంటారు. దీనికి ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు తమ మద్దతునిస్తున్నాయి. ముఖ్యంగా పర్యావరణానికి మద్దతుగా ఐక్యరాజ్యసమితి పరివ్యాప్త దినంగా కూడా దీన్ని పరిగణిస్తారు. మొట్టమొదటిసారి పర్యావరణ దినోత్సవాన్ని 1973లో జరుపుకున్నారు. సముద్రాల కాలుష్యం, అధిక జనాభా, భూతాపం, సుస్థిరాభివృద్ధి వంటి సమస్యలకు దీన్ని ఒక వేదికగా తీసుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఐక్యరాజ్య సమితి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు చేరువ కావడానికి ఒక వేదికగా ఉపయోగపడుతోంది. మొత్తం 143 దేశాలు ఇందులో భాగస్వాములు. ఏటా ఈ కార్యక్రమానికి ఒక 'ఇతివృత్తం', 'బిజినెస్ ఫోరం'ను నిర్ణయిస్తారు. నిజానికి 1972లో మొట్టమొదటిసారి 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' ప్రారంభించారు. అదే ఏడాది జూన్ 5-12 తేదీల మధ్యకాలంలో మానవ పర్యావరణంపై స్టాక్‌హోమ్‌లో, ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు సందర్భంగా దీన్ని ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో మానవ ప్రతిస్పందన, పర్యావరణాల ఏకీకరణపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1973లో కేవలం 'ఒకే భూమి' అనే ఇతివృత్తంతో మొదటి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (డబ్ల్యు.ఇ.డి) నిర్వహించారు.

ప్రపంచ దేశాలమధ్య కుదిరిన పర్యావరణ ఒప్పందాల్లో కొన్ని చట్టబద్ధంగా లోబడి ఉండాల్సినవి కాగా మరికొన్ని ప్రవర్తనా నియమావళికి సంబంధించినవి. ఈ ఒప్పందాలకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1910 నుంచి యూరప్, అమెరికా, ఆఫ్రికా దేశాల్లో ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. 1945 తర్వాత ఏర్పాటైన అనేక సాంకేతికపరమైన సంస్థలు ఈ పర్యావరణానికి సంబంధించిన ఇతివృత్తాలపై ఎన్నో వివరణలు ఇచ్చాయి. 1960 చివరి నాటికి పర్యావరణ ఉద్యమం అంతర్జాతీయంగా సంస్థాగత సహకారం

మూలమైన వాతావరణ మార్పును అడ్డుకోవడం మన తక్షణ కర్తవ్యం. ఈ నేపథ్యంలో లాటిన్ అమెరికాలోని, హై ఆండిస్ ప్రాంతానికి చెందిన ఐదు దేశాల్లోని వివిధ తెగల ప్రజలు వాతావరణ మార్పును తట్టుకునేవిధంగా నీటి నిల్వలను పెంచుకునేందుకు చేపడుతున్న చర్యలు ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 75శాతం విత్తన పంటలు, పండ్లతోటలు ప్రధానంగా తేనెటీగల వంటి పరాగసంపర్క కారకాలపై ఆధారపడుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా చేపడుతున్న వ్యవసాయ కార్యకలాపాలవల్ల ఈ పరాగసంపర్క కారక కీటకాల మనుగడ ప్రమాదంలో పడింది. వీటి పరిరక్షణ కోసం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక 'ప్రాక్టికల్ గైడ్'ను రూపొందించారు. దీన్ని అధ్యయనం చేయడం ద్వారా తేనెటీగలను ఏ విధంగా పరిరక్షించవచ్చునేది స్పష్టంగా తెలుస్తుంది. 2004లో సునామీ వచ్చిన తర్వాత శ్రీలంక పెద్దఎత్తున మడ అడవులను పెంచేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా నాటిన మొక్కల్లో మూడుశాతం మాత్రమే బతకడంతో తక్షణం తన వ్యూహంలో మార్పుతీసుకొచ్చి, మొక్కలు నాటడమే కాదు వాటి పరిరక్షణ కూడా చేపడుతోంది. ఈ మడ అడవులు సముద్ర తుపానులు, సముద్రపు అలలవల్ల నేల కోతకు గురికాకుండా రక్షణగా నిలుస్తాయి. మడ అడవుల పెంపకం కోసం శ్రీలంక ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల 5వేల కుటుంబాలు లబ్ధి పొందడమే కాదు నాలుగువేలమందికి ఉపాధి లభించింది.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

### ఫుడ్ వైడ్ వెబ్‌పై పరిశోధనలు

మొక్కలు కొన్ని వేల శిలీంధ్రాలు, బ్యాక్టీరియా సహాయం లేకుండా మనుగడ సాగించలేవు. అవి భూమిలోని పోషక పదార్థాలు మొక్కలు తమ వేళ్లద్వారా సులభంగా తీసుకునేందుకు సహకరిస్తాయి. ఇవి మొక్కల వేళ్లపై ఆశ్రయం కల్పించుకొని జీవిస్తాయి. ఈవిధంగా శిలీంధ్రాలు, బ్యాక్టీరియా మొక్కల మధ్య సమన్వయ జీవనం కనిపిస్తుంది. మరోవిధంగా చెప్పాలంటే ఆ విధంగా 'ఫుడ్ వైడ్ వెబ్'ను ఏర్పరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫుడ్ వైడ్ వెబ్'కు దోహదం చేస్తున్న 70 దేశాల్లోని వివిధ మొక్కలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. 'యునైటెడ్ నేషన్స్ డెకేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రెస్టోరేషన్' అడ్వయిజరీ బోర్డు సభ్యుడు, ప్రముఖ పర్యావరణవేత్త థామస్ క్రౌథర్ 'ఫుడ్ వైడ్ వెబ్' వల్ల కలుగుతున్న అద్భుతాలను ఆవిష్కరించడమే కాకుండా మొక్కలు, శిలీంధ్రాలు, బ్యాక్టీరియాల మధ్య ఉండే అనుసంధానాన్ని పరిరక్షించేందుకు 'యునైటెడ్ నేషన్స్ డెకేడ్ ఆన్ ఎకోసిస్టమ్ రిస్టోరేషన్' ఏవిధంగా కృషిచేస్తున్నదీ 'అవర్ లివింగ్ వరల్డ్' పేరుతో ఓ.టి.టి. ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ప్రసారం చేస్తున్న డాక్యుమెంటరీలో విపులంగా వివరించారు. అంతేకాకుండా 'కిస్ ది గ్రౌండ్' పేరుతో చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఇప్పటివరకు మనం గుర్తించని నేలకు సంబంధించిన వాతా వరణ పరమైన అంశాలను చక్కగా వివరించింది. ప్రముఖ నటుడు వూడీ హారిల్సన్ దీనికి వ్యాఖ్యాత. నేల పునరుద్ధరణ విధానాలు, దేశాలు వాతా వరణాన్ని ఏవిధంగా స్థిరీకరించవచ్చు, కోల్పోయిన పర్యావరణ వ్యవస్థలను పూర్వస్థితికి తీసుకువచ్చే విధానాలు, సమృద్ధిగా ఆహార సరఫరా సాధ్యమెలా? అన్న అంశాలపై ఈ డాక్యుమెంటరీ చక్కగా వివరించింది.

### రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు

ఈ శతాబ్దంలో భూతాపం పెరుగుదల 1.50 సెల్సియస్‌కు దిగువన ఉండేలా చూడాలంటే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వెలువడుతున్న కర్బన ఉద్గారాల పరిమాణాన్ని 2030 నాటికి సగానికి తగ్గించక తప్పదు. వాయు కాలుష్యాన్ని నిర్ధారిత సురక్షిత మార్గదర్శకాల ప్రకారం పరిమితం చేయడానికి చర్యలు తీసుకోకపోతే ఇది నిర్దేశిత పరిమాణాల కంటే

అవసరాన్ని నొక్కి చెప్పింది. 1972లో స్టాక్ హోంలో జరిగిన మానవ పర్యావరణంపై ఐక్యరాజ్య సమితి సదస్సు (యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ది హ్యూమన్ ఎన్విరాన్‌మెంట్) 'ఆరోగ్యకరమైన పర్యావరణ హక్కు'ను సుస్థిరం చేసింది. ఇది తర్వాతి సంవత్సరం 1973లో 'ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం' ఏర్పాటుకు దోహదం చేసింది. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాల్లో ప్రముఖంగా చెప్పుకోవలసింది 1997లో జరిగిన 'క్యోటో ప్రొటొకాల్', 2015లో జరిగిన 'ప్యారిస్ ఒప్పందం'. 2021, అక్టోబర్ 8న ఐక్యరాజ్య సమితి మానవహక్కుల మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 'ఆరోగ్యం సుస్థిర పర్యావరణం సార్వజనీన హక్కు'గా ఈ తీర్మానం పేర్కొంది. ఇదే మండలి తన 48/13 తీర్మానంలో కొత్తగా ఆమోదించిన ఈ హక్కును అమలు చేయడానికి ప్రపంచ దేశాలు ఇతర భాగస్వాములతో కలిసి పనిచేయాలని కోరింది. అదేవిధంగా 2022 జులై 28న ఐక్యరాజ్య సమితి సాధారణసభ ఆమోదించిన తీర్మానం, 'స్వచ్ఛమైన, ఆరోగ్యమైన, సుస్థిరమైన పర్యావరణం విశ్వజనీన హక్కు'గా పేర్కొంది.

50 శాతం పెరగడం తథ్యం. గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మాత్రమే కాదు వరదలు, తుపానులు, క్షామం వంటి విపత్తులను కూడా ప్రపంచం గత ఏడాది చవిచూసింది. అందువల్ల వాతావరణమార్పును పట్టించుకోకుండా, భూమి పునరుద్ధరణపై మాత్రమే దృష్టి కేంద్రీకరించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇది ఒక చేత్తో ఇస్తూ, రెండో చేత్తో పుచ్చుకోవడం వంటిదని గ్రహించాలి. ప్రపంచ దేశాలు బిలియన్ల హెక్టార్ల భూమిని పునరుద్ధరిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చాయి. అంటే ఈభూమి విస్తీర్ణం చైనా కంటే ఎక్కువ. ఆయా దేశాలు తమ హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ పర్యావరణ సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న సౌదీ అరేబియా, పునరుద్ధరణ లక్ష్యాలు, వాతావరణ మార్పులపై నత్తనడకన చేపడుతున్న కార్యక్రమాలు, ప్రకృతి పరిరక్షణతో పాటు కోట్లాదిమంది ప్రజల జీవన భృతులు, ఆహార భద్రతను మరింత పటిష్టం చేసేదిశగా సహచరదేశాలు మరింత వేగంగా చర్యలు చేపట్టేలా ప్రేరణ కలిగించాలి.

**భారత్ తీసుకుంటున్న చర్యలు**

మనదేశంలో అటవీ పర్యావరణ పరిరక్షణకోసం 1998 నుంచి 'పర్యావరణ అభివృద్ధి ట్రస్టు' (ఈఐటీ) పనిచేస్తోంది. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించి స్ఫూర్తి నింపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 2015లో దేశ రాజధాని ఢిల్లీలో కదంబ మొక్కను నాటారు. అదే ఏడాది ఇటలీ పర్యావరణ దినోత్సవానికి ఆతిథ్యం ఇవ్వగా 'ధరిత్రిని పోషించండి–జీవులకు శక్తినివ్వండి' అనేది ఇతివృత్తం. భూమికి, జీవులకు సూర్యుడినుంచి గ్రహించిన శక్తిని అందించేది మొక్కలు మాత్రమే. ప్రధాని కదంబ మొక్కను నాటడానికి నేపథ్యమిదే! 2018లో ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించాలి' అనేది నాటి ఇతివృత్తం. 2022 నాటికి 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'ను పూర్తిగా తొలగించాలని భారత ప్రభుత్వం ప్రతిన పూనిన సంవత్సరం ఇదే.

**రాజ్యాంగం ఏం చెబుతోంది?**

పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధమైన చర్యలు తీసుకోవాలో రాజ్యాంగంలో వివరించారు. 48–ఎ అధికరణం, పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రాల బాధ్యతలను స్పష్టంగా వివరించింది. 'దేశవ్యాప్తంగా అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో భాగంగా రాష్ట్రప్రభుత్వాలు పర్యావరణ నిరంతర పరిరక్షణ, అభివృద్ధికోసం కృషిచేయాలి' అని పేర్కొంది. 51–ఎ అధికరణం, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి ప్రాథమిక విధిగా పేర్కొంది. 'అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణుల పట్ల కనికరం చూపుతూ ప్రకృతిలో భాగమైన పర్యావరణ రక్షణ, అభివృద్ధి ప్రతి భారత పౌరుడి విధి' అని స్పష్టం చేసింది.

**మిషన్ లైఫ్**

భారత్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 'మిషన్ లైఫ్' (పర్యావరణ హిత జీవనశైలి) పేరుతో నిర్వహిస్తున్నారు. ఇందులో 'లైఫ్' (జీవం) అనే భావనను ప్రధాని నరేంద్రమోదీ నవంబర్ 1, 2021న గ్లాస్గోలో జరిగిన వాతావరణ మార్పు సదస్సు సందర్భంగా ముందుకు తీసుకువచ్చారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు వ్యక్తిగత జీవనశైలిలో తీసుకురావలసిన మార్పు ప్రాధాన్యతను ఈ భావన నొక్కి చెబుతోంది. ఇందుకోసం అనుసరించాల్సిన సుస్థిర జీవనశైలులకోసం ప్రపంచం అన్వేషించాల్సిన అవసరాన్ని ఈ భావన గుర్తుచేస్తోంది. మరోమాటలో చెప్పాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి పర్యావరణ పరిరక్షణకు



దోహదం చేస్తుంది. అక్టోబర్ 22, 2022న గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఏక్తానగర్‌లోని యూనిటీ స్టాచ్యూ వద్ద ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రస్ సమక్షంలో ప్రధాని నరేంద్రమోదీ 'మిషన్ లైఫ్'ను మనదేశంలో ప్రారంభించారు.

నిజానికి భారత్‌లో తరతరాలుగా అనుసరిస్తున్న సంస్కృతీ సంప్రదాయాలు, జీవనశైలి సుస్థిర పర్యావరణానికి దోహదం చేసేవే. మన పురాతన గ్రంథాలు కూడా ప్రకృతితో మమేకమై జీవించడమే ఆమోదయోగ్యమని స్పష్టం చేస్తున్నాయి. మిషన్ లైఫ్‌కు సంబంధించి తీసిన షార్ట్‌ఫిల్మ్‌లు పర్యావరణానికి అనుకూల జీవనశైలి విధానాలను చక్కగా వివరించాయి. అంతేకాదు మన జీవనవిధానం ప్రకృతిని పరిరక్షిస్తు ఏవిధంగా కొనసాగాలనేది వీటి ప్రధాన ఇతివృత్తం. ముఖ్యంగా మూర్ఖత్వంతో విచ్చలవిడి వినియోగం నుంచి, విజ్ఞతతో కూడిన సావధానయుక్తంగా ఉపయోగించుకోవడం వైపు ఏవిధం గా మరలాలో కూడా ఈ షార్ట్ ఫిల్మ్‌లు వివరించాయి.

**ఏడు ఇతివృత్తాలు**

మిషన్ లైఫ్‌ను ప్రోత్సహించేందుకు ఏడు ఇతివృత్తాల్లో నిక్షిప్తమైన 25 అంశాలను భారత ప్రభుత్వం గుర్తించింది. ఇంధనం, నీటిని పొదుపుగా వాడటం, ప్లాస్టిక్, ఈ–వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఆహారవ్యవస్థలను అవలంబించడం, వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి అనేవి ఏడు ఇతివృత్తాలు. మిషన్ లైఫ్ ప్రతి ఒక్కరూ రోజూ పాటించే అనుసరించే జీవనశైలిలో స్వల్ప మార్పులు తెచ్చుకున్నట్లయితే, క్రమంగా ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారి ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో ఒక క్రమశిక్షణాయుత జీవన విధానానికి దోహదం చేస్తుంది. ఈవిధమైన జీవనవిధానాలు కొన్ని సంవత్సరాల్లో వాతావరణంలో సానుకూల మార్పులు తప్పక తీసుకువస్తాయి.

ఇదే మిషన్ లైఫ్ ప్రధాన లక్ష్యం. అందువల్ల ప్రపంచం మారాలని తలపోసే వారు, ముందుగా ఆ మార్పును తమ నుండే ప్రారంభించాలి. పర్యావరణ మార్పునకు బాధ్యతాయుతంగా చేసే వ్యక్తిగత ప్రయత్నం మన ఉమ్మడి భవిష్యత్తును పరిరక్షిస్తుంది.

ఆవిధంగా పర్యావరణ మార్పునకు మనం చేసిన కృషి భావితరాలకు ఇప్పటికన్నా మంచి పర్యావరణాన్ని అందిస్తుంది. అడవులు మానవాళికి ఊపిరితిత్తుల వంటివి. నదులు నెత్తురు వంటివి. భూమి నివాసం. వీటిని ధ్వంసం చేసుకుంటూ ఏ జాతీ మనుగడ సాగించలేదు. అందుకే భూరక్షణ ఎంతటి మహోద్యమానికైనా సిద్ధంకావాలి. ఇవాళ పోరాడవలసింది భూమి కోసమే కాదు, భూరక్షణం కోసం కూడా. ★

# ప్రకృతితో మమేకమై...



పర్యావరణం మన మనుగడకు ఎంతో కీలకం. ఎందుకంటే ప్రకృతి మన ఉనికికే ముఖ్యమైన ప్రకృతి, సూర్యోదయం, నదుల పరవళ్లు, చెట్లు, అందమైన పూతోటలు, జంతువులు, పక్షులు వంటివి మనతో కలసి సహజీవనం చేస్తున్నాయి. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాటి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి, ప్రకృతి, జీవజాలం మన జీవనానికి ఎంత ముఖ్యమైనవో వివరించారు..

మానవులు, జంతువులు కలిసి జీవిస్తాయి. ప్రకృతి ప్రత్యేకతే ఇది.

భూమిపై జీవించే ప్రతి ప్రాణి కూడా ఆక్సిజన్ పీల్చుకుని, కార్బన్ దయాక్సైడ్‌ను బయటికి వదులుతూ ఉంటుంది. ఈ కార్బన్ దయాక్సైడ్‌ను చెట్లు పీల్చుకుని, ఆక్సిజన్‌ను బయటికి విడుదల చేస్తాయి. ఇదే ప్రకృతి మన మనుగడ కోసం చేసిన ఏర్పాటు. భారత్‌లో 24 శాతం వృక్ష సంపద ఉంది. చెట్లు పెంచే విస్తీర్ణం మరింత పెరుగుతోంది. గత ఏడేళ్లలో, చెట్ల పెంపకం 15,000 చదరపు కి.మీలకు పెరిగి, ప్రస్తుతం ప్రజా ఉద్యమంగా మారింది. ప్రజా ఉద్యమంగా మారిన ఈ చెట్ల పెంపకం కింద ప్రతి ఏడాది కోట్ల కొద్ది మొక్కలను ప్రజలు నాటుతున్నారు. పెద్ద పెద్ద చెట్లను కొట్టివేయకుండా కాపాడుతున్నారు. ఒకవేళ ఏదైనా అభివృద్ధి పథకాన్ని అటవీ ప్రాంతంలో చేపడితే.. ఎంత మొత్తం భూమిని తీసుకుంటున్నారో, ఆ మేర మరో ప్రాంతంలో కేటాయించేలా సరికొత్త విధానాన్ని మేము రూపొందిస్తున్నాం. అక్కడ అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, చెట్లను పెంచుతాం. ప్రతి ఏడాది అటవీ ప్రాంతం ఏ మేర పెరుగుతుందో మేము పర్యవేక్షిస్తున్నాం. ఈ సమాచారమంతా ప్రజలకు అందుబాటులో ఉంటోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి అధ్యయనాన్ని కూడా నిర్వహిస్తున్నాం. ఈ అధ్యయనంలో చెట్ల పెంపకం ప్రతి ఏడాది పెరుగుతూ ఉందని వెల్లడైంది.

జీవవైవిధ్యం కాపాడే దేశాలలో భారత్ ముఖ్యమైన దేశంగా ఉంది. భారత్‌లోనే పర్యావరణ జీవవైవిధ్యం అత్యధికంగా ఉంది. ప్రపంచ భౌగోళిక ప్రాంతంలో భారత్‌లో కేవలం 2.5 శాతం మాత్రమే ఉంది. ప్రపంచంలో ఉన్న వర్షపునీటి వనరులలో కేవలం 4 శాతమే భారత్‌లో ఉన్నాయి. ప్రపంచ జనాభాలో సుమారు 18 శాతం భారత్‌లోనే నివసిస్తున్నారు. జంతువులు, పక్షులు కూడా మనుషులతో కలిసి ఈ భూమిపై నివసిస్తున్నాయి. వీటన్నింటికీ కూడా భూమి, నీరు, ఆహారం కావాల్సి ఉంది. ప్రపంచ జీవ వైవిధ్యంలో 8 శాతం భారతే కలిగి ఉంది. ప్రపంచంలోని 70 శాతం పులులు, 70 శాతం ఆసియా సింహాలు, 30,000కు పైగా ఏనుగులు, 3,000 ఖడ్గమృగాలు భారత్‌లో ఉన్నాయి. మన దేశంలో ఉన్న జీవవైవిధ్యాన్ని ఇవి సూచిస్తున్నాయి. భారత్‌లో చెట్ల పెంపకం పెరగడం వల్ల, జీవవైవిధ్యం కూడా మెరుగు పడుతుంది. పులులు, సింహాల సంఖ్య, ఏనుగులు, ఖడ్గమృగాల సంఖ్య కూడా పెరుగుతోంది. ★

ప్రతి రోజూ ఉదయమే తులసికి ఒక చెంబెడు నీళ్లు పోసి, రావి చెట్టూ, వేప చెట్లకు ప్రదక్షిణం చేసి, ఇంట్లో పెంచుకున్న పూలచెట్ల పూలను, పండ్ల చెట్ల పండ్లను అర్పించి అనుదినం పర్యావరణ పరిరక్షణ దినాన్ని జరుపుకోవడం భారతీయుల సంస్కృతి. పాశ్చాత్య ప్రభావంతో ఆ సంస్కృతికి తిలోదకాలు ఇచ్చి, పరిసరాల్లో పచ్చదనానికి ఆస్కారం లేకుండా కాంక్రీటు జంగళ్లను నిర్మించుకోవడం , ఫ్యాషనుగా ఇంట్లో ఖరీదైన 'బోన్సాయి' వేప, రావి చెట్లను పెంచుకుంటూ, తమ హోదాను, ఆధునికతను చాటుకోవడం ఆనవాయితీగా మారింది.

***యత్ పిండే తత్ బ్రహ్మాండం..*** అంటారు. 'విశ్వంలో ఉండే అస్తిత్వం ప్రతి జీవిలో ఉంటుంది'.. దీని అర్థం. మన చర్యలు ప్రకృతిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. ప్రకృతితో, మమేకమై జీవించడం భారతీయ జీవన విధానం. బహుశా చెట్లు, పశువులు, పాములు వంటి జీవ ప్రాణులకు పూజలు చేసే ఏకైక దేశం భారత్. వాటి కోసం వివిధ రకాల పండుగలను నిర్వహిస్తారు. వెయ్యేళ్ల క్రితం, ప్రతి గ్రామానికి కూడా ఒక రిజర్వు అడవి ఉండేది. ఆ అడవిలో పశువులు మేతకు వెళ్లడానికి ఉండదు. చెట్లను కొట్టివేయడానికి కుదరదు. దీన్నే ఆ గ్రామానికి చెందిన అడవిగా పిలిచేవారు. ప్రకృతిని తల్లిగా కొలిచే విధానం వల్ల దేశంలో జీవవైవిధ్యం స్థిరంగా ఉండి, అటవీ విస్తీర్ణం పెరుగుతోంది.

**ప్రజా ఉద్యమంగా స్వచ్ఛ భారత్ అభియాన్**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014లో ఎర్ర కోటపై స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రకటించినప్పుడు ఎవరూ దీన్ని అంతగా పట్టించుకోలేదు. కానీ ప్రధానమమంత్రి ఆలోచనల్లో ఉన్న మర్మం ఏమిటంటే పరిశుభ్రమైన పరిసరాలు, పర్యావరణం అందించడం సాధారణ ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్నాయి. కనుక వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని సంకల్పించారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా 11 కోట్లకు పైగా మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. ప్రస్తుతం భారత్‌లో ప్రతి నగరం పరిశుభ్రత రేటింగ్‌లో పోటీపడుతోంది.

సహజ వనరులపై ఒత్తిడి లేకుండా అభివృద్ధి సాధనకు అవసరమైన వనరులను పెంపొందించే ఉత్పత్తులు, ప్రక్రియలపై ప్రస్తుతం భారతదేశం దృష్టి సారించింది. దీనికోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వనరులకు తిరిగి వినియోగించే అవకాశం ఉన్న 11 ప్రాంతాలను భారత్ గుర్తించింది. వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడం కార్యక్రమాన్ని ఒక మిషన్‌గా అమలు జరుగుతోంది. దీనికోసం గృహాలు, పొలాలు నుంచి వెలువడుతున్న వ్యర్థాలను సేకరించి ఆధునిక పరిజ్ఞానంతో వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకుని రావడం జరుగుతుంది, తుక్కు వాడిన బ్యాటరీలను సైతం సేకరించి రిసైకిల్ చేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తున్నారు.

**పునరావృత ఇంధనాల వినియోగానికి లక్ష్యం**

పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ తీసుకున్న భారతదేశం ప్రకటనకు పరిమితం కాకుండా గడువుకు ముందుగానే లక్ష్యాలను సాధించేందుకు చర్యలు ప్రారంభించింది. భారతదేశంతో సహా కొన్ని దేశాలు మాత్రమే లక్ష్య సాధన దిశలో అడుగులు వేస్తున్నాయి. 2030 నాటికి ఇంధన స్థాపన శక్తిలో 10 శాతం శిలాజేతర ఇంధన వనరులను వినియోగించాలన్న లక్ష్యాన్ని గడువుకు తొమ్మిది సంవత్సరాల ముందుగానే భారతదేశం సాధించింది. గత 6-7 సంవత్సరాల కాలంలో మన పునరుత్పాదక ఇంధన వనరులు దాదాపు 250 శాతానికి పైగా పెరిగాయి. పునరుత్పాదక ఇంధన స్థాపిత శక్తి కలిగిన మొదటి అయిదు దేశాల జాబితాలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. ముఖ్యంగా, సౌర శక్తిని వినియోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యంలో గత ఆరు సంవత్సరాల కాలంలో 15 రెట్లు పెరిగింది. ప్రస్తుతం సౌర శక్తిని ఉపయోగించి 50 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని భారతదేశం కలిగి ఉంది.

**జలరవాణా, బహుళ రవాణాలకు ప్రోత్సాహం**

దేశంలో జల రవాణా, బహుళ రవాణా వ్యవస్థల అభివృద్ధి వేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల రవాణా రంగంలో కాలుష్యం తగ్గి సామర్థ్యం మెరుగుపడుతుంది. గతంలో దేశంలో అయిదు నగరాలకు మాత్రమే పరిమితమైన మెట్రో రైలు సౌకర్యం 18కి పైగా నగరాల్లో అందుబాటులోకి వచ్చింది. మెట్రో వ్యవస్థతో ప్రైవేటు వాహనాల వినియోగం తగ్గింది. ఎక్కువ భాగం రైల్వే వ్యవస్థను విద్యుద్దీకరించడంతో పాటు విమానాశ్రయాల్లో సౌరశక్తిని వినియోగించ డానికి ప్రణాళికలు అమలు జరుగుతున్నాయి. 2014-18 ముందు కేవలం ఏడు విమానాశ్ర యాలలో మాత్రమే సౌర విద్యుత్ సరఫరా అయ్యేది. ప్రస్తుతం దేశంలో 50కి పైగా విమానాశ్రయాలు సౌరశక్తితో ఆధారపడి పని చేస్తున్నాయి.

★





# కూర్చున్న కొమ్మను

నానాటికీ విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వేసవి వచ్చిందంటే జనానికి వణుకు పుట్టేస్తోంది. విపరీతమైన ఎండలు, కాలుష్యం కారణంగా రాత్రి అయినా చల్లబడని భూమి, కనీసం ముఖమాటానికైనా వీచని గాలి తెర... అన్నీ కలిసి ప్రజలకు అనారోగ్య సమస్యలను అందిస్తున్నాయి. కాంక్రీటు జంగిళ్లల్లో జీవించడమే ఆధునికత అనుకుని నగరాలకు వచ్చిన ప్రజల జీవితాలు వేసవి వచ్చిందంటే దుర్భరమవుతున్నాయి.

పర్యావరణ కాలుష్యానికి దోహదం చేసే ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజరేటర్లు లేకుండా వేసవి గడవడం లేదు. దీనికి అదనంగా, ఎల్‌నినో వంటి దృగ్విషయాల కారణంగా రుతుపవనాలు కూడా గతి తప్పడంతో ఏడాది పొడవునా వేసవి కాలం ఉన్నట్టే ఉంటున్నది.

ఈ పరిస్థితులకు ప్రధాన కారణాలలో అడవుల నిర్మూలన ఒకటి. పెరిగి పోతున్న జనాభాతో పాటుగా అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు అడవులను నరికివేసి వ్యవసాయం కోసం భూమిని ఉపయోగించడం లేదా ప్రాజెక్టులను, జనావాసాలను నిర్మించడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. బ్రెజిల్ తర్వాత అత్యధికంగా అడవులను నరికివేసిన దేశం మనదే. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఈ చర్య పర్యావరణ, ఆర్థిక, సామాజిక గతిశీలతకు సంబంధించింది కావడం సహజమే. భారత్‌లో పెరుగుతున్న జనాభా, వ్యవసాయ భూముల డిమాండ్ కారణంగా అత్యంత వేగంగా అడవులను నిర్మూలిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. అడవుల పెంపకానికి సరైన వ్యూహం లేకుండా ఉన్నవాటిని నిర్మూలించడం అన్నది అక్కడి జీవవైవిధ్యం, జంతువుల సహజ ఆవాసాలు, పర్యావరణంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది.

గణాంకాల ప్రకారం 2001 నుంచి 2023 వరకూ దేశంలో అత్యధిక శాతంలో (60శాతం) అడవిని కోల్పోయిన ప్రాంతాలు 5. ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలే ఇందులో ముందున్నాయి. అందులో 324 కిలోహెక్టేర్ల (ఒక కెహెచ్ఎ 1000 హెక్టేర్లతో సమానం) మేరకు అడవుల నరికివేతతో అస్సాం మొదటి స్థానంలో ఉండగా, తర్వాత స్థానంలో 312 కెహెచ్ఎలతో మిజోరాం, 262 కెహెచ్ఎతో అరుణాచల్ ప్రదేశ్, 259 కెహెచ్ఎతో నాగాలాండ్, 240 కెహెచ్ఎతో మణిపూర్ వరుసగా ఉన్నాయని నివేదికలు చెప్తున్నాయి. దేశంలో దీని సగటు 66.6 హెక్టేర్లగా ఉండగా ఈ రాష్ట్రాలలో మాత్రం అత్యధికంగా ఉంది.

గత మూడు దశాబ్దాలలో భారత్‌లో అత్యధికంగా అడవుల నిర్మూలన జరిగిందని, 2015–2020 మధ్య అత్యధికంగా జరిగిందని యునైటెడ్ కింగ్డమ్‌కు చెందిన ఇంధనం, నిత్యావసర వస్తువుల ధరలను పోల్చే 'యుటిలిటీ బిడ్డర్' అనే వెబ్‌సైట్ విడుదల చేసిన నివేదిక పేర్కొంటోంది. ఈ ఐదేళ్లలో 668,400 హెక్టేర్ల అటవీ నిర్మూలనతో బ్రెజిల్ తర్వాతి స్థానంలో భారత్ ఉందని పేర్కొంది. పామాయిల్ సాగు, మాంసం కోసం పశువుల పెంపకం, నిర్మాణం కోసం చెట్లను కొట్టి రవాణా చేయడం కూడా అడవుల నరికివేతకు కారణాలలో కొన్ని. ఈ కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా 678,744 హెక్టేర్ల అడవుల నరికివేత కొనసాగుతోంది.

అడవుల నరికివేత కారణంగా ఏర్పడే నష్టాలు అనేకం. పర్యావరణపరంగా చూసినప్పుడు చెట్ల నీడ లేకపోవడంతో స్థానికంగా వేడి పెరిగిపోతుంది. ఉపరితల ఉష్ణోగ్రతల పెరుగుదల అంటే, భూమి ఉపరితల ఉష్ణోగ్రత పెరగడమే, గ్లోబల్ వార్మింగ్ అంటే ఇదే. ఇది మన స్వయంకృతాపరాధమేననడం అతిశయోక్తి కాదు.

పెరుగుతున్న ఉపరితల తాపమానాలు– తీవ్రమైన వడగాలులకు (హీట్‌వేవ్), మారిన వాతావరణ పద్ధతులకు దారితీసి పర్యావరణ వ్యవస్థకు, జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమిస్తాయి.

**వర్షపాతం తరుగుదల**

నీటి ఆవృత్తిలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయి. వాటి నష్టం అవక్షేపణను తగ్గిస్తుంది, ఇది వేడిని పెంచుతుంది. దీనికి తోడుగా అడవుల నిర్మూలన, పర్యావరణ మార్పులవల్ల వానలు తగ్గి కరువులు, జీవావరణ నష్టానికి కారణమయ్యి, వ్యవసాయం, నీటి సరఫరాపై ప్రభావం చూపిస్తుంది. అడవుల నరికివేత వలన వృక్షాల వ్యాప్తి తగ్గిన ఫలితంగా నీటి చక్రానికి అంతరాయం ఏర్పడుతుంది. ఇది మేఘాలు తక్కువగా ఏర్పడటానికి, స్వల్ప వర్షపాతానికి దారి తీస్తుంది.

ఆవాసాల విధ్వంసం, కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవులు అతి దోపిడీ వల్ల జీవవైవిధ్యం కోల్పోవడం వలన పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. జీవవైవిధ్యం పర్యావరణ వ్యవస్థలను బలహీనపరిచి, పరాగసంపర్కం, నీటి శుద్ధీకరణ, వాతావరణ క్రమబద్ధీకరణ వంటి సేవలను దెబ్బతీయడమే కాక మానవ, భౌగోళిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

అడవులను నిర్మూలించినప్పుడు, ఈ పర్యావరణ వ్యవస్థలలో నివసించే విభిన్న జాతులు స్థానభ్రంశం చెంది నిరాశ్రయం అవుతాయి లేదా నశిస్తాయి. ఫలితంగా జీవ వైవిధ్యం గణనీయంగా క్షీణిస్తుంది. తగ్గిన జీవవైవిధ్యం జన్యు వైవిధ్యాన్ని పరిమితం చేసి, మారుతున్న వాతావరణాలకు అనుగుణంగా జాతుల సామర్థ్యాన్ని అడ్డుకుని పర్యావరణ క్షీణతను మరింత పెంచుతుంది.



# నరుక్కుంటున్నాం...

అడవుల నిర్మూలన కారణంగా వాతావరణానికి బహిర్గతమయ్యే నేలలు భూక్షయానికి గురి అయ్యే అవకాశాలు ఎక్కువ. ఇది భూమి నాణ్యతను మరింత క్షీణింపచేస్తుంది. అటవీ నిర్మూలన ప్రధాన దుష్ప్రభావం భూక్షీణత, ఇది పర్యావరణ ఆరోగ్యం, వ్యవసాయ ఉత్పాదకతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుంది. అడవులను నరికినప్పుడు, నేల మూలకాలకు బహిర్గతమవుతుంది. చెట్ల రక్షణ కవచం, వేర్లకు బంధన స్వభావం లేకపోవడంతో, నేల త్వరగా దాని సమగ్రతను కోల్పోయి కోతకు, పోషకపదార్థాల క్షీణతకు, భూసార తగ్గుదలకు దారితీస్తుంది.

అడవుల నిర్మూలన అనేది అడవి, దాని చుట్టుపక్కల ప్రాంతాల సూక్ష్మ వాతావరణాన్ని మార్పునకు లోనుచేసి, స్థానిక వాతావరణ పరిస్థితులు సహా, మొత్తంగా ఆ ప్రాంత వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తుంది. ప్రకృతి సహజమైన అడవులు, జలాశయాలు, స్థలాకృతి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల కన్నా భిన్నంగా ఉండే స్థానిక వాతావరణ జోన్లను సూక్ష్మవాతావరణాలు అంటారు.

కర్బనవాయువు స్థాయుల పెరుగుదల అన్నది మానవులకే కాదు పర్యావరణానికి కీడు చేసే అంశం. అడవుల నరికివేత వాతావరణంలోని కర్బనవాయువు (సిఒ2) స్థాయులు పెరగడానికి దోహదం చేస్తుంది. గ్లోబల్ వార్మింగ్‌కు కారణమైన హరిత గృహ వాయువుకు ప్రాథమిక కారణం ఇదే.

నిజానికి అడవులు వాతావరణం నుంచి కర్బన వాయువులను పీల్చుకొని, ప్రధానంగా తమ జీవద్రవ్యంలోనూ, మట్టిలోనూ నిల్వ చేస్తాయి. అడవులను నిర్మూలించినప్పుడు, చెట్లలో నిల్వ చేసిన కార్బన్ వాతావరణంలోకి విడుదల అవుతుంది. అడవులను దహనం చేయడం లేదా లేదా విచ్ఛిన్నం చేయడం ద్వారా నిర్మూలించినప్పుడు అవి కర్బన వాయువును నిల్వచేసే సామర్థ్యాన్ని చాలావరకూ కోల్పోతాయి.

అడవుల నిర్మూలన వన్యప్రాణుల ఆవాసాలు నష్టానికి ప్రత్యక్షంగా దారితీస్తుంది. ఇది పర్యావరణంపై తక్షణ, తిరుగులేని ప్రభావాన్ని చూపిస్తుంది. ఆశ్రయం, ఆహారంతో పాటుగా విస్తారమైన జీవులకు పోషక స్థలంగా అడవులు సంక్లిష్టమైన పర్యావరణ వ్యవస్థలను కలిగి ఉంటాయి. ఈ అటవీ ప్రదేశాలను నరికివేయడం అన్నది, వాటిపై ఆధారపడిన వివిధ జాతుల జీవులు మరొక చోటును వెతుక్కుంటూ వెళ్లడానికి లేదా అంతరించి పోవడానికి కానీ ప్రత్యక్ష, ప్రధాన కారణమవుతుంది.

అడవుల కొట్టివేత అన్నది నీటి చక్రాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపడమే కాదు, జలవనరుల లభ్యత, పంపిణీని గణనీయంగా మారుస్తుంది. వర్ష పాతాన్ని గ్రహించి, నీటి ఆవిరిని తిరిగి వాతావరణం లోకి విడుదల చేయడం ద్వారా జలసంబంధ చక్రంలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయి. ఈ ప్రక్రియ వాతావరణంలో తేమ స్థాయిలను నిర్వహించడమే కాక, వాటర్‌షెడ్‌ల (పరీవాహక ప్రాంతాల మధ్యస్థలం)లో నీటి ప్రవాహాన్ని నియంత్రిస్తుంది.

**అడవుల నిర్మూలన ద్వారా వృక్ష, జలసంపద ఎలా నష్టపోతామో క్లుప్తంగా-**

అడవులలో జీవించే అనేక జాతులు ఇతర వాతావరణాలలో జీవించలేవు, మనలేవు. వాటి ఆవాసాలు, ఆశ్రయాలు ధ్వంసం అయినప్పుడు అవి కొత్త పరిసరాలలో ఇమడలేకపోవడం అన్నది వాటి జనాభా క్షీణతకు దారి తీస్తుంది.

చెట్లు, ఇతర వృక్షాలను తొలగించడం అన్నది ఈ పర్యావరణ వ్యవస్థలకు ప్రత్యేకమైన మొక్కలు, జంతువులను తొలగించడం ద్వారా జీవవైవిధ్యం తగ్గుతుంది.

అడవుల నిర్మూలన వల్ల తరచుగా అడవులలోని మిగిలిన ప్రాంతాలు ఛిన్నాభిన్నం అవుతాయి. దీనివల్ల భిన్న జాతులు చిన్న సమూహాలుగా వేరు అవుతాయి. జన్యుపరంగా తక్కువ వైవిధ్యం కలిగి ఉండేవి, అంతరించిపోయే ప్రమాదాన్ని ఎక్కువ కలిగి ఉంటాయి.

సారవంతమైన భూములు ఎడారులుగా మారే మరుభూమి ప్రక్రియను అడవుల నిర్మూలన గణనీయంగా ప్రోత్సహిస్తుంది. సాధారణంగా అడవుల నిర్మూలన, కరవు, ఆ భూమికి తగని సాగు చేపట్టడం వంటి కారణాల ఫలితంగా ఈ పరివర్తన సాధ్యమవుతుంది. అడవులను కొట్టివేసినప్పుడు, వృక్ష ఛాయ లేకపోవడం అన్నది భూసార క్షీణతకు దారి తీయడమే కాదు, తేమను ఎక్కువకాలం నిలిపి ఉంచలేకపోవడం వల్ల ఎడారి వంటి పరిస్థితులు విస్తరించడానికి దోహదం చేస్తుంది.

**వాయు కాలుష్యం పెరుగుదల**

అడవుల నిర్మూలన అనేది వాయు కాలుష్యానికి గణనీయంగా దారి తీస్తుంది. విస్తృత స్థాయిలో అడవులను తొలిగించిన ఫలితంగా వచ్చే ఈ పరిణామాన్ని సాధారణంగా పరిగణనలోకి తీసుకోరు. చెట్లు సహజంగా గాలి నుండి కాలుష్య కారకాలను సహజంగా వడపోసి, కార్బన్ డయాక్సైడ్ వంటి వాయువులను గ్రహించి, ఆక్సిజన్‌ను తిరిగి వాతావరణంలోకి విడుదల చేస్తాయి. చెట్లను నరికివేసినప్పుడు, ఈ సహజ వడపోత వ్యవస్థను కోల్పోవడమే కాక, అటవీ నిర్మూలన చర్య తరచుగా వాయు కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తుంది.

**ఆరోగ్య పరిణామాలు**

శరీరం సహజంగా తగినంతగా చల్లబడి, సాధారణ ఉష్ణోగ్రతను కలిగి ఉండనప్పుడు ఉష్ణ ఒత్తిడి ఏర్పడుతుంది. అటవీ నిర్మూలన ఈ పరిస్థితిని తీవ్రం చేయడంతో, ఇది స్థానిక- భూగోళ ఉష్ణోగ్రతలు పెరగడానికి దోహదం చేస్తుంది.

చెట్లు, అడవులు నీడను అందించడం, జల విసర్జన ద్వారా తేమను విడుదల చేయడంవల్ల తగిన, సాధారణ వాతావరణం ఏర్పడుతుంది. ఇది పర్యా వరణాన్ని చల్లబరుస్తుంది.

### శ్వాసకోశ సమస్యలు

ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేసే శ్వాసకోశ రుగ్మతలు అటవీ నిర్మూలన వంటి పర్యావరణ కారకాల వల్ల మరింత తీవ్రమవుతాయి. అడవులను నరికివేయడం వల్ల వాయు కాలుష్యం– పార్టిక్యులేట్ మ్యాటర్, కార్బన్ మోనాక్సైడ్, ఓజోన్, అస్థిర కర్బన సమ్మేళనాలు అన్నీ పెరిగి శ్వాసకోశ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. అటవీ నిర్మూలనతో ముడిపడి ఉన్న శ్వాసకోశ రుగ్మతలను ఎదుర్కోవ డానికి, అడవుల పెంపకం, కఠినమైన భూవిని యోగం, చెత్తను దహనం చేయడంపై నియంత్రణల ద్వారా గాలి నాణ్యతను మెరుగుపరచడం అవసరం.

### నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు

అటవీ నిర్మూలన వలన నీటి నాణ్యత క్షీణించి, కలుషిత నీటి సరఫరా వల్ల నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు పెరిగే అవకాశముంది. అడవులను నరికి వేయడం వలన వర్షపాతాన్ని గ్రహించి, కాలుష్య కారకాలను వడపోసే చెట్లు తగ్గి, కాలుష్యాల ప్రవాహాన్ని పెంచుతుంది. ఇది నదులు, సరస్సుల వంటి నీటి వనరులను కలుషితం చేస్తుంది.

### ఆహార భద్రతా సమస్యలు

అడవీ నిర్మూలన పర్యావరణ వ్యవస్థలను, వ్యవసాయ ఉత్పత్తిని భంగపరిచి ఆహారభద్రతను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. అంటే, పోషకాహార అందుబాటును పరిమితం చేస్తుంది. చెట్లను కొట్టడమన్నది భూకోతకు , నీటి చక్రాలలో మార్పుకు, పర్యావరణ మార్పులకు దారి తీసి పంట సేద్యాన్ని, పశుసంపద పెంపకాన్ని ప్రభావితం చేస్తుంది. ఇటువంటి ప్రాంతాలలో ఆహార భద్రతా సమస్యను పరిష్కరించేందుకు స్థిరమైన భూ నిర్వహణ, అడవుల పెంపకం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు అవసరం అవుతాయి.

ఇక. అడవుల నిర్మూలన వ్యక్తులను, భూములను ప్రమాదకర అల్ట్రావయొలెట్ (యువి) కిరణాలకు కూడా బహిర్గతం చేస్తుంది. చర్మ క్యాన్సర్, ఇతర ఆరోగ్య సమస్యలు దీనివల్ల పెరుగుతాయని నిపుణులు చెప్తున్నారు. చెట్లు, అడవులు అనేవి భూమికి సహజమైన పందిరిలా ఉండి దానిని ప్రత్యక్ష సూర్యరశ్మి నుంచి కాపాడతాయి. ఈ చెట్లను తొలగించినప్పుడు, ఈ రక్షణ కవచం తొలిగిపోయి యువి రేడియేషన్‌కు ఎక్కువగా బహిర్గతం అవుతాం.

### ఔషధ వనరుల నష్టం

అడవుల నిర్మూలన వల్ల ఔషధ వనరులను కోల్పోవడం అన్నది ఆరోగ్య సంరక్షణ, సాంప్రదాయ వైద్యంపై గణనీయమైన ప్రభావాలను చూపుతుంది. ఔషధ మొక్కలు, మూలికలు సాంప్రదాయ చికిత్సలలో, ఔషధ పరిశోధనలలో ఉపయోగించే ఇతర సహజ సమ్మేళనాల వంటి గొప్ప వనరులకు అడవులు మూలంగా ఉంటాయి. ఈ విలువైన వనరులను కోల్పోవడం వైద్యపరమైన ఆవిష్కరణలను పరిమితం చేయడమే కాక అటవీ–ఆధారిత చికిత్సలపై ఆధారపడే సమాజాలను ఆటంక పరుస్తుంది. విస్తృత ప్రజారోగ్య ప్రభావాలను అడవుల నిర్మూలన పట్టి చూపుతుంది.

### గ్లోబల్ వార్మింగ్

అడవుల నిర్మూలన వాతావరణంలోకి గణనీయమైన మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ (సీఓ2)ను విడుదల చేయడం ద్వారా గ్లోబల్ వార్మింగ్‌కు దోహదం చేస్తుంది. అడవులు సీఓ2ని గ్రహించే కార్బన్ సింక్‌లుగా పనిచేస్తాయి. అయితే చెట్లను కొట్టివేసినప్పుడు లేదా కాల్చినప్పుడు, అవి నిల్వ చేసిన కార్బన్‌ను విడుదల చేసి, హరితగృహ వాయు ఉద్గారాలకు దోహదం చేస్తాయి. ఈ ప్రక్రియ హరిత గృహ ప్రభావాన్ని తీవ్రతరం చేసి, ఉష్ణోగ్రతలు పెరగడానికి, వాతావరణ నమూనా లను మారడానికి దారితీస్తుంది.

భారతదేశంలో అటవీ నిర్మూలన వాతా వరణ మార్పులను మరింత తీవ్రతరం చేసి, వడ గాలులు, అనూహ్య వాతావరణం, పర్యావరణ వ్యవస్థలపై, మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాలకు దారితీస్తోంది. అటవీ విధ్వంసం అన్నది జీవవైవిధ్య నష్టం, వాతావరణ మార్పు వనరుల క్షీణతతో సహా శాశ్వత పర్యావరణ హానిని కలిగించి, భవిష్యత్తు తరాలకు భారం అవుతుంది. ప్రకృతి ప్రకోపాల నుంచి రక్షిత అడ్డంకులుగా అడవులు పని చేస్తాయి. వీటిని తొలగిస్తే, కొండచరియలు విరిగిపడటం, వరదలు, భూక్షయ ప్రమాదం తీవ్రతరమవుతుంది. అందుకే, "వృక్షో రక్షతి రక్షిత:" అన్నారు పెద్దలు!

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల అనేక లాభాలు కనిపిస్తున్నాయి.



### గాలి నాణ్యత పెరుగుదల

మానవజాతికి సైన్స్ అనేది ఒక గొప్ప వరం. అయితే, దానివల్ల సంభవిస్తున్న కాలుష్యం శాపంగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ప్రపంచంలోని 15 అత్యంత కాలుష్యపూరిత నగరాలలో 14 భారత్‌లోనే ఉన్నాయి. గాలి కాలుష్య సమస్యను పరిష్కరించేందుకు, కేంద్ర ప్రభుత్వం జనవరి 2019లో జాతీయ స్వచ్ఛ వాయు కార్య క్రమాన్ని ఆవిష్కరించింది. ఈ ఐదేళ్ల ప్రణాళిక కింద 2024 నాటికి పీఎం 2.5, పీఎం 10 కాలుష్య స్థాయిలను 20–30 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలుత 102 నగరాల్లో అమలు చేసిన ఈ పథకాన్ని, ఆ తర్వాత దేశవ్యాప్తంగా 122 నగరాలకు విస్తరించారు. వాయుకాలుష్యాన్ని నియంత్రించి, కాలుష్య నిర్వహణ చర్యలు ఈ కార్యక్రమంలో భాగం. ఫలితంగా దేశంలో మంచి గాలి నాణ్యత ఉన్న రోజులు 2016లో 106 ఉంటే, అవి 2020 నాటికి 218కి పెరిగాయి. గాలి నాణ్యత లేని రోజులు 156 నుంచి 56కి దిగొచ్చాయి. కాలుష్య నివారణలో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు సఫార్, సమీర్ యాప్‌లను కూడా కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించింది.

### విద్యుత్ వాహనాలకు ప్రోత్సాహం

దేశంలో పలు పర్యావరణ సంస్థలు విడుదల చేసిన వివిధ నివేదికల్లో, 61 శాతం గాలి కాలుష్యం వాహనాల పొగ వల్లనే ఏర్పడుతుందని వెల్లడైంది. ఇది గుర్తించిన ప్రభుత్వం, భారత్‌లో వేగంగా హైబ్రిడ్, విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టి, వాటి తయారీని చేపట్టడం కోసం నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్ కింద ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్(హైబ్రిడ్) అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్(ఫేమ్) పథకాన్ని ఆవిష్కరించింది. మార్చి 31, 2019న ఈ పథక తొలి దశను విజయవంతంగా పూర్తి చేసుకుంది. రెండో దశ ఏప్రిల్ 1, 2019 నుంచి ప్రారంభమైంది. దీంతో కాలుష్యాన్ని తగ్గించి, ప్రజల డబ్బును, ఆరోగ్యాన్ని కాపాడవచ్చని భావిస్తోంది.

### బ్యాటరీ నిల్వ సాంకేతికత...

అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ)లు నూతన తరం అధునాతన నిల్వ సాంకేతికతలు. ఇవి విద్యుత్ శక్తిని ఎలక్ట్రోకెమికల్ లేదా రసాయన శక్తిగా నిల్వ చేయగలగడమే కాక అవసరమైనప్పుడు దానిని తిరిగి విద్యుత్ శక్తిగా మార్చగలవు. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, అధునాతన విద్యుత్ గ్రిడ్లు, సోలార్ రూఫ్ టాప్ (ఇంటిపైన) వంటివి బ్యాటరీని భారీగా వినియోగించే రంగాలుగా ఉన్నాయి. ఇవన్నీ రానున్న సంవత్సరాలలలో భారీ వృద్ధిని సాధించగలవని అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద వృద్ధి రంగాలను బ్యాటరీ సాంకేతికతలు నియంత్రిస్తాయని అంచనా. ★

రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ పురస్కారం దక్కినా, అది అందుకుంటున్నట్టు వార్తాపత్రికలలో ఫోటో వచ్చినా గొప్ప సంతోషంగానే ఉంటుంది. కానీ ఆ అత్యున్నత పౌర పురస్కారం రాష్ట్రపతి నుంచి అందుకున్న నాటి ఫోటో మావోయిస్టులు పంచిపెట్టిన కరపత్రంలో కనిపిస్తే ఏమౌతుంది? జీవితంలో అంతకంటే భయానక క్షణాలు ఉండవు. హేమ్‌చంద్ మాంఝీ పరిస్థితి ఇప్పుడు అదే.



# ఒక గిరిజన పద్మశ్రీ పురస్కార గ్రహీత వ్యథ

ఆయనొక గిరిజనుడు. 20వ ఏడు వచ్చినప్పటి నుంచి తన గిరిజన సమాజానికి వైద్యసేవలు అందిస్తున్నారు కూడా. అందుకే ఆయనను ఆయన వర్గీయులంతా సగౌరవంగా 'వైద్యరాజ్' అని పిలుచుకుంటారు కూడా. చత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో ఉన్న మారుమూల గ్రామంలో ఆయన ఉంటారు. 72 ఏళ్ల హేమ్‌చంద్ సేవలు అసమానమైనవి. సంప్రదాయక గిరిజన వైద్యానికి ఆయన గొప్ప గుర్తింపు తెచ్చారు కూడా. ఆయన కేన్సర్‌కు కూడా మందు ఇచ్చేవారు. వీటికి గుర్తింపుగానే ఆయనను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయన ఏమీ కాదు. పద్మశ్రీ తిరిగి ఇస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు, గడచిన 52 ఏళ్లుగా చేస్తున్న వైద్యానికి కూడా స్వస్తి పలికారు. కారణం మావోయిస్టుల బెదిరింపు.

మే 26, 2024న రాత్రి హేమ్‌చంద్‌ను నక్సలైట్లు బెదిరించారని పోలీసులు కూడా తెలియచేశారు. చమేలీ, గౌరదండ గ్రామాలలో నిర్మిస్తున్న రెండు మొబైల్ టవర్లకు నిప్పు పెట్టిన నక్సల్స్ అక్కడే ఒక బ్యానర్ కట్టి, కొన్ని కరపత్రాలు కూడా వదలి వెళ్లారు. ఇవన్నీ చోటేదొంగార్ పోలీస్ స్టేషన్ పరిధిలోనివే. ఆ కరపత్రంలోనే హేమ్‌చంద్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నప్పటి ఫోటో ప్రచురించారు. ముడి ఇనుము ఖనిజానికి సంబంధించి చోటే దొంగర్‌లో నిర్మిస్తున్న ఒక ప్రాజెక్టులో హేమ్‌చంద్‌కు పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టాయని నక్సల్ కరపత్రంలో ఆరోపించారు.

ఈ ఆరోపణలను హేమ్‌చంద్ చాలా ధైర్యంగా ఖండించారు. ఆ ఇనుప ఖనిజం ప్రాజెక్టుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తాను ఎలాంటి ముడుపులు తీసుకోలేదని ఆయన ప్రకటించారు. ముడుపులు తీసుకున్న వ్యక్తి పురస్కారం ఎలా తీసుకుంటాడని మావోయిస్టులు ప్రశ్నించడం కూడా ఆయనను బాధించినట్టే ఉంది. 'నేను పద్మశ్రీ పురస్కారం కోరుకోలేదు. అది దశాబ్దాలుగా నేను ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇచ్చిన పురస్కారం. అలాగే చిరకాలంగా వనమూలికా వైద్యానికి తెచ్చిన గుర్తింపును చూసి ఇచ్చినది.కేన్సర్ సహా పలు రుగ్మతలకు నేను జాది–బూతా (వనమూలిక) ఇచ్చి నయం చేశాను' అని ఆయన ఘాటుగానే స్పందించారు.

చూడబోతే నక్సలైట్లు మాంఝీ కుటుంబం మీద ఏదో కక్ష పెంచుకున్నట్టే కనిపిస్తుంది. 'ఇంతకు ముందు వాళ్లు (నక్సల్స్) నా మేనల్లుడు కోమల్ మాంఝీని కూడా చంపారు. ఇలా ముడి ఇనుప ఖనిజం ఆరోపణలతోనే చంపారు. నిజానికి అవన్నీ అబద్ధాలే. అసలు మా కుటుంబమే నక్సల్స్ వల్ల ప్రాణభయంతో జీవిస్తున్నది అని కూడా ఆయన వివరించారు.

నిరుడే కోమల్‌ను నక్సలైట్లు హత్య చేశారు. పోలీసులను ఆశ్రయించగా వారే రక్షణ కల్పిస్తున్నారు. నిజానికి హేమ్‌చంద్ వైద్యుడు మాత్రమే కాదు, సమాజ సేవకుడు కూడా. పోలీసు పహారాలోనే ఆయన గిరిజన ప్రాంతాలలోని సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతూ ఉండేవారు. అందులో ప్రధానంగా గిరిజనులకు ఇళ్లు కట్టివ్వడం గురించి అధికారులతో నిరంతరం మాట్లాడుతూ ఉండేవారు. ఇంతకీ నక్సలైట్లు ఆరోపించిన ముడి ఇనుప ఖనిజం ప్రాజెక్టు జైస్వాల్ నీకో ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ వారిది. ఆ ప్రాజెక్టును, ఆ కంపెనీని కూడా చిరకాలంగా నక్సలైట్లు వ్యతిరేకిస్తున్నారు.

కోమల్‌కు పట్టిన దుస్థితి హేమ్‌చంద్‌కు పట్టకుండా పోలీసులు కాపాడగలరా? వేచి చూడాలి. అయినా పద్మ పురస్కారాల మీద, నిజానికి ప్రభుత్వం ఇచ్చే ఏ పురస్కారం మీద గౌరవం లేని నక్సల్స్ ఇప్పుడు ఈ తర్కం ఎందుకు తీసుకువచ్చినట్టు? ముడుపులు తీసుకున్న నీవు పురస్కారం ఎలా తీసుకున్నావని నిలదీయడం ఎందుకు? ★

72 ఏళ్ల హేమ్‌చంద్ సేవలు అసమానమైనవి. సంప్రదాయక గిరిజన వైద్యానికి ఆయన గొప్ప గుర్తింపు తెచ్చారు కూడా. ఆయన కేన్సర్‌కు కూడా మందు ఇచ్చేవారు. వీటికి గుర్తింపుగానే ఆయనను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయన ఏమీ కాదు. పద్మశ్రీ తిరిగి ఇస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు, గడచిన 52 ఏళ్లుగా చేస్తున్న వైద్యానికి కూడా స్వస్తి పలికారు. కారణం మావోయిస్టుల బెదిరింపు.



సార్వత్రిక, రాష్ట్రశాసనసభ, ఎన్నికల్లో జూన్ 4 న వచ్చే ఫలితాలు, ఫలితాల ప్రభావం వల్ల ఏర్పడే పరిణామాలపై రాష్ట్రంలో ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో గెలుపు ఓటములపై లెక్కలు వేసుకుంటుండగా, అధికారం తమదంటే తమదని వైసీపీ, తెలుగుదేశం పార్టీలు చెప్పుకుంటున్నాయి. ఒకవేళ వైసీపీ ఓటమి పాలైతే కొత్త ప్రభుత్వం తమ పరిస్థితి ఏమిటని అక్రమార్జన ఆరోపణలు ఎదుర్కొంటున్న మద్యం, ఇసుక, మైనింగ్ మాఫియా కలవరపడుతున్నాయి.

# గెలుపోటములపై

రాష్ట్రశాసనసభ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత వివిధ వర్గాలు వెల్లడించిన అభిప్రాయాలను బట్టి ఎన్డీఏ కూటమిదే విజయమని అందరూ భావిస్తుండగా, ఈ ప్రచారంతో వైసీపీ శిబిరంలో నైరాశ్యం ఏర్పడింది. అయితే దీనికి అడ్డుకట్టవేసేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఐప్యాక్ టీమ్‌తో మాట్లాడుతూ, 151పైగా సీట్లు వస్తున్నాయని చెప్పడంతో అప్పటి వరకు నిరుత్సాహంతో ఉన్న పార్టీలో ఉత్సాహం వచ్చింది. బెట్టింగ్‌లు జోరందుకున్నాయి.

వైసీపీకి లేదా కూటమికి 100 దాటి మెజారిటీ వస్తుందని, పలు జిల్లాల్లో అభ్యర్థులకు వచ్చే మెజారిటీలపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ప్రధానంగా పులివెందులలో జగన్, కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన్ కల్యాణ్‌లకు వచ్చే మెజారిటీపై జోరుగా పందాలు కాస్తున్నారు. మంగళగిరిలో మరలా లోకేష్ ఓడిపోతాడని వైసీపీ నాయకులు బెట్టింగ్‌లు కడితే 20 వేల మెజారిటీతో గెలుస్తాడని తెదేపా వర్గీయులు పందాలు కాస్తున్నారు. బెట్టింగ్ రాయుళ్లు ఈ లెక్కల్లో ఉంటే ఇసుక, మైనింగ్ మాఫియా, మద్యం తయారీదారుల్లో మాత్రం ఆందోళన నెలకొంది. గెలిస్తే పరవాలేదని, తమ వ్యాపారం మరో అయిదేళ్లు యథేచ్ఛగా సాగుతుందని, ఓడిపోతే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉండవచ్చుజని వైసీపీవారు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా డిస్టిలరీల కబ్జా, నాసిరకం మద్యం తయారీ, విక్రయాలపై కేసులు నమోదు కావచ్చని మద్యం తయారీదారులు భయపడుతున్నారు. ఇప్పటి వరకు లెక్కలేకుండా దోపిడీ చేసిన ఇసుక, మైనింగ్ మాఫియా కూడా కొత్త ప్రభుత్వం ఏర్పడితే జరిగే ప్రతికూల పరిమాణాలపై భీతిల్లుతోంది.

**ఓట్ల లభ్యతపై విశ్లేషణ**

ఎన్నికల ఫలితాలు వచ్చేలోపు వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిత్యం ఓట్ల లెక్కలు, విశ్లేషణల్లో మునిగి తేలుతున్నారు. ఏ వర్గం ప్రజలు ఎవరికి ఓటేసి ఉంటారో అన్న అంచనాలపై లోతుగా చర్చించుకుంటున్నారు.

ప్రత్యర్థి శిబిరం అంచనాలు ఎలా ఉన్నాయా అని ఆరాలు తీస్తున్నారు. ఈ సమాలోచనల గొడవల్లో తాముంటే, మధ్యలో పందెం రాయుళ్ల దెబ్బకు నేతలు తలలు పట్టుకుం టున్నారు. పోలింగ్ సరళి ఎవరికి అనుకూలంగా ఉందో తెలుసుకోవడానికి ప్రధాన పార్టీలు ఇప్పటికే తమ సాంకేతిక బృందాలతో విశ్లేషించుకున్నాయి. ఈ బృందాలు రకరకాల నమూనాలతో లెక్కలుగట్టి ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో విశ్లేషించి నివేదికలు అందజేశాయి. అన్ని పార్టీల్లో ఈ కసరత్తు ఇప్పటికే పూర్తయింది. క్షేత్ర స్థాయి సమాచారంతో ఈ నివేదికలను సరిపోల్చుకునే పనిని కొత్తగా ఈ బృందాలకు అప్పగించారు. ఉదాహరణకు.. విదేశీ పర్యటనకు వెళ్లే ముందు ముఖ్యమంత్రి జగన్ ఐప్యాక్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పెరిగిన ఓట్ల శాతం తమకే అనుకూలంగా ఉందని, దానికితోడు ఆసరా, చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన పథకాల లబ్ధిదారులైన మహిళల ఓట్లు పూర్తిగా తమకు పడతాయని ఆ లెక్క ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి 151 పైగా సీట్లు వస్తాయని ఐప్యాక్ చెప్పగా జగన్ కూడా అదే అభిప్రాయం వెలిబుచ్చారు. దానిని ఆయన బహిరంగంగా ప్రకటించారు కూడా. అయితే పార్టీ నాయకుల ఆలోచనలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. పోలింగ్ జరిగిన వారం వరకు ఉలుకు పలుకు లేని నాయకులు జగన్ ప్రకటన తర్వాత తమకు 100 సీట్లకు తక్కువ కాకుండా వస్తాయని తమదే గెలుపని మాట్లాడుతున్నారు. 151 సీట్లు వస్తాయనడంపై పెదవి విరుస్తున్నారు. ఇక ఎన్డీఏకి అసెంబ్లీ ఎన్నికల్లో 115 సీట్లకు తక్కువ కాకుండా వస్తాయని తెదేపా భావిస్తోంది. కూటమి స్కోరు 136 దాటిపోతుందని మరో అంచనా చెబుతోందని తెదేపా సర్వే బృందాలు తమ ప్రజంటేషన్లో పేర్కొన్నట్లు సమాచారం. అయితే పరిస్థితి పోటాపోటీగా ఉందని అవి పేర్కొన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెదేపాకు సొంతగ మెజారిటీ రాకపోవచ్చని బీజేపీ, జనసేన సహకారంతోనే సర్కారు ఏర్పాటవుతుందని విశ్లేషణలు ఉన్నాయి.

**అభ్యర్థుల హుషారు.. కలవరం**

పార్టీల అంచనాలతో సంబంధం లేకుండా అభ్యర్థులు ఎవరికి వారు తమ నియోజకవర్గాల్లో జనం నాడిపై సొంత విశ్లేషణలు తయారు చేసుకుంటున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా పార్టీ నాయకులను పిలిపించుకుని. అక్కడ తమకు ఎన్ని ఓట్లు లభించే అవకాశం ఉందో తెలుసుకుని.. లెక్కలు వేసుకుంటున్నారు. పల్నాడు జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానంలో గత నాలుగు ఎన్నికల్లో ఒక్కసారి కూడా తెదేపా గెలువ లేదు. అయితే ఈసారి అక్కడి తెదేపా అభ్యర్థి, తాను 15 వేలకు పైగా మెజారిటీతో గెలుస్తానని లెక్కగట్టారు. ప్రతి గ్రామం నాయకుల నుంచి సమాచారం తెప్పించుకున్న ఆయన గ్రామాలవారీగా ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడతాయో లెక్కలు గట్టి ఈ విశ్లేషణ రూపొందించారు. దీంతో ఆయన అనుచర వర్గం హుషారుగా తిరుగుతోంది.

**టిఎస్. భూషణ్**



# పందేల హోరు

తెదేపా శిబిరంలో ఉత్సాహం చూసి ప్రత్యర్థి శిబిరంలో కలవరం ఏర్పడింది. కృష్ణాజిల్లా గుడివాడలోనూ ఇదే రీతి. కొడాలి నాని అక్కడ నాలుగుసార్లు గెలిచారు. అయిదోసారి పోటీ చేశారు. కాగా, తాను 20 వేల మెజార్టీతో గెలుస్తానని తెదేపా అభ్యర్థి ధీమాతో ఉన్నారు.నాని మాత్రం తనకు 5 వేల మెజార్టీ వస్తుందని భావిస్తున్నారు.

**జోరుగా బెట్టింగులు**

అన్ని నియోజకవర్గాల్లో యథేచ్ఛగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానితో పాటు ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు, మెజార్టీలపై బెట్టింగ్‌ల హడావిడి మరింత తీవ్రస్థాయిలో జరుగుతోంది. అలాగే కొందరు ఒకటికి రెండు, మూడింతలు ఇస్తామంటూ కూడా ప్రత్యర్థులను కవ్విస్తున్నారు. పందెందారుల స్థాయిని బట్టి వేలు, లక్షలు, కోట్లలో ఈ పందేలు సాగుతున్నాయి.

కొందరు ఇళ్లు, స్థలాలు, పొలాలు, వాహనాలను సైతం పందేల కోసం తాకట్టు పెడుతున్నారు. మరికొందరు ఏకంగా స్థిరాస్తుల మార్పిడికి సిద్ధపడుతున్నారు. ఆ మేరకు మధ్యవర్తుల సమక్షంలో అగ్రిమెంట్లు రాసుకుంటున్నారు. వైసీపీ మరలా అధికారంలోకి వస్తుందని కొందరు, కనీసం 110 సీట్లు పైనే అంటూ మరికొందరు అధికార పార్టీ తరపున పందేలు కాస్తుండగా, ఎన్డీఏకి 120 సీట్లు ఖాయమంటూ ఎక్కువగా పందేలు కడుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు అంశంపై 2:1 నిష్పత్తిలో బెట్టింగ్ ఆశ్చర్యపరుస్తోంది. ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియాకు చెందిన ముఠాలు రంగంలోకి దిగి ఆయా రాజకీయ పార్టీలు అభిమానులను ప్రోత్సహిస్తూ దీనిని కూడా ఒక వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. రెండు వర్గాలకు చెందిన సొమ్మును తమ దగ్గర ఉంచుకుని గెలిచిన వారి దగ్గర 5 నుంచి 10 శాతం వరకు కమిషన్ తీసుకునే పద్ధతిని మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. రెండు వర్గాల మధ్య పందెం సొమ్ముకు వీరే హామీ ఆస్తున్నారు. ఈ తరహా వ్యాపారం లక్షలు, కోట్లలో పందేలు కాసే బడాబాబులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల మధ్య జోరుగా సాగుతోంది.

రాష్ట్రంలో కీలకమైన స్థానాలపై పందెందారులు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. మంగళగిరిలో నారా లోకేశ్, పిఠాపురంలో పవన్ కళ్యాణ్, గుడివాడ కొడాలి నాని, గన్నవరంలో వల్లభనేని మళ్లీ, దెందులూరులో చింతమనేని, నగరిలో ఆర్కే రోజు, మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తదితర అభ్యర్థుల గెలుపు, ఓటములపై రాష్ట్రస్థాయిలో పందేలు కాస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు కనీసం 30 వేల మెజార్టీ ఖాయమనే దానిపై కూడా పందేలు కడుతున్నారు.

> **పార్టీల అంచనాలతో సంబంధం లేకుండా అభ్యర్థులు ఎవరికి వారు తమ నియోజకవర్గాల్లో జనం నాడిపై సొంత విశ్లేషణలు తయారు చేసుకుంటున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా పార్టీ నాయకులను పిలిపించుకుని. అక్కడ తమకు ఎన్ని ఓట్లు లభించే అవకాశం ఉందో తెలుసుకుని.. లెక్కలు వేసుకుంటున్నారు.**

విశాఖ ఉత్తరం, పశ్చిమ, మాడుగుల, పెందుర్తి వంటి నియోజక వర్గాలపై ఎక్కువ పందాలు సాగుతున్నాయి. భీమిలి, గాజువాక, విశాఖ 'సౌత్ వంటి నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చే మెజారిటీపై బెట్టింగ్ కడుతున్నారు. చింతమనేని ఒక్క ఓటుతోనైనా గెలుస్తారని దెందులూరులోని ఒక మెట్ట గ్రామంలో తెదేపాకు చెందిన రైతు రూ. లక్షకు రూ.రెండు లక్షలు పందెం కాశాడు.

పెదపాడు, ఏలూరు రూరల్‌లో వైసీపీకి మెజార్టీ ఓట్లు వస్తాయని పందేలకు దిగుతున్నారు. విజయవాడ సెంట్రల్, ఈస్ట్‌లలో తెదేపా గెలిస్తే ఒకవంతు, వైసీపీ గెలిస్తే మూడు వంతులుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఎన్డీఏలోని జనసేన పోటీ చేసిన స్థానాల్లో ఎన్ని గెలవబోతోంది? బీజేపీకి ఎన్ని సీట్లు రానున్నాయనే దానిపై, కుప్పం, పులివెందులలో చంద్రబాబుకు, జగన్‌కు గతంలో వచ్చినంత మెజార్టీ రాదనే వాదన పైనా పందేలు కాస్తున్నారు.

ఎంపీ అభ్యర్థుల విజయావకాశాలపై పందేలు తక్కువగానే కొనసాగుతున్నప్పటికీ, అనకాపల్లిలో సీఎం రమేష్, విజయవాడలో కేశినేని బ్రదర్స్ గెలుపు, ఓటములపై పందేలకు కొందరు ముందుకొస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా జరిగే పందేల విలువ వేల కోట్లలోనే ఉంటుందన్న వాస్తవం జగమెరిగిన సత్యమైనప్పటికీ బెట్టింగ్ రాయుళ్లపై పోలీసువర్గాల నిఘా మాత్రం నామమాత్రంగా కూడా లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


**'మాఫియా' లో ఆందోళన**

ఇదిలా ఉంటే ఇప్పటి వరకు అయిదేళ్లుగా దోచుకుతిన్న ఇసుక, మైనింగ్, మద్యం మాఫియాలు రాబోయే ఫలితాలపై ఆందోళన చెందుతున్నాయి. అయిదేళ్లుగా ఇసుకను అధికార పక్ష తీర ప్రాంత ఎమ్మెల్యేలు, నాయకులు దోపిడీ చేశారు. కొండలు, గుట్టలు, ఎర్రమట్టిని లూటీ చేశారు. మద్యం డిస్టిలరీ యజమానులను బెదిరించి లాక్కుని మద్యం తయారుచేసి ప్రభుత్వానికి అమ్మారు. ఇది నాసిరకం మద్యంగా వినియోగదారులు, ప్రతిపక్షాలు ఆరోపించాయి.

అధికారం మారితే తమపై కేసులు నమోదుచేసి విచారణ చేయవచ్చని వీరు ఆందోళన చెందుతున్నారు. డిస్టిలరీల్లో పూర్తి స్థాయిలో మద్యం తయారీని నిలిపివేసి రోజువారీగా మాత్రం తయారుచేసి అమ్ముతున్నట్లు సమాచారం.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కూడా కొద్ది మొత్తంలోనే సరకు అందుబాటులో ఉంది. ఇక మద్యం దుకాణాల వద్ద సరకు కొనే మందుబాబులైతే త్వరలో ఈ నాసిరకం మద్యం పీడ విరగడ అవుతుందని, బ్రాండెడ్ మద్యం అందుబాటులోకి వస్తుందని చెప్పుకుంటున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**




25

# నేటి కాలానికి రామాయణ సందేశం

శకటానికి రెండు చక్రాలవలె, ఆకాశంలో ఎగిరే పక్షికి రెండు రెక్కలలాగా సుఖశాంతిమయ జీవితయాత్రకు చిత్తశుద్ధి-విజ్ఞాన సంపద (తపఃస్వాధ్యాయాలు) రెండూ అవసరమే. ప్రజా జీవితానికి ఆ రెండింటికీ గల అవినాభావ సంబంధాన్ని దర్శింపచేయటానికే తపః స్వాధ్యాయ పూర్వక కావ్యారంభం, చిత్తశుద్ధితో కూడిన విద్యా సంస్కారం జీవిత వికాసానికి మూలకందమనే సందేశాన్ని ప్రబోధిస్తూ రామాయణం ప్రవృత్త మయింది. ఇలాంటి విద్యాసంపత్తి సద్గురు ప్రబోధం లేకుండా సిద్ధించదు. తపస్వి అయిన వాల్మీకి మహర్షికి కూడా నారదరూపంలో సద్గురు ప్రబోధం ఆవశ్యకమైంది. అలాంటి గురు ప్రబోధంతో ప్రబుద్ధుడై వాల్మీకి క్రమంగా కవితాశాఖను అధిరోహించి రామచరితాన్ని మధురంగా గానంచేసి 'కోకిల'గా జగత్ప్రసిద్ధి పొందారు.

**'యస్య దేవే పరా భక్తిః యథా దేవే తథా గురౌ**
**తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః'**

అనే శ్వేతాశ్వతర శ్రుతి సందేశాన్నే రామాయణ ఆరంభాన్ని సూచిస్తోంది. ఈ శ్రుత్యర్థాన్నే మహాకవి విశ్వామిత్ర పాత్ర ద్వారా వివరించాడు.

విశ్వామిత్ర నామధేయమే ఆ మహర్షి మహత్వాన్ని చాటుతోంది. 'విశ్వస్య మిత్రం విశ్వామిత్రః' విశ్వానికంతా మిత్రుడైన వాడెంతటి మహత్ముడై ఉండాలి? కాబట్టే, ఈ కావ్య నాయకుడైన శ్రీరామునకు గురువుగా, నియంతగా, శిక్షకుడుగా ప్రసిద్ధిపొందాడు. ఆచార్యుడి పట్ల వినయ విధేయతలతో ప్రవర్తిల్లి శ్రీరాముడు గూడ 'విశ్వామిత్రాంతరంగుడై' విఖ్యాతి గాంచాడు. వస్తుతః శ్రీరాముడు సాక్షాత్తు నారాయణుడు. నిఖిల జగద్గురువు. అయినప్పటికీ లోకమర్యాదా పాలన కోసం మర్యాదా రాముడగు శ్రీరాముడు విశ్వామిత్రుని గురువుగా సేవించాడు. శ్రీరాముడికి కర్తవ్యాన్ని బోధిస్తూ విశ్వామిత్రుడు ఎట్లా శిక్షకుడై విలసిల్లాడో....

'కౌసల్యా సుప్రజారామ! పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల! కర్తవ్యం దైవ మాహ్నికమ్॥'

శ్లోకం చెబుతుంది. తన యాగరక్షణకు వెంటవచ్చిన రామలక్ష్మణులిరువురు నిద్రిస్తూ ఉండగా, సంధ్యా సమయం ఆసన్నమైనదంటూ శ్రీరాముని మాత్రమే విశ్వామిత్రుడు ప్రబోధిస్తాడు. అక్కడ లక్ష్మణ ప్రస్తావన లేదు. ఇలా ఒకరిని కాదని మరొకరిని ప్రబోధించ టం గురులక్షణమా! విశ్వామిత్రుడు మహాజ్ఞాని, దూరదర్శి, సర్వజ్ఞుడు, శ్రీరాముడు భావి ప్రజా పాలకుడు. అట్టివానికి విధి నిర్వహణలో ఏమరుపాటు ఏ మాత్రం ఉండరాదు. ప్రభువు విధి నిర్వహణలో శ్రద్ధ చూపకపోతే ధర్మదూరుడౌతాడు. యథా రాజా తథా ప్రజా కనుకనే ఆచార్యుడై ఆ మహర్షి కాబోవు ప్రభువగు శ్రీరాముని విషయంలో ప్రత్యేక శ్రద్ధ అడుగడుగున చూపాడు. లక్ష్మణుడు శ్రీరాముని అనుచరుడు. శ్రీరాముడు కర్తవ్య నిర్వహణకు పూనుకుంటే లక్ష్మణుడు తనంతటతానే రాముని అనుసరిస్తాడు. ప్రజా పాలకులకే క్రమశిక్షణ ముందు అవసరం. కనుకనే విశ్వామిత్రుడు శ్రీరాముని విషయంలో శ్రద్ధ చూపాడు. భావి ప్రజా పాలకులకు గురుముఖంగా క్రమశిక్షణ అనేది అనాది సిద్ధమైన భారతీయ సంప్రదాయం కదా! విశ్వామిత్రుడు కేవలం క్రమశిక్షణనే కాదు! దానితోపాటు బలాతిబల విద్యలు, శస్త్రాస్త్ర విద్యలనెన్నిటినో ఉపదేశిస్తాడు. తుదకు రాజపుత్రుని వివాహం కూడా తానే జరిపించి 'యత్రదాతా గ్రహీతా చ స్వయం కుశిక వందనః' అనే ఖ్యాతిని గడించాడు. కాబట్టి ప్రజా పాలకులకు చిన్నతనము నుండి కర్తవ్య నిర్వహణలో క్రమశిక్షణ- ఉత్తమ విద్యా సంపత్తి (తపః స్వాధ్యాయములు) ఎంత అవసరమో ఈ ఆదికావ్యం ప్రబోధిస్తోంది.

శ్రీరాముడు అలా సుశిక్షితుడు కనుకనే రాజసింహాసనం ఆయనను ఆకర్షించలేదు. సింహాసనాన్ని అధిష్ఠించనున్నప్పుడు ఉప్పొంగలేదు. వలదంటే కుంగిపోలేదు.

– శ్రీ హరి లక్ష్మీనరసింహశర్మ
'జాగృతి' 04-07-1981 సంచిక నుంచి

ఆధ్యాత్మికం

సప్త రుషులు

# అన్నార్తులకు ఆత్మబంధువు గౌతమమౌని



గౌతముడు గొప్ప మహర్షే కాదు... అన్నార్తులను ఆదుకున్న మహనీయుడుగా చరిత్రకెక్కరు. 'దానాలలో అన్నదానం మిన్న' అనే నానుడికి ఆయన నిలువెత్తు నిదర్శనం. సతీ (అహల్య) సమేతంగా దండ కారణ్యంలో బ్రహ్మను గురించి తపస్సు చేసి, తాను భూమిలో విత్తనాలు చల్లిన జాము (రెండున్నర-మూడు గంటలు) వ్యవధిలోనే పంట వచ్చేలా వరం పొందాడు. అలా ఆయన నివసించిన ప్రాంతం నిరంతరం సస్యశ్యామలంగా ఉంటుందని బ్రహ్మవరం అనుగ్రమించాడు. శతశృంగగిరి అనే చోట పర్ణశాల కట్టుకొన్న ఆ దంపతులు అతిథులను ఎంతో ఆదరించే వారని పురాణగాథ. ఒకసారి మృత దేహాలను సయితం తినేంత కరవు రావడంతో అన్నార్తులతో ఆ ప్రాంతం కిటకిటలాడిందట. అహల్యా గౌతములు ఆదర్శ దంపతులు వారి ఆకలిదప్పులు తీర్చి ఆదుకున్నారు.

ఆ దంపతుల జీవిత నేపథ్యం ప్రకారం, క్షీరసాగర మథనంతో ఉద్భవించిన అమృతాన్ని పంచేందుకు విష్ణువు మోహినీ అవతారం దాల్చి తన రూపంతో బ్రహ్మ సృష్టినే ప్రశ్నార్థకం చేశాడట. దాంతో బ్రహ్మ తన తపోమహిమతో మోహినిని మరిపించే సుందరిని సృష్టించాడు. ఆమె అహల్య. బ్రహ్మ ఆదేశానుసారం గౌతముడు కొంతకాలం ఆమెను సాకాడు. జన్మతః అపురూప లావణ్య అయిన అహల్యను బ్రహ్మకు తిరిగి అప్పగించాడు. అహల్య అందచందాలకు గౌతముడు తప్ప ఇంద్రాది దేవతలు, రుషులు ముగ్ధులై ఆమెను వివాహ

# శ్రీకృష్ణుడు రాజకీయవాది కాడు!?

25




శ్రీకృష్ణుడు గొప్ప రాజకీయవేత్త (Great politician) అనే మాట ప్రసిద్ధమైనమాటే! ఆయనకు రాజకీయవేత్త, లేక రాజకీయవాది (Politicion) అనే విశేషణం ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సిన విషయమే. అసలు రాజకీయవాది అంటే ఎవరో కూడా మనం నిర్వచించుకోవలసిన అగత్యం ఉన్నది. రాజకీయ సమస్యలను గురించి మాట్లాడినంత మాత్రాన లేదా రాజ్యక్షేమానికి సంబంధించిన అంశాలలో జోక్యం చేసుకొన్నంత మాత్రాన ఒక వ్యక్తి 'రాజకీయవాది' అని పించుకుంటాడు అని అంటే శ్రీకృష్ణుడిని కూడా రాజకీయవాది అని అనక తప్పదు. అలాంటి పనులు శ్రీకృష్ణుడు తన జీవితంలో చాలా చేశాడు. తననూ, అన్న బలరాముడిని మట్టుపెట్టాలని కంసుడు (రాజు+మేనమామ) శకటాసుర, తృణావర్త, ధేనుకాసుర, పూతనాది రాక్షసులను ఎందరినో పంపించాడు. కృష్ణుడు వారిని చంపాడు. రాజుతో గూర్చిన పని కనుక ఇది రాజకీయమైనదే. ఇక కుదరక కంసుడు బలరామకృష్ణులను తన సభకే ఆహ్వానించాడు. చాణూర ముష్టికులను, కువలయాపీడము అనే ఏనుగును మీదికి పంపించాడు. కృష్ణుని ముందు అవన్నీ పని చేయలేదు. కృష్ణుడు సరాసరి ముందుకు పోయి కంసుడిని గద్దె మీది నుండి కిందకి లాగి చంపేశాడు. కంసుని తండ్రి అయిన ఉగ్రసేనుణ్ణి సింహాసనం మీద కూర్చోపెట్టాడు. ఇది ప్రత్యక్షంగా రాజకీయమే. అంటే…రాజ్యానికి సంబంధించినదే. తరువాత కాలంలో శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన చేరాడు. ఆ పార్టీ తరఫున రాయబారం నడిపాడు. ఇది రాజకీయమే. అంత మాత్రమే కాదు. యుద్ధంలో అర్జునుని రథం మీద తిష్ఠవేసుకొని కూర్చుని చక్రం తిప్పాడు. ఇదీ రాజకీయమే! యుద్ధానంతరం ధర్మరాజును స్వహస్తాలతో అభిషిక్తుడిని చేశాడు. ఇదంతా రాజకీయ కార్యకలాపం క్రిందకే వస్తుంది. కనుక కృష్ణుడు రాజకీయవాది. పొలిటిషియన్. ఇలా చెబితే నిజానికి కాదనటం కష్టమే.

కాని రాజకీయవాది అనే మాటకు ఇదే అర్థం అంటే రాజకీయవాది కాని వ్యక్తి మనకు కనిపించడు. ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశంలో. రాజకీయ సమస్యలను గురించి ప్రతివ్యక్తీ మాట్లాడుతూనే ఉంటాడు. రాజ్య క్షేమానికి సంబంధించిన విషయాలలో ప్రతివ్యక్తి జోక్యం చేసుకొంటూనే ఉంటాడు. జోక్యం చేసుకొనాలని మనం అభిలషిస్తాము కూడా. అటువంటప్పుడు ఒక్క కృష్ణుడు ఏమిటి? కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న 18 అక్షౌహిణుల సైన్యంలో ప్రతివ్యక్తి రాజకీయవాది అవుతాడు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ప్రతి పౌరుడూ రాజకీయవాదే అవుతాడు. ఎమర్జన్సీని సమర్థించిన లేదా ప్రతిఘటించిన ప్రతివాడూ పొలిటీషియనే అవుతాడు. కనుక రాజకీయవాది అని అంటే అర్థం ఇంత మాత్రమే కాదు.

రాజకీయ పారిభాషిక పదాల నిఘంటువు ఒకటి ఈ నడుమ తయారయింది. దాంట్లో పొలిటిక్స్, పొలిటీషియన్ అనే పదాలకు అర్థాలు ఇచ్చారు. పొలిటీషియన్ అంటే ఎవరు? 'రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటూ ఎన్నికల ద్వారా గాని, మరొక విధంగా గాని అధికారాన్ని హస్తగతం చేసుకొనేందుకు ప్రయత్నించేవాడు' అందులో ఉంది. అంటే రాజకీయ సమస్యలను గురించి మాట్లాడటం, రాజకీయమైన కార్యకలాపాలలో జోక్యం కలుగజేసుకోవటం, రాజ్య క్షేమానికి సంబంధించిన అంశాలలో తలదూర్చటం…ఇవి మాత్రమే ఒక వ్యక్తిని "రాజకీయవాది" గా "పొలిటీషియన్"గా చేయవు. అయితే ఆ వ్యక్తి అట్టి కార్యక్రమాల ద్వారా అధికారాన్ని సంపాదించేందుకు ప్రయత్నం చేస్తే అప్పుడు మాత్రమే 'రాజకీయవాది' అవుతాడు. రాజకీయవాదులయిన పెద్దలు అంగీకరించిన నిర్వచనమే ఇది. దీనిని మనం స్పష్టతకొరకు మరొక రీతిగా చెప్పవచ్చు. ఏమిటంటే రాజకీయాలు వేరు. అధికార రాజకీయాలు వేరు. రాజకీయాలలో జోక్యం ప్రతివాడికీ ఉంటుంది. అధికార రాజకీయాల ప్రసక్తి రాజకీయవాదులకు మాత్రమే ఉంటుంది. ఈ నిర్వచనాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే శ్రీకృష్ణుడు రాజకీయవాది అవుతాడా?

– వైశంపాయన

'జాగృతి' 11-09-1982 సంచిక నుంచి

మాడడానికి పోటీ పడతారు. వ్యామోహానికి అతీతంగా, తపస్సు చేసుకునే గౌతముడే ఆమెకు తగినవాడుగా తలచిన విధాత, భూప్రదక్షిణ చేసి ముందుగా వచ్చిన వారికి అహల్యతో పెళ్లి అని ఇతరులకు షరతు విధించాడు. గౌతముడు అక్కడి గోమాతకు ప్రదక్షిణం చేసి, శ్రుతి వాక్యం ప్రకారం అది భూప్రదక్షిణతో సమానంగా పేర్కొన్నాడు. ఆ ప్రకారం, మిగిలినవారు తిరిగివచ్చేసరికే అహల్యా గౌతముల వివాహం జరిగిపోయింది. నాటి నుంచి ఆ దంపతులంటే దేవతలకు అసూయగా ఉండేది. కొంతకాలానికి అందరూ సమాధానపడినా ఇంద్రుడి లో మాత్రం మార్పు రాలేదు. ఒకవేకువ జామున గౌతముడు నదికి స్నానానికి వెళ్లినప్పుడు ఆయన రూపంలో వచ్చి అహల్యతో సంగమిస్తాడు. ఫలితంగా ఇంద్రుడి పదవి పోతుందని, అహల్య శిలగా పడి ఉండాలని గౌతముడు శపిస్తాడు. శ్రీరామచంద్రుని దయతో వారు శాపవిముక్తులవుతారు. గౌతముడు లోకానికి అందించిన ధర్మసూత్రాలు, న్యాయశాస్త్రం, జ్యోతిష్యశాస్త్ర గ్రంథాలు సర్వకాలాలకు ఆదర్శనీయ మని పెద్దలమాట. ఆయనకు 'అక్షపాదుడు' అనీ పేరుంది. తన న్యాయ శాస్త్రాన్ని ఖండింప చూచిన వ్యాసునిపై ఆగ్రహించి, తన పాదంలో నేత్రాన్ని సృష్టించుకొని చూడడం వల్ల ఆ పేరు వచ్చిందని చెబుతారు. గౌతమ దంపతుల కుమారుడు శతానందుడు (శరద్వందుడు) బాల్యంలో తపస్సుకు వెళ్లి, కాలక్రమంలో జనకమహారాజు ఆస్థానంలో రాజగురువుగా ఉన్నారు. గౌతముడి పెద్ద కుమార్తె ఆంజనేయుడి మాతృమూర్తి అంజన కాగా రెండవ కుమార్తె కుమారి ఉదంకముని భార్య.

– రామచంద్ర రామానుజ

## వివేకానంద సూక్తిశతి

**You are lions, you are souls, pure, infinite and perfect,**
**The Might of the universe is within you. why weepest thou my friend?**

**సింహబలులు మీరు చింతించగానేల**
**పుడమిపైని పూర్ణపురుషులార**
**అతిపవిత్రమైన ఆత్మరూపులుమీరు**
**వినుడి స్వామి సద్వివేక వాణి!!**





బండిరాజుల శంకర్

"చివరగా ఒకమాట డాక్టర్! ఒక తల్లికి ఒకేసారి ముగ్గురూ నలుగురూ పిల్లలు పుడుతూ ఉంటారు. అఫ్‌కోర్స్ అరుదుగానే అనుకోండి! అది ఎలా?" ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలో ఆసక్తి లేదు. ఆకాంక్ష కనిపించిందా డాక్టర్‌కు.

" అది సాధ్యమే! అండాశయాలు సాధారణంగా ప్రతి నెలా ఒక్కొక్క అండాన్నే విడుదల చేస్తాయి. గర్భాశయ గోడల్ని ఆనుకుని రెండు అండాశయాలున్నా, అది ఒక్కొక్కటి ఒక్కొక్క నెల విడుదల చేస్తాయి.

"అది ప్రకృతి నియమం. భగవంతుడు మన దేహాన్నే ఓ అద్భుత యంత్రంగా సృష్టించాడు. చాలా అరుదుగా ఒక్కొక్కసారి అండాశయం రెండు అండాల్ని విడుదల చేస్తే, ఆ సమయంలోనే అది ఫలదీకరణకు సిద్ధమయితే కవలలు పుట్టవచ్చు.

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

"అదీగాక ఒక్కొక్కసారి ఫలదీకరణ చెందిన అండం సెల్స్ డివిజన్‌లో మార్పులు జరిగితే ఒకే తీరు కవలలు పుడతారు. వారినే 'పౌరుష్య కవలలు' లేదా ఐడెంటికల్ కవలలు అంటారు. ఇది జరిగినప్పుడు కేవలం ఆడపిల్లలు కానీ, కేవలం మగపిల్లలుగాని ఇద్దరేసి పుడతారు తప్ప; ఒక ఆడ, ఒక మగ పుట్టరు. అలాకాక, అరుదుగా అండాశయం రెండు అండాల్ని విడుదల చేస్తే కవలలు పుట్టినా వారిలో ఒక ఆడ, ఒక మగ పుట్టే అవకాశ ముంటుంది. అయితే నీవడిగిన ప్రశ్న- ఇద్దరు, ముగ్గురు, నలుగురు పుట్టేదెలా అన్నదే. ఇలాంటి సంతాన సాఫల్య కేంద్రాల్లో, ఒకే అండంతో ఫలదీకరణం విజయవంతం కాకపోతే ఏమిటి అన్న అనుమానంతో రెండు మూడు అండాలతో ఫలదీకరణ జరుపుతారు. ఒక్కొక్కసారి మూడూ విజయవంతమైతే అలా పుడుతుంటారు. ఐదు సంవత్సరాల క్రితం అమెరికాలోని కాలిఫోర్నియాలో ఒకేసారి ఎనిమిది మంది పిల్లల్ని కన్నదొక తల్లి. అందులో ఇద్దరు చనిపోయి, ఆరుగురు బ్రతికారు" చెప్పింది డాక్టర్ వరద.






"అలా కావటం లక్కీ కదా!" అడిగింది గీరా.

"కాదు. అవినీతి, అత్యాశ, అరాచకత్వం. ఒకటి నుంచి మూడు కన్నా ఎక్కువ అండాల్ని ఫలదీకరించటానికి మెడికల్ కౌన్సిల్ ఒప్పుకోదు. అది లీగల్ కాదు. అయినా ఎక్కువమంది పుట్టారంటే, ఆ డాక్టర్ కచ్చితంగా అవినీతికి పాల్పడినట్లే. అత్యాశ అని ఎందుకున్నానంటే, ఆ సరోగేట్ మదర్ ఒకే కాన్పులో ఎక్కువ మందికి సంతానాన్ని అందించిందంటే అది డాక్టర్, ఆ 'మదర్' కలిసే చేయాలి.

"ఇక, అరాచకత్వమని ఎందుకన్నానంటే, ఒకరు లేదా ఇద్దరు కవలలకు అనుగుణంగా మాతృగర్భాన్ని ప్రకృతే సృష్టించింది. అంతకు మించి మరో బిడ్డయితే కొద్దిగా రిస్కుతో కూడుకున్నా, తల్లి గర్భం పెంచి ప్రసవించటానికి, అంటే తాను మృత్యు ముఖంలోకి వెళ్లి, నూతన శిశోదయానికి అవకాశమిచ్చి సృష్టికార్యంలో తల్లిగా తన విధి నిర్వహిస్తుంది.

"అందుకు ప్రకృతి సహాయపడుతుంది.

"ఒక్కొక్కసారి జలప్రళయం వస్తుంది. అందులో అందరూ మృత్యువాత పడరు. కొందరు బ్రతికిపోతారు. దానికి ఆ విలయ తాండవం చేసే ప్రకృతీ, కనిపించని ఆ భగవంతుడూ సహాయ పడతారు. ఇదీ అలాగే!

"కానీ, దానికి విరుద్ధంగా మనిషి నడిస్తే, ప్రకృతి సహించి, భరించలేదు. ఆ తల్లిగాని, డాక్టర్‌గాని అత్యాశలకు పోతే ఏమయింది? ఇద్దర్ని మృత్యువు మింగేసింది. మిగిలినవారు అతి బలహీనంగా, ఎన్నాళ్లుంటారో తెలియని స్థితిలో ఉన్నారు.

"గీరా! డాక్టర్‌కు అవినీతితో గానీ, అత్యాశతో గానీ.. ప్రాణం పోసే హక్కే తప్ప, తీసే హక్కు లేదు. అయితే, ప్రయోగాలు చేసి నూతన ఆవిష్కరణలకు దారితీయటం, అందులో కొన్ని చిన్న చిన్న ఆటంకాలేదురయితే అది దోష నిరూపణ కాదు. కొత్తదారి కనుక్కుంటూ ఉంటేనే, ఆ దారి రహదారిగా మారి అందరికీ ఉపయోగపడేది" వివరించింది వరద.

"ఒకే! అండం విడుదల కావటం యుగధర్మం. అసమతౌల్యంతో మరో అండం విడుదల కావటం ప్రకృతినీ సైన్స్‌నీ అధిగమించి సెల్స్‌లో డివిజన్స్ ఏర్పడటంతో కవలలతో పాటు మరొకర్ని అదనంగా కనటం వరకు ఓకే. ఇంకా ఇలా అండాల్ని ఎక్కువగా ఉత్పత్తి అయ్యేందుకు కారణాలుంటాయా?' అడిగింది.

గీరా చదువుకున్న యువతి.

ప్రకృతి మార్పులతోబాటు, వైజ్ఞానిక ప్రయోగాల గురించి తెలుసుకోవాలనే కుతూహలం కనబర్చింది.

"చాలా అరుదుగా అదీ జరుగుతుంది. పాలిసిస్టు ప్రెగ్నెన్సి అనేది జరుగుతుంది. ఓకే అండాశయం రెండు అండాల్ని విడుదల చేయవచ్చు" వివరించింది.

"నలుగురు లేదా ముగ్గుర్ని ఇప్పుడూ ఒక సరోగసి తల్లి కనే అవకాశముందా?'' వదలకుండా అడిగింది గీరా.

"చేయవచ్చు. ప్రయోగాల్లో, ప్రకృతి నియమంగా ఉండే గర్భనియమంలో, ఆ అండాలు బలంగా ఉండటానికి, సరిగ్గా విడుదల కావటానికి, అండం విడుదలలో సమతుల్యత లేకపోతే, హార్మోన్ ఇంజక్షన్స్ ఇచ్చినపుడు, అలా ఎక్కువ అండాలు విడుదలయి, అలా రిలీజయినప్పుడు, ఆ అండాలన్నిటితో ఫలదీకరణ జరిపి, సరోగసి మదర్‌ను ముగ్గురు బిడ్డల తల్లిగాను చూడవచ్చు. అయితే, ఆ తల్లికి, ఆ డాక్టర్‌కు ధైర్యముండాలి. ఆటంకాల్ని తట్టుకోగలగాలి" చెప్పింది మెల్లగా ఒక్కొక్కటిగా.

"చెప్పండి, నేనే విషయాలకూ జంకను. ఈ రహస్యాలని నేనెక్కడా బహిర్గతం చేయను. నాకు కావాల్సింది వివరాలు మాత్రమే!" అడిగింది గీరా.

"అవి నీకు పెద్దగా అవసరపడవు. నీవు ఆరోగ్యంగా ఉన్నావు. పోనీ, సరోగేట్ అయినప్పుడు

**"గీరా! డాక్టర్‌కు అవినీతితో గానీ, అత్యాశతో గానీ.. ప్రాణం పోసే హక్కే తప్ప, తీసే హక్కు లేదు. అయితే, ప్రయోగాలు చేసి నూతన ఆవిష్కరణలకు దారితీయటం, అందులో కొన్ని చిన్న చిన్న ఆటంకాలేదురయితే అది దోష నిరూపణ కాదు.**

నీకా వివరాలే అవసరంలేదు" చెప్పింది వరద.

"మీ దగ్గర నేనొక విషయం దాచాను. అది నేను, పెళ్లికాని అమ్మాయినని, అది నిజం కాదు. నాకు, చాలా చిన్న వయసులోనే, పెళ్లి జరిగింది. అది మా తెగల్లో సర్వసాధారణం. నాకు ఊహ తెలవకముందే ఆ పెళ్లి భగ్నమయింది. అందుకే ప్రభుత్వ సహకారంతో చదువుకోవటానికి హాస్టల్ కొచ్చాను.

"ఇక్కడి వాతావరణం, ఈ చదువు, విజ్ఞానం నా జీవన దిశను మార్చింది. నేను సైన్సు స్టూడెంట్‌ను కాను. అందుకే అడుగుతున్నాను." అన్నది గీరా.

"హార్మోన్ ఇంజక్షన్ల ద్వారా ఎక్కువ అండాల్ని విడుదలయ్యేలా చేసి ఫలదీకరించవచ్చు. అయితే, రెండు లేదా మూడు కన్న ఎక్కువ అండాలతో, తల్లి గర్భంలో ఫలదీకరణ జరపకూడదని మెడికల్ కౌన్సిల్ నిర్ణయించింది" చెప్పింది డాక్టర్ వరద.



సంబరాజు లీల (లట్టుపల్లి)

"అరుదుగానే అయినా ఎక్కువగా కూడా పుడుతున్నారు కదా?"

"అఫ్‌కోర్స్, నిజమే! ధనదాహం, మానవుల నడుమనున్న మమతల విలువల్ని, మంటగలిపి నప్పుడు, దురాశతో ఎక్కువ అందాల్ని ఫలదీ కరించటంతో జరుగుతుందది గీరా! అసలు నీ విషయం చెప్పు, నీ మనసులో ఉన్నదేమిటో, దాని గురించి చెప్తాను" చెప్పింది వరద.

"నాకు అలా ఎక్కువమందిని, అదీ వివిధ రకాల తల్లులు, తండ్రులకు సంబంధించిన సంతానాన్ని కనే ప్రయోగంలో పాల్గొనాలనుంది. ఆ మాతృత్వం లోని కదలికల్ని, తల్లి అనుభూతుల్ని పొందాలనుంది" చెప్పింది గీరా.

"అది వీలు పడకపోవచ్చు. కారణం డి.ఎన్.ఏ అంటే, డి ఆక్సిరైబో న్యూక్లిక్ ఆమ్లం, ఇవి కొన్ని రకాల యాసిడ్స్ వంశ పారంపర్య లక్షణాల్ని అందించటంతో, డి.ఎన్.ఏ ప్రాధాన్యత వహిస్తుంది. వాటిల్లో వచ్చే తేడాలవల్ల, గర్భాలు నిలవకపోవచ్చు" వివరించింది డాక్టర్ వరద.

"డి.ఎన్.ఏను కూడా సమన్వయ పరచగలిగే మందులున్నాయా?" ప్రశ్నించింది గీరా.

"ఉన్నాయి. వాటిని తక్కువగానే ఉపయోగిస్తారు. వాటి కన్నా ముందు తల్లి అన్ని రకాల సమస్యల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. కారణం వివిధ రకాల డి.ఎన్.ఏతో సమస్యలుంటాయి కాబట్టి. అయితే గియితే ప్రయోగం అంటూ జరిపితే, అది నీ మీదే అవుతుంది. దానికి నీవు తల్లిగా ప్రకృతి నియమాలకు విరుద్ధంగా కష్టపడాల్సి ఉంటుంది." వివరించింది వరద.

"అన్నీ మీ అబ్జర్వేషన్‌లోనే కదా?"

"ష్యూర్! ఇరవై నాల్గు గంటలూ నా కళ్లముందుం

**"నిజమే! కానీ దానికి నీవు, నీ ప్రాణాన్ని పణంగా పెట్టాల్సి వస్తుంది. అందుకే మెడికల్ కౌన్సిల్ ఆ నిబంధనల్ని విధించింది. అఫ్‌కోర్స్! ఇదొక ప్రయోగంగా తీసుకుని, నేను పర్మిషన్ తీసుకోవచ్చు. నీకూ... అంగీకారంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్నావు. నీ ప్రాణాలకు నాది హామీ. కాని, అంత తీవ్ర పరిస్థితులెదురయినప్పుడు మాత్రం గర్భస్రావం చెయ్యాల్సి వస్తుంది" వివరించింది.**



టావు. నీ కడుపులోని ప్రాణి కదలికల్ని ప్రారంభించిన క్షణం నుంచి నీవు ప్రసవించే వరకు, నీవు, నీ బిడ్డ నా ఆధ్వర్యంలో ఉంటారు. మీ ఏ సమస్యలకయినా బాధ్యత నాదవుతుంది" చెప్పింది.

"అందుకు నేను తయారుగా ఉన్నాను డాక్టర్. ముగ్గురు దంపతులకు నేను తల్లిగా బిడ్డల నందించగలను" జవాబిచ్చింది గీరా.

వరద లేచి, ఆలోచనగా చేతులు కట్టుకుంటూ "అలాంటి దంపతులడిగినపుడు నీకు తెలియజేస్తాను" అంది. ఇద్దరి మధ్య 'మీకు మీరు' అని మన్నించే మర్యాద ప్రస్థావనలు ఎప్పుడు ఆగిపోయాయో వారికే గుర్తులేదు.

"డాక్టర్‌గారూ! నేను డబ్బు సంపాదన కోసమే అనుకుంటే ఓ ఉద్యోగం చేస్తాను. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ మార్గదర్శకాల ప్రకారం నేను మూడుసార్లు కన్నా ఎక్కువగా సరోగేట్ మదర్‌లా మారటానికి వీల్లేదు అంటే మూడుసార్లు మాత్రమే సంతానాన్ని ఇవ్వగలను.

"ఈ లెక్కన నాకొచ్చే డబ్బులు కూడా తక్కువే! అలా అని నేను దీన్ని, జాలిపడో, సహాయం చేయాలన్న సానుభూతితో చెయ్యడం లేదు.


"నా స్వార్థం కోసం, అంతో ఇంతో నా సంపాద నతో పాటు, అమ్మదనంలోని కమ్మదనాన్ని అనుభ వించటానికి చేస్తున్నాను. మూడు జంటలకు నేను ఒకే కాన్పులో అంటే, తొమ్మిదినెలల్లో సంతానాన్ని ఇవ్వగలిగితే ఎంత థ్రిల్... ఎంత గొప్పదనం.

"అలా మూడుసార్లు సరోగేట్‌నయితే నాకు అవసరమయినంత డబ్బు కూడా దొరుకుతుంది. ఆ తరువాత నేను పెళ్లి చేసుకుని సెటిలయిపోయి హాయిగా నా భర్తతో గడుపుతూ నా సంతానాన్ని కని పెంచుకోవచ్చు కదా?" ప్రశ్నించింది.

"నిజమే! కానీ దానికి నీవు, నీ ప్రాణాన్ని పణంగా పెట్టాల్సి వస్తుంది. అందుకే మెడికల్ కౌన్సిల్ ఆ నిబంధనల్ని విధించింది. అఫ్‌కోర్స్! ఇదొక ప్రయోగంగా తీసుకుని, నేను పర్మిషన్ తీసుకోవచ్చు. నీకూ... అంగీకారంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్నావు. నీ ప్రాణాలకు నాది హామీ. కాని, అంత తీవ్ర పరిస్థితులెదురయినప్పుడు మాత్రం గర్భస్రావం చెయ్యాల్సి వస్తుంది" వివరించింది.

"నేను, మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారమే తల్లినౌతాను. ఇన్ని సంవత్సరాల వయసొచ్చినా భర్త, సంసారం, సంయోగ సాంగత్యాలు లేకుండా ఉన్నాను. మా తెగల్లో అక్రమ సంబంధాలు, తద్వారా సంతానాలు సర్వసాధారణం. కాని, నేను చదువుకున్నాను. అందుకే నేనేది చేసినా, లీగల్‌గా, వాటిని నైతిక జీవన విలువల కనుగుణంగా ఉండాలనుకునే ఇన్నాళ్లూ వాటికి దూరంగా ఉండిపోయాను. కానీ, నాకూ మాతృత్వాన్ని స్వంతం చేసుకోగల అవకాశం ఉందన్న మాట వాస్తవం. అయితే అది సామాజిక నియమాలకనుగుణంగా కాదు. అందుకే నేను కేవలం మాతృసాధన కోసమే ఇలా ఉన్నాను. ఇప్పుడు దీనికి ఒప్పుకున్నదీ అందుకోసమే!" చెప్పింది గీరా వివరంగా.

(సశేషం)



డబ్ల్యుఐపిఓ ఒప్పందం భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు పెద్ద గెలుపు. ఈ ఒప్పందం కారణంగా ఈ దేశాల సంప్రదాయ విజ్ఞానాన్ని చట్టబద్ధంగా పరిరక్షించుకునే అవకాశం లభిస్తుంది. దాదాపు 25 ఏళ్ల చర్చలు, సంప్రదింపుల అనంతరం మే 26,2024న జన్యుపరమైన వనరులు, తత్సంబంధిత సంప్రదాయ విజ్ఞాన పరిరక్షణకు ఒక ఒప్పందం జెనీవాలోని డబ్ల్యుఐపిఓ కేంద్ర కార్యాలయంలో కుదిరిందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు.

ఈ ఒప్పందం భారత జన్యుపరమైన వనరులు, సంప్రదాయ విజ్ఞానానికి రక్షణలు కల్పించడమే కాక తొలిసారి, స్థానిక సమూహాలు, వారి జన్యుపరమైన వనరులు, సంబంధిత సంప్రదాయ విజ్ఞానానికి అంతర్జాతీయ మేధోసంపత్తి సమాజంలో గుర్తింపు లభించడం గొప్ప విషయం. సంప్రదాయ విజ్ఞానాన్ని అందించడంలో, జీవవైవిధ్యానికి ఖజానాగా నిలిచిన భారత్‌కు ఇది అత్యంత గొప్ప విజయం.

ఈ ఒప్పందం జీవవైవిధ్యాన్ని పరిరక్షించి, కాపాడడమే కాక పేటెంట్ వ్యవస్థలో పారదర్శకతను పెంచి, ఆవిష్కరణలను బలోపేతం చేస్తుంది. దీనిని ద్వారా అన్ని దేశాల, సమాజాలను అవసరాలకు స్పందించి మరింత సమ్మిళిత మార్గాన్ని పెంపొందిస్తూ చేస్తూ, అది ఏ దేశానికి చెందినది లేదా జన్యు వనరుల మూలాన్ని బహిర్గతం చేయడానికి కాంట్రాక్టు పార్టీలు ఆమోదించిన తర్వాత అమలులోకి రావడంపై ఒప్పందం అవసరం. ఇది భారత్‌కు గల గొప్ప తత్సంబంధిత సంప్రదాయ విజ్ఞానానికి (ఎటికె)కి అదనపు రక్షణను అందిస్తుంది. ప్రస్తుతం భారతదేశ రక్షణలో ఈ విజ్ఞానం ఉన్నప్పటికీ, బాధ్యతలకు కట్టుబడి మూలాలను బహిర్గతం చేయని దేశాలలో దుర్వినియోగానికి గురయ్యే అవకాశం ఉంది.

కనుక, మూలానికి సంబంధించిన అంశాలను బహిర్గతం చేసే బాధ్యతలపై అంతర్జాతీయ

భారత్ సహా గ్లోబల్ సౌత్ దేశాల సంప్రదాయ విజ్ఞానికి సంబంధించిన మేధో వనరులను పరిరక్షించే లక్ష్యంతో ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ – డబ్ల్యుఐపిఓ) పాతికేళ్ల చర్చల అనంతరం వాటి పరిరక్షణ ఒప్పందాన్ని జెనీవాలో ఈ ఏడాది మే 26న ఆమోదించింది.



# సంప్రదాయ మేధో సంపత్తి రక్షణకు ఒప్పందం

ప్రమాణాలను సృష్టించడం ద్వారా ఈ ఒప్పందం అభివృద్ధి చెందిన దేశాలు, బహుళ జాతి సంస్థలు వాటిని దుర్వినియోగం చేయడం నుంచి కాపాడుతుందని మంత్రిత్వ శాఖ ప్రతినిధి అన్నారు. దౌత్యపరమైన సదస్సులో మే 13 నుంచి 24వరకు జరిగిన రెండు వారాల సంప్రదింపులలో 192 దేశాలు, 86మంది పరిశీలకులు చర్చలు జరిపిన అనంతరం ఒక అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు.

మేధోసంపత్తి, జన్యుపరమైన వనరులు (జిఆర్), తత్సంబంధిత సంప్రదాయ విజ్ఞానం (ఎటికె) పై డబ్ల్యుఐపిఓ ఒప్పందం అన్నది గ్లోబల్ సౌత్‌కు, భారత్‌కు గొప్ప విజయం. ముఖ్యంగా, భారీ జీవవైవిధ్యానికి, సంప్రదాయ విజ్ఞానం, వివేకానికి ఖని అయిన భారత్‌కు ఇది అత్యంత గొప్ప విజయమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. శతాబ్దాల పాటు ఆర్థిక వ్యవస్థలు, సమాజాలు, సంస్కృతులకు మద్దతుగా నిలిచిన విజ్ఞానానికి ఇప్పుడు గ్లోబల్ మేధోసంపత్తి వ్యవస్థలో చోటు లభించింది.

మేధోసంపత్తి వ్యవస్థలో జన్యుపరమైన వనరులు, తత్సంబంధిత సంప్రదాయ విజ్ఞానాన్ని అందించే దేశాలకు ముందెన్నడూ లేని విధంగా చట్రాన్ని ఈ ఒప్పందం సృష్టించనుంది. ప్రస్తుతం 35 దేశాలు మాత్రమే బహిర్గతం చేసే బాధ్యతకు కట్టుబడి ఉన్నాయి. ఇందులో చాలావరకూ తప్పనిసరి కానివి, దాని సమర్ధవంతమైన అమలుకు తగిన ఆంక్షలు లేదా నివారణలు అందుబాటులో లేనివి.

అభివృద్ధి చెందిన దేశాలు సహా ఈ ఒప్పందం లోని పార్టీలు తమ చట్టపరమైన చట్రంలో పేటెంట్ దరఖాస్తులు మూలాన్ని బహిర్గతం చేయడం తప్పనిసరి చేసే చట్టాలను రూపొందించవలసి ఉంటుంది. ఈ ఒప్పందం సామూహిక వృద్ధికి సంబంధించిన ప్రయాణానికే కాదు, శతాబ్దాలుగా భారత్ ప్రతిపాదించి, ప్రోత్సహించిన నిలకడైన వృద్ధి హామీని అందించే దిశకు సంకేతంగా నిలుస్తుంది.

పేటెంట్ దరఖాస్తుదారులు తమదంటూ వాదించే ఆవిష్కరణలకు మూలమైన జన్యు వనరులు లేదా సంబంధిత సాంప్రదాయ విజ్ఞానాన్ని బహిర్గతం చేసే ఆవిష్కరణలకు ఐపి వ్యవస్థ ప్రోత్సాహకాలు ఇవ్వడాన్ని కొనసాగించవచ్చు.

దీనికోసం సుదీర్ఘంగా పోరాడుతున్న భారత్, గ్లోబల్ సౌత్‌కు ఈ ఒప్పందం ఘన విజయం. బహుళ వేదికపై దాదాపు రెండు దశాబ్దాలకు పైగా చర్చలు, సంప్రదింపులు అనంతరం 150కి పైగా దేశాల ఏకాభిప్రాయంతో ఈ ఒప్పందం కుదిరింది.

ఇందులో మేధో సంపత్తిని ఉత్పత్తి చేసి, ఈ వనరులు, విజ్ఞానాన్ని ఆవిష్కరణలకు, పరిశోధనలకు ఉపయోగించుకునే మెజారిటీ అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఉన్న క్రమంలో మేధోసంపత్తి వ్యవస్థలో సంఘర్షణకు తావిచ్చే రూపావళులకు ఈ ఒప్పందం వంతెనగా ఉండటమే కాక, శతాబ్దాలు,దశాబ్దాల తరబడి ఉనికిలో ఉన్న జీవవైవిధ్యానికి రక్షణ లభ్యమవుతుంది.

– జాగృతి డెస్క్

# ఇరాన్ అధ్యక్షుడి మరణం

# భారత్–ఇరాన్ సంబంధాల భవిష్యత్తు?

*బహుళ ధృవ ప్రపంచం దిశగా సమీకరణాలు వేగంగా మారుతున్న క్రమంలో, తాను ఇంక ఎంత మాత్రం పెద్దన్నగా వ్యవహరించలేనని తెలిసినా, చింతచచ్చినా పులుపు చావదన్నట్టుగా అమెరికా ఇతర దేశాల వ్యవహారాల్లో మోకాలు అడ్డుతూనే ఉంది. ఇటీవలే ఇరాన్‌తో చాబహార్ రేవు అభివృద్ధి, నిర్వహణ కోసం ఇరాన్‌తో భారత్ చేసుకున్న పదేళ్ల ఒప్పందంతో ఉలిక్కిపడిన అమెరికా భారత్‌పై కూడా ఆంక్షలు విధిస్తానని హెచ్చరించింది. ఈ పరిణామాలు చోటు చేసుకున్న రెండు వారాలలోపే ఇరాన్ అధ్యక్షుడు రైసీ హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో పలు కుట్ర సిద్ధాంతాలు అంతర్జాతీయ గాలిలో చక్కర్లు కొడుతున్నాయి. అందులో ఈ ప్రమాదం వెనుక అమెరికా అదృశ్య హస్తం ఉన్నదన్నది ఒకటి. ఇక సహజం గానే, హమాస్‌కు ఇరాన్ మద్దతు ఇస్తోందన్న అక్కసుతో ఇజ్రాయెలే చేసిందన్నది మరొకటి. ఇలా అనేకం వినిపిస్తున్నా, అందరి కళ్లూ మాత్రం కొత్తగా ఇరు దేశాలూ చేసుకున్న ఒప్పందం పురోగమిస్తుందా లేదా అన్నదాని మీదే ఉండడం దాని ప్రాముఖ్యతను చెప్పకనే చెప్తుంది.*



ఏమైనప్పటికీ, ఒక చారిత్రిక కీలక మలుపులో ఈ ఘటన చోటు చేసుకోవడం మాత్రం అనేక అనుమానాలకు తావిస్తున్నది. అందుకు కారణం చాబహార్ రేవుకు, దానితో పాటుగా నిర్మించినున్న నార్త్‌సౌత్ కారిడార్‌కు గల భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యమే. భారత్ దృష్టిలో కీలక వ్యూహాత్మక ప్రాముఖ్యం కలిగిన పశ్చిమ ఆసియా అన్నది తన పొరుగు విస్తరణే. ముఖ్యంగా, ఇరాన్ ప్రాంతీయ భద్రత, స్థిరత్వానికి కూడా దోహదం కీలక మిత్రదేశం. ఈ ప్రాంతంలో వివిధ దేశాలను కలుపుకునే గతిశీలత, భౌగోళిక రాజకీయ అంచనాలన్నీ కూడా ఇరాన్ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే జరగాలని జియోపొలిటికల్ విశ్లేషకులు అంటున్నారు. అటు రష్యాతో, చైనాతో, భారత్‌తోనూ సత్సంబంధాలు నడుపుతున్న ఇరాన్‌కు బుద్ధి చెప్పాలనుకున్న అమెరికా వ్యూహాత్మకంగా ఇండో–పసిఫిక్ భావనను రూపొందించి, అందులో చైనాకు వ్యతిరేకంగా ఉన్న తమ కూటమిలో భారత్‌ను కూడా చేర్చింది. కానీ, 2021లో లద్దాక్‌తో జరిగిన ప్రతిష్టంభన తర్వాత, చైనాకు వ్యతిరేకంగా బలమైన దేశాలతో కలవడం తన ప్రయోజనాలకు మంచిది కాదనే విషయాన్ని భారత్ గ్రహించిందని విశ్లేషకులు చెప్తున్నారు.

క్వాడ్ (క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్) వంటి వేదికలన్నీ తమ భద్రతా ప్రాముఖ్యతను కోల్పోయిన ఫలితంగా, చైనాకు వ్యతిరేకంగా ఎటువంటి సముద్ర సంఘటనలో చేరేందుకు భారత్ విముఖతను ప్రదర్శించడంతో యుఎస్ ఆకస్ (ఎయుకెయుఎస్), స్క్వాడ్ (ఎస్క్యూయుఎడి) వంటి వేదికలను ఏర్పాటు చేస్తోంది. హిందూ మహాసముద్రంలో చైనా ఉనికి ఆందోళనకరమైనదే అయినా, యుఎస్, యుకెతో పాటుగా ఫ్రాన్స్, జర్మనీల ఉనికి కూడా అంతే ఇబ్బందికరమైనది. ఈ క్రమంలో హిందూ సముద్ర తీరప్రాంతాన్ని సామ్రాజ్యవాద శక్తులు ఆక్రమించకుండా, దానిని కాపాడేందుకు సహకరించుకునేందుకు మనం ప్రాంతీయ సహకారాన్ని కూడగట్టుకోవడం అత్యవసరం. అందుకే, హిందూ మహాసముద్ర పశ్చిమ ప్రాంతంలోని దేశాలతో భారత్ ద్వైపాక్షిక సంబంధాలను నెలకొల్పుకున్నది. సౌదీ అరేబియా, యుఎఇ, ఒమన్, ఇరాన్‌లతో కలిసి సముద్ర విన్యాసాలు నిర్వహిస్తున్నది కూడా ఇందుకే.

భారత్‌తో గల బలమైన ద్వైపాక్షిక, బహుళ పాక్షిక సంబంధాలను మరింతగా పటిష్టం చేసుకోవాలన్నది ఇరాన్ దివంగత అధ్యక్షుడు రైసీ భావించారు. అంతేకాదు, ఎదుగుతున్న భారతదేశాన్ని గుర్తించడమే కాకుండా, కశ్మీర్ సమస్యను సానుకూల దృక్కోణంలో చూసి, చాబహార్‌ను భారత్ మరింతగా అభివృద్ధి చేయాలని కోరుకున్నారని, అంతర్జాతీయ విశ్లేషకులు అంటున్నారు. కాగా, 2023లో జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ఇరాన్ అభ్యర్థిత్వాన్ని సమర్ధించి, దానిని సభ్యదేశంగా ఆహ్వానించిన అనంతరం, ప్రధాని మోదీ, అధ్యక్షుడు రైసీ విరామంలో కలుసుకున్నారు. అనంతరం, వారు గాజాలో పరిణామాలతో పాటు, రెడ్‌సీలో హూతీ దాడులను గూర్చి కూడా చర్చించినట్టు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా, అమెరికా ఆంక్షలకు జడవకుండా చాబహార్ ఒప్పందంతో ముందుకు పోవడం అన్నది ఇరాన్ పట్ల పెరుగుతున్న విశ్వాసానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు.

**భారత్‌తో ఇరాన్ సంబంధాలు:**

భారత్, ఇరాన్‌ల మధ్య సంబంధాలు ప్రాచీనమైనవి. ఇరుదేశాల మధ్య రాకపోకలు సహా అర్థవంతమైన సంబంధాలు ఉండేవి. 1947 వరకూ సరిహద్దులను పంచుకోవడంతో ఇరు దేశాలలో భాష, సంస్కృతి, సంప్రదాయాల మధ్య సంబంధాలు కనిపిస్తాయి. మార్చి ,1950లో దౌత్యపరమైన సంబంధాలను ఏర్పరచుకున్నప్పటి నుంచీ ఎన్నో ఒడుదుడుకులను దాటుకుని వచ్చాయి.

ప్రచ్ఛన్న యుద్ధకాలం (1950–1990)లో భారత్ తటస్థ విధానాన్ని (నాన్– అలైన్‌మెంట్) అవలంబించినప్పటికీ, సోవియట్ యూనియన్ (యుఎస్ఎస్ఆర్)తో బలమైన సంబంధాలను కలిగి ఉండగా, ఇరాన్ వెస్టర్న్ బ్లాక్‌లో బహిరంగ సభ్య

దేశంగా ఉంటూ యునైటెడ్ స్టేట్స్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉంది. ఈ కాలంలో భిన్న రాజకీయ ప్రయోజనాల కారణంగా భారత్, ఇరాన్‌ల మధ్య సంబంధాలు కొంత దెబ్బతిన్నాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలానంతరం కూడా పరిస్థితి అంతగా మెరుగుపడలేదు. భారత్-పాకిస్తాన్ సరిహద్దు ఘర్షణలలో ఇరాన్ పాకిస్తాన్‌కే మద్దతు ఇస్తూ



వచ్చింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని భారత్ బలంగా వ్యతిరేకించడం వెనుక ఉన్న కారణమిదే. దానికి తోడుగా, ఇరాన్-ఇరాక్ యుద్ధ సమయంలో ఇరాక్‌కు భారత్ మద్దతు ఇవ్వడం కూడా సంబంధాలను దెబ్బ తీసింది.

కాగా, 2019లో ఇరాన్‌పై యుఎస్ ఆంక్షలు విధించడంతో భారత్ ఆ దేశం నుంచి ముడిచమురు దిగుమతి చేసుకోవడం నిలిపివేసింది. 2019కి ముందు ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలలో రెండవ అతిపెద్ద కొనుగోలుదారు భారత్. ఇటీవలి కాలంలో, అంటే 2021లో ఇరు దేశాలూ తాలిబన్ తిరిగి అఫ్ఘాన్‌ను తిరిగి కైవసం చేసుకునే వరకూ ఉన్న తాలిబన్ వ్యతిరేక ప్రభుత్వానికి మద్దతునిచ్చాయి.

ఇరుదేశాల మధ్య చమురేతర వాణిజ్యం కొనుసాగుతూనే ఉన్న 2019-20 ఆర్థిక సంవత్సరంలో 4.8 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యం 2020-21 వచ్చేసరికి 56శాతం పడిపోయి 2.1 బిలియన్ డాలర్లకు క్షీణించింది. మన దేశం నుంచి బియ్యం, తేయాకు, చక్కెర, తాజా పళ్లు, మందులు/ ఔషధాలు, చేతితో చేసిన స్టేపుల్ ఫైబర్లు, ఎలక్ట్రికల్ యంత్రాలు, కృత్రిమ ఆభరణాలు, తదితరాలను ఎగుమతి అయ్యేవి. అక్కడి నుంచి మనం డ్రైఫ్రూట్స్, కర్బనరత/ సేంద్రియ రసాయనాలు, గాజు, గాజు సామాగ్రి, సహజమైన, కృత్రిమ ముత్యాలు, సహజమైన, కృత్రిమ రత్నాలు, లెదర్, జిప్సం తదితరాలను దిగుమతి చేసుకుంటాం.

మారుతున్న ప్రపంచ సమీకరణాలను గుర్తించిన దివంగత అధ్యక్షుడు రైసీ భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకునే విధానాలను రూపొందించారు. దీనితో, 2023-24లో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 2.33 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ క్రమంలోనే చాబహార్ అభివృద్ధికి 2016లోనే అత్యున్నత నాయకుడు ఖొమైనీ మార్గదర్శనంతో నాటి ఇరాన్ అధ్యక్షుడు, నాటి అఫ్ఘాన్ అధ్యక్షుడు ఒప్పందం చేసుకున్నారు. తాజాగా, మధ్య ఆసియా ప్రాంతానికి ప్రధాన ద్వారంగా కాగల చాబహార్ రేవు అభివృద్ధికి ఒప్పందం చేసుకొని, ప్రాంతీయ స్థిరత్వం కోసం రైసీ ఒక అడుగు వేశారు.

### రైసీ మరణంతో సంబంధాలు మారుతాయా?

ఈ సమయంలో ఆయన మరణం కారణంగా, ప్రాంతీయ సుస్థిరత, ఇంధన భద్రత, అనుసంధానంతో భారత్ సంబంధం దెబ్బతింటుందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా, ప్రాంతీయ సంఘర్షణలపై ఇరాన్ వైఖరి మారినా, అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకున్నా, మధ్యఆసియాకు సంబంధించి భారత్ తీసుకున్న విదేశాంగ విధానాన్ని ప్రభావితం చేస్తాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా ప్రాంతీయ సంఘర్షణల పట్ల దాని విధానంలో మార్పు లేదా, ఇతర దేశాలతో దాని సంబంధాలు భారత్ భద్రతా లెక్కలను ప్రభావితం చేసే అవకాశం కూడా ఉన్నది. అయితే, ఇరాన్ అత్యున్నత నాయకుడు ఖమైనీనే విదేశాంగ, వాణిజ్య విధానాలపై అంతిమ నిర్ణయాలను తీసుకుంటారని, ఆయన మార్గదర్శనంలోనే చాబహార్ రేవు ఒప్పందం జరిగిందని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కనుక, ప్రాంతీయ వాణిజ్యానికి, భారత వ్యూహాత్మక ప్రయోజనాలకు కీలకమైన చాబహార్ రేవు వంటి ఆర్థిక ప్రాజెక్టులకు భారత్ ఇప్పుడు దీర్ఘకాలిక ఒప్పందాలు, పెట్టుబడులతో ప్రాధాన్యత ఇవ్వవలసి ఉం టుంది. అంతేకాదు, యుఎస్‌తో సంబంధాలు, ఇరాన్‌తో బంధాల మధ్య సున్నితమైన సమతుల్యతను నిర్వహిస్తూ, ఈ ఆంక్షల మధ్య ముందుకు సాగేందుకు తోడ్పడుతుంది.

### ఇరాన్ -పశ్చిమ ఆసియా పరిణామాలు:


పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తీవ్రమైన సమయంలో ఈ ప్రమాదం జరగడం ఒక కీలకాంశం. ఇజ్రాయెలీ నగరాలపై హమాస్ దాడుల ఫలితంగా గత ఏడు నెలలుగా, ఇజ్రాయెల్, గాజాల మధ్య యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో హెజ్‌బుల్లాకు మద్దతునిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ మరొక యుద్ధ క్షేత్రాన్ని తెరిచిందనే ఆరోపణలను ఇరాన్ ఎదుర్కొంటున్నది. ఈ ఉద్రిక్తతల నేపథ్యమే రైసీ మరణం ద్వారా ఏర్పడబోయే పరిణామాలను అర్థం చేసుకోవడానికి కీలకం. గత నెలలో ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం, వాటిని ఇజ్రాయెల్ డోమ్ రక్షణ వ్యవస్థ ఆటంక పరచడం జరిగాయి. సిరియాలో గల ఇరాన్ దౌత్య కార్యాలయంపై బాంబు దాడికి ప్రతిగా ఈ దాడి జరిగిందనే వార్తలు వచ్చాయి. దీనికి స్పందనగా, ఇరాన్‌లో యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్ (యురేనియం శుద్ధికేంద్రం) గత ఇస్ఫహాన్ ప్రావిన్సుపై ఇజ్రాయెల్ పరిమిత దాడి చేసింది. ఈ కుక్క కాటుకి చెప్పుదెబ్బ చర్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తీవ్రం చేసిన క్రమంలో రైసీ మరణించడంతో ఇవి ఈ ప్రాంతాన్ని అస్థిరపరుస్తాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

> గత నెలలో ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం, వాటిని ఇజ్రాయెల్ డోమ్ రక్షణ వ్యవస్థ ఆటంక పరచడం జరిగాయి. సిరియాలో గల ఇరాన్ దౌత్య కార్యాలయంపై బాంబు దాడికి ప్రతిగా ఈ దాడి జరిగిందనే వార్తలు వచ్చాయి.

### ఇరాన్‌లో అస్థిరత కొనసాగుతుందా?

దానితోపాటుగా, ఇరాన్‌లో కూడా కొంతకాలం పాటు అంతర్గతంగా అస్థిరత ఏర్పడే అవకాశముంది. ముఖ్యంగా, నాయకత్వ బదలాయింపు ప్రక్రియను ప్రపంచమంతా సన్నిహితంగా పరిశీలిస్తుంది. ఎందుకంటే, అదే ఇరాన్ దేశీయ విధానాలను, అంతర్జాతీయ దౌత్య సంబంధాల పద్ధతిని ప్రభావితం చేస్తుంది. అణు కార్యక్రమం, ఇజ్రాయెల్‌తో సంబంధాలు, యుఎస్‌తో చర్చలవంటివన్నీ కూడా భౌగోళిక రాజకీయ క్షేత్రాన్ని మలచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాదు, ఈ ఘటన కారణంగా ఇరాన్ అంతర్గత భద్రత, రాజకీయ గతిశీల తలపై నిశిత పరిశీలన, స్పెక్యులేషన్‌కు తావిస్తుంది. ఎక్కడైనా బలహీనత లేదా అస్థిరత ఉందనే వదంతి వచ్చినా, అది శత్రువులకు మరింత ధైర్యాన్నిచ్చి, ప్రాంతీయ, అంతర్జాతీయ సంబంధాలగుండా పయనించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను సంక్లిష్టం చేస్తుంది.

భారత్, ఇరాన్, మధ్య ఆసియా దేశాలకు లబ్ధిని చేకూర్చే ఈ అనుసంధాన ప్రాజెక్టు కొనసాగాలని ఇరానియన్లు కోరుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి. అదే నిజమైతే, రేవుతో పాటు, రష్యా వరకూ సాగే కారిడార్ నిర్మాణం కూడా సాకారమయ్యి ఈ ప్రాంతమంతా సిరులపంటగా మారే అవకాశముంది. అమెరికా ఆంక్షలతో ఆర్థికవ్యవస్థ చెప్పుకోదగిన ఒత్తిడిలో ఉండటమే కాదు, ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ప్రజల మద్దతును కూడగట్టుకోవడం అక్కడి ప్రభుత్వానికి కష్టంగా ఉన్నదన్నది వాస్తవం. ★



'ప్రధానమంత్రిగా అవకాశం వస్తే నేను వదులుకుంటానా?' అంటూ విలేకరిని ఎదురు ప్రశ్నించారు మాజీ ముఖ్య మంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖరరావు. ఆయన కుమారుడు  కె.టి. రామారావు ధాన్యం సేకరణలో రూ.1000 కోట్లు అవకతవకలు జరిగాయని ధాటీగా వాదిస్తున్నారు. ఇదే భారత రాజకీయాలలో కనిపించే ఒక వైచిత్రి. ఎందుకంటే కె.చంద్రశేఖరరావు హయాంలో జరిగిన ఫోన్ ట్యాంపింగ్ ఇప్పుడు వాళ్ల పీకలకు చుట్టుకుపోయి ఉంది. ఆ ఉచ్చు బాగా బిగుసుకుపోయింది కూడా. అయినా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. తాజా పరిణామాలు, ఫోన్ ట్యాపింగ్‌లో అరెస్టయిన పోలీస్ అధికారులు వెల్లడించిన నిజాలు తెలంగాణనే కాదు, దేశాన్నే విస్తుపోయేటట్టు చేస్తున్నాయి. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ రాజ్యాంగ సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని పదే పదే విమర్శించే, ఎదురు దాడికి దిగే ఒక రాజకీయ ముఠా నిర్వాకమే ఇదంతా. తన అధీనంలో ఉండే పోలీసు, నిఘా వ్యవస్థలను దారుణంగా ఉపయోగించుకున్నారు కేసీఆర్.

# బీజేపీని ముంచబోయి... కేసీఆర్ రాంగ్ నంబర్

తెలంగాణలో శరవేగంగా విస్తరిస్తున్న బీజేపీని చూసి మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు తడబడిన సంగతి నిజం. ఫలితమే ఫోన్ ట్యాపింగ్ కుట్ర. తన పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి బీజేపీ పథకాలు రచించిందని కేసీఆర్ ఆరోపించారు. ఆ పార్టీ ప్రముఖులను అరెస్టు చేయడానికి కూడా ఆయన పథకాలు వేశారు. ఆఖరికి ట్యాపింగ్ కుట్ర పరిధిలోకి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, ఇతర ప్రముఖులతో పాటు తన పార్టీ వారిని కూడా కేసీఆర్ తీసుకు వచ్చేటట్టు చేశారన్నది నిజం. ఆ నిజమే ఇప్పుడు మరీ విస్తుగొలుపుతున్నది. తనకు పెద్ద సవాలుగా మారిన బీజేపీని అప్రతిష్ట పాల్జేద్దామని కేసీఆర్ ఆరంభించిన జాతీయ విద్రోహ చర్య ప్రతికూలంగా పరిణమించింది. దారుణంగా బెడిసికొట్టింది. అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ కుట్రను వెలికి తీసింది. అసలు నిజం వెల్లడైంది. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొదలైన ఈ 'దొంగ చెవుల' నాటకం 2019 లోక్‌సభ ఎన్నికలు, తరువాత జరిగిన ఉప ఎన్నికలు, 2023 ఎన్నికలలో కూడా కొనసాగింది. అందుకే ఈ కేసు పరిధి మరీ విస్తరించిపోయింది. ఇందుకు పదవీ విరమణ చేసిన తన తైనాతీలనే కేసీఆర్ ఎంచుకున్నారు. అది కూడా తన సామాజిక వర్గానికి చెందిన వారికే ఈ బాధ్యతను అప్పగించారు. అంటే చట్టానికి ఎన్ని రకాలుగా తూట్లు పొడవచ్చునో అన్ని రకాలుగానూ తూట్లు పొడిచారు. అయితే బీజేపీనీ, మోదీనీ ఆయన యథేచ్ఛగా విమర్శిస్తారు.

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కూరుకుపోయిన తన కుమార్తె, ఎమ్మెల్సీ కవితను రక్షించేందుకు కేసీఆర్ వేసిన ఎత్తు ఇది అని అంతిమంగా తేలింది. బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్‌ను ఈ కుట్రలో చేర్చాలని కూడా కేసీఆర్ ప్రయత్నించారు. సంతోష్‌ను అరెస్టు చేసి, కవితను ఢిల్లీ లిక్కర్ గొడవ నుంచి బయటకు తేవాలన్నదే కేసీఆర్ ఆలోచన అని బయటపడింది. నేరాంగీకార వాంగ్మూలంలో టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఈ విషయాలు బయటపెట్టారు. బీజేపీని ఇరుకున పెట్టేందుకు తన పార్టీ ఎమ్మెల్యేల కొనుగోలు నాటకం ఆడించారాయన. రేవంతరెడ్డి, బండి సంజయ్, ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ల ఫోన్‌లను కూడా కేసీఆర్ ట్యాప్ చేయించారు.

ఇదంతా రాజకీయమని, తన ఉనికిని కాపాడుకునే వ్యూహమని ఇప్పటికీ కేసీఆర్ నమ్ముతూ ఉండవచ్చు. ప్రభుత్వం ఓడిపోయిన తరువాత కూడా ఆయన ధోరణి మారలేదు. అహంకారం చావలేదు. అందుకే ఈ మాట అనుకోక తప్పదు. కానీ ఇదంతా నేర మనస్తత్వం మాత్రమే. అందుకే ఇప్పుడు కేసీఆర్‌ను అరెస్టు చేయాలని, ఇన్ని వాస్తవాలు బయటపడినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అడగడం సబబే. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ పెద్దలు, ముఖ్యులు అనుసరించిన పద్ధతులు, విచ్చల విడిగా ప్రవర్తించిన తీరు జుగుప్సాకరమే. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దానికి పరాకాష్ట. అంతా బహిర్గతమైన తరువాత కూడా ఆ పార్టీ పెద్దలు వ్యవహరిస్తున్న తీరు కూడా ప్రజాస్వామ్యాన్ని గౌరవించేదే కాదు. అధికారం తమకే శాశ్వతం అని, దానికి తమను ఎవరూ దూరం చేయలేరన్న అత్యుత్సాహం, అతి ఆలోచన ఎంతగా గూడుకట్టుకొని ఉందో ఈ ఉదంతం, దాని క్రమం ద్వారా అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

ఈ రాజ్యాంగ వ్యతిరేక తతంగంలో కేసీఆర్ ప్రభుత్వ యంత్రాంగాన్నే కాదు, తన పార్టీని, ఎమ్మెల్యేలను కూడా ఎరగా వాడుకున్నారు. ఇందుకు వేదిక తనకు తెలిసిన ఫామ్ హౌస్. తమ సామాజిక

వర్గానికి చెందిన ఓ కిందిస్థాయి పోలీసు అధికారిని వాహకంగా ఉపయోగించుకొని ఆయనకు అనైతికంగా, అడ్డదారుల్లో పోస్టింగులు, ప్రమోషన్లు ఇచ్చారు. అత్యున్నత స్థాయి అధికారులకు ఇవ్వాల్సిన బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ పెద్దలే తన వెనక ఉన్నారన్న భరోసాతో ప్రభుత్వంలోని పెద్దలు,ఇతర ముఖ్యులు చెప్పినట్టల్లా చేశారా అధికారి. అవసరాలకోసం వాళ్లకు గిట్టని, సవాళ్లు విసురుతున్న వారి సెల్ ఫోన్లు ట్యాపింగ్ చేశాడు. సినిమా ప్రముఖులు, హీరోయిన్లు సెల్ ఫోన్లు కూడా ట్యాపింగ్ చేసినట్లు వివరాలు బయటకు వచ్చాయి.

ఈ ఉదంతం గురించి ప్రస్తావిస్తూ బండి సంజయ్ అత్యవసర పరిస్థితిని గుర్తు చేసుకున్నారు. నిజమే, నాడు ఇందిర ప్రచార సభలకు ప్రధాని సచివాలయ అధికారి ఒకరు పని చేశారు. అదే ఆమె ఎన్నికకు ముప్పు తెచ్చింది. గతాన్నీ, చరిత్రనీ గుర్తుంచుకుంటే ఇలాంటివి జరగవు. కానీ అధికార మదం నేతలను ఆ పని చేయనీయదు.

తెలంగాణలో కేసీఆర్‌ను మూడోసారి కూడా గెలిపించాలని ఎస్ఐబీ అహర్నిశలు శ్రమించింది. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకరరావే (ప్రస్తుతం ఈయన అమెరికాలో ఉన్నారు) ఈ బాధ్యతను నెత్తికి ఎత్తుకున్నారు. ఈ విషయం రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో చెప్పారు. విపక్ష నేతలకు అండగా ఉన్న వ్యాపారులును దెబ్బ తీయడానికి కూడా ట్యాపింగ్ ఆయుధాన్ని ఉపయోగించారు. ఈ సమాచారంతో పాటు పార్టీలో ఉన్న అసమ్మతుల గురించి కూడా "పెద్దాయన"కి చేరవేస్తూ ఉండేవారు. అవి ఎలా ఉండేవి? కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేతో విభేదాలు ఉన్న శంభీపూర్ రాజు మీద, కడియం శ్రీహరితో విభేదాలు ఉన్న టి. రాజయ్య వంటివారి కదలికలపైన, ఆఖరికి తాండూ ఎమ్మెల్యేతో పట్నం మహేందర్‌రెడ్డికి ఉన్న విభేదాల మీద ట్యాపింగ్‌తో సమాచారం తీసుకున్నారు. తీగల కృష్ణారెడ్డి, తీన్మార్ మల్లన్న, జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డిల ఫోన్‌ల మీద నిఘా ఉంచారు. ఇక బీజేపీ నేతలు బండి, అరవింద్, ఈటల ఫోన్‌ల మీద కూడా నిఘా ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ ఫోన్ కూడా ట్యాప్ చేశారు.

ఇదంతా చట్ట వ్యతిరేకమని పోలీసులుకు తెలియక కాదు. కానీ అంతా తెలిసే ఈ వ్యవహారం వారు నడిపించారు. ఈ విషయాన్ని మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు చెప్పడం విశేషం. ఇంత భరోసా ఎందుకు? కేవలం బీఆర్ఎస్ మూడోసారి కూడా అధికారంలోకి వస్తుందని నమ్మడమే. కానీ కథ అడ్డం తిరిగింది. ఆ పార్టీ ఓడిపోయింది. ఎంతయినా పోలీసులు కదా! జరగబోయే కథను ముందే ఊహించి ఒకరిని ఒకరు అప్రమత్తం చేసుకున్నారు. ఒకరినొకరు సంప్రదించుకుని అన్ని ఆధారాలను నాశనం చేశారు. దీనికి ఎస్ఐబీ సిబ్బంది కూడా తోడ్పడింది. పోలీసులు కావచ్చు. వారు నిఘా విభాగం కావచ్చు. కానీ వారు ఎన్నికల విశ్లేషకులు కాదు. ఆ స్పృహ వారికి లేదు.

అధికారం శాశ్వతం కాదని రాజకీయ నాయకులు బయటకు అంటారే గాని, వాస్తవంగా ఆ మాట పట్ల వారికి విశ్వాసం ఉండదు. ఒకసారి కుర్చీ దక్కిన తరువాత అది దూరం కాదని వారి పిచ్చి నమ్మకం. కేసీఆర్ కూడా అంతే. బయటకి ఎంతో మెట్ట వేదాంతం చెప్పినా, ఆయన స్వతహాగా అహంకారి. నియంత. అందరి నియంతల మాదిరిగానే అధికారం పోయిన తరువాత ఆయన పరిస్థితి కూడా శరవేగంగానే పతనమైంది. తన కుట్ర తన కళ్ల ఎదురుగానే ఎలా పరిణామం చెందుతున్నదో ఆయనే చూస్తున్నారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్‌ల వ్యవహారం కొత్త మలుపులు తిరిగింది.

ఈ వ్యవహారం వెనక ఉన్న బీఆర్ఎస్ కీలక నేతను దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ కేసులో ముగ్గురు పోలీసు అధికారులను అరెస్టు చేశారు. ట్యాపింగ్ వ్యవహారం నడిపించిన డీఎస్పీ ప్రణీత్‌రావును మొదట అరెస్టు చేయడాన్ని కూడా కేసీఆర్ చూశారు. విచారణలో ప్రణీత్‌రావు నుంచి సేకరించిన వివరాలతో మరో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కేసీఆర్ కళ్ల ఎదుటే కటకటాల్లోకి వెళ్లారు.



ఆ క్రమం కూడా గుర్తు చేసుకోదగ్గదే. కాంగ్రెస్ ప్రభుత్వంలోని నిఘా వర్గాలు వేసిన ప్రతి అడుగు జాగ్రత్తగానే వేశారు. ముగ్గురు పోలీసు ప్రముఖుల అరెస్ట్ తరువాత అధికారులు తెర వెనుక పాత్రలపై దృష్టి పెట్టారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఈ కేసులో కీలక నిందితుడని ఆది నుంచి అనుమానించినా, అదనపు ఎస్పీల అరెస్టు తర్వాతే దానిని రూఢి చేసుకున్నారు. విపక్ష నేతలు, అధికారులు, ఇతరుల ఫోన్లను ట్యాపింగ్ చేయడానికి ప్రభాకర్‌రావు ఆదేశాలే కారణమని భుజంగరావు, తిరుపతన్న వాంగ్మూలమిచ్చినట్లు రిమాండ్ నివేదికలో పేర్కొన్నారు. ఇంకా బీఆర్ఎస్ కీలక నేత ఒకరు ఉన్నట్లు, ఆయన చెప్పిన నంబర్లను ట్యాప్ చేసినట్లు ఎఎస్పీలు అంగీకరించిన సంగతి కూడా వెల్లడైంది. ఆ నేత ఇచ్చే నంబర్లను వీరిద్దరూ ప్రణీత్‌రావుకు అందించేవారు. ఆయన ఇచ్చిన సమాచారాన్ని ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తిరిగి బీఆర్ఎస్ నేతకు అందజేసేవారు.

అప్పట్లో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న రాధాకిషన్‌రావు ఇచ్చిన నంబర్లన్నీ ట్యాప్ చేసినట్లు ఒప్పుకొన్నారు. వాటి ఔట్‌పుట్‌ను కూడా ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తిరిగి రాధాకిషన్‌రావుకు పంపేవారు. ఎన్నికల సమయంలో వందలాది రాజకీయ నేతలు, వారి కుటుంబసభ్యుల ఫోన్లను ట్యాప్ చేశామని, రాజకీయ నేతలు కదలికలు, నిధుల సమీకరణపై దృష్టిపెట్టామని ప్రణీత్‌రావు చెప్పక తప్పలేదు. వ్యాపారవేత్తలతో పాటు ప్రముఖుల ఫోన్లను కూడా టాప్ చేశారు. పోలీసులు రిమాండ్ రిపోర్టులో ఈ వివరాలను పొందుపరిచారు. ప్రైవేటు వ్యక్తులపై ఫోన్‌లు ట్యాపింగ్ చేసి వారికి సంబంధించిన ప్రొఫైల్ తయారు చేసినట్లు, అందుకు సంబంధించిన సాక్ష్యాలను నాశనం చేసినట్లు తిరుపతన్న, భుజంగరావు విచారణలో అంగీకరించారు. కేసీఆర్ దిగిపోయిన తరువాత ఆధారాలు నాశనం చేయడం మరొక కోణం. ఈ కేసులో మరో కీలక నిందితుడు, ఐన్యూస్ యజమాని శ్రవణ్‌కుమార్‌రావు, ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు విదేశాల్లో ఉన్నట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఆ ముగ్గురిపై లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. ప్రణీత్‌రావు వాంగ్మూలం మేరకు నల్లగొండలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్, వరంగల్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను కూడా దర్యాప్తు అధికారులు విచారించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కు చెందిన డబ్బులను వీరిద్దరే

వాహనాల్లో తరలించారని విచారణలో తేలింది.

ట్యాపింగ్ వ్యవహారం కోసం ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించింది. 2018లో ఎస్ఐబీలో ఇన్‌స్పెక్టర్ హోదాలో చేరిన ప్రణీత్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కోసం 2 గదులు, 17 కంప్యూటర్లతో పాటు, ప్రత్యేక అధికారాలు కట్టబెట్టినట్లు సమాచారముంది. విదేశాల నుంచి తెచ్చిన అధునాతన టెక్నాలజీని ఇందుకోసం వాడినట్లు గుర్తించారు. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన సోదరుల ఇళ్ల పరిసర ప్రాంతాల్లో ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 2 కి.మీ. పరిధిలోని ప్రైవేట్ కమర్షియల్ బిల్డింగ్స్‌లో అత్యాధునిక టెక్నాలజీతో ఈ పరికరాలు అమర్చినట్లు స్పెషల్ టీమ్ గుర్తించింది.

అయితే కథ అడ్డం తిరిగిందని తెలియగానే ఆధారాలను ధ్వంసం చేసే పని మొదలయింది. ప్రభుత్వం మారిన తర్వాత ట్యాపింగ్ సంబంధించిన మెయిన్ డివైజ్‌ని పూర్తిగా ధ్వంసం చేసిన సంగతి 17 కంప్యూటర్లలో హార్డ్ డిస్క్‌లన్నిటిని ధ్వంసం చేసి మూసీ నదిలో పడేసినట్లు ప్రణీత్‌రావు చెప్పారు. రెండు లాకర్ రూములలో ఉన్న డాక్యుమెంట్లు అన్నిటిని తగలబెట్టామని కూడా వెల్లడించాడు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన ముగ్గురు కీలక నిందితులు ప్రభాకర్‌రావు పేరు చెప్పడంతో ఆయనను కూడా పాత్రధారిగా దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. ఇక సూత్రధారులు ఎవరనేది తెలియాలంటే ప్రభాకర్‌రెడ్డి అరెస్టు కావాల్సిందేనని చెబుతున్నారు. ఆయన అమెరికాలో ఉన్నారు. ఈ వ్యవహారంలో 'ఐన్యూస్' యజమాని శ్రవణ్‌కుమార్ రావు పాత్ర కీలకమని దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. ఆయన ఫోన్ ట్యాపింగ్ కోసం తన సంస్థలో ప్రత్యేకంగా సర్వర్ రూమ్ ఏర్పాటు చేశాడు. వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రణీత్‌రావుకు అందజేసేవాడని గుర్తించారు.




ప్రభాకర్‌రావు ప్రణీత్‌రావు తిరుపతన్న భుజంగరావు

ఈ కేసుకే సంబంధించిన ఇతర సమాచారం కోసం పట్టుబడిన ల్యాప్‌ట్యాప్ తదితరాలను ఫోరెన్సిక్ శాఖకు పంపారు. అందులో సమాచారం ఎలా ఉంటుందో? శ్రవణ్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించిన పోలీసులు రెండు ల్యాప్‌ట్యాప్‌లు, 4 ట్యాబ్‌లు, 5 పెన్‌డ్రైవ్‌లు, ఒక హార్డ్‌డిస్క్, ఒక డీవీఆర్ సీజ్ చేసి ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. పోలీసులు. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. చెడిపోయిన ట్యాపింగ్ డివైజ్ ను రీట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబట్టి ఇతర సమాచారం ఆశించవచ్చు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు దొరికిన ఆధారాలతో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును ఏ1 గా చేర్చారు పోలీసులు. ఈ కేసులో ఏ1 గా ప్రభాకర్ రావు, ఏ2 గా ప్రణీత్‌రావు, ఏ3గా భుజంగరావు, ఏ5గా తిరుపతన్న, ఏ6 గా మరో వ్యక్తి పేరును చేర్చారు పోలీసులు. అంతిమంగా రూఢి అయినదేమిటి? ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావే కీలక సూత్రధారి. ఆయన కనుసన్నల్లోనే ట్యాపింగ్ జరిగింది.

అరెస్టయిన ముగ్గురు పోలీసు అధికారులు కూడా ఒకే మాట చెప్పారు. అప్పటి ఇంటిలెజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల ప్రకారమే తాము చాలామంది ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆ ముగ్గురు అంగీకరించారు. అదే సంచలనం సృష్టించింది. అమెరికా నుంచి ప్రభాకరరావు చేసిన వ్యాఖ్య మరింత విచిత్రంగా ఉంది. ఆయన టెలిఫోన్లో ఇక్కడి అధికారులతో మాట్లాడుతూ, 'ఇప్పుడు మీరు ఎలా పనిచేస్తున్నారో అప్పటి ప్రభుత్వపెద్దల ఆదేశాల మేరకు మేమూ అలానేచేశాం' అని చెప్పటం విచిత్రంగా ఉంది. అంటే పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెలిఫోన్ ట్యాపింగులన్నీ అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే చేయించినట్లు ప్రభాకరరావు అంగీకరించినట్లు అర్థవుతోంది. మరి ప్రతిపక్షాల నేతలతో పాటు అనుమానాస్పందంగా ఉన్న స్వపక్షం నేతల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్దలంటే కేసీయార్, కేటీయార్, హరీష్ రావు, కవితతో పాటు మరికొంత మంది మాత్రమేనని అందరికీ తెలుసు. వీరిలో ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపింది ఎవరనే విషయం అరెస్టయిన ముగ్గురుపోలీసు అధికారులు, లేదా దేశానికి తిరిగొచ్చిన తర్వాత ప్రభాకరరావు చెబితేకాని తెలీదు.

గతంలోను దేశంలో విపక్షాల ఫోన్‌లను ట్యాప్ చేసిన ఉదంతాలు జరిగాయి. వాటి సారాంశం, తాజా తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ సారాంశం దాదాపు ఒక్కటే. అధికారం శాశ్వతమన్న అంధ నమ్మకంతో వ్యవహరించడం ఏ పార్టీకి సరికాదు. అలాగే అప్పటికి అధికారంలో ఉన్న పార్టీ ప్రభుత్వాన్ని అంటకాగి పబ్బ గడుపుకోవాలని అధికారులు ప్రయత్నించడం సరికాదు. ఇంత పెద్ద ప్రజాస్వామిక దేశంలో అబద్ధాలు దాగవు. ఇంత పెద్ద మీడియా ఉన్న దేశంలో రహస్యాలు ఎక్కువ కాలం మరుగున ఉండవు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల లీకేజీలు, అవినీతి. మరో వైపు ఔటర్ రింగ్ రోడ్డు కుంభకోణం, ఈ ఫార్ములా రేసులో అవినీతి, ధరణిలో భూ అక్రమాలు, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత అరెస్టు లాంటి వివాదాల్లో పార్టీలోని కీలకనేతలు బాగా తగులుకున్నారు.

వీటన్నింటి మీద టెలిఫోన్ ట్యాపింగ్ అంశం తీవ్రమైందనే చెప్పాలి. బీజేపీని రాష్ట్రం నుంచి తరిమివేయాలని అనుకుని, తానే చెత్తబుట్టలోకి పోయింది టీఆర్ఎస్. ★



# ఫ్యాక్ట్ చెకర్‌ను ఫ్యాక్ట్ చెక్ చేసిన పోలీసులు

తప్పుడు వార్తలను ప్రచారం చేస్తూ పట్టుబడడం ఆల్ట్‌న్యూస్ వ్యవస్థాపకులు మహమ్మద్ జుబైర్‌కు, ప్రతీక్ సిన్హాకు కొత్త విషయం కాదు. తనను తాను ఫ్యాక్ట్ చెక్కర్‌గా అభివర్ణించుకునే మహమ్మద్ జుబైర్‌ను ప్రభుత్వ అధికారులు ఫ్యాక్ట్ చెక్ చేశారు. వాస్తవానికి ఇటువంటి ఘటనలు అరవై వరకూ తాము గమనించి, బయటపెట్టినట్టు ఆర్గనైజర్ పత్రిక పేర్కొనడం విశేషం. కాగా, ఒకసారి తప్పుడు సమాచారాన్ని వ్యాపింపచేస్తూ పట్టుబడిన జుబైర్‌ను ఉత్తరాఖండ్ పోలీసులు ఫ్యాక్ట్ చెక్ చేయడం విశేషం. ఇటీవలే జుబైర్ ఖురాన్‌ను దగ్ధం చేస్తున్నట్టుగా రెచ్చగొట్టే వీడియో ఒకదానిని



'ఎక్స్'పై పోస్టు చేసి, రూర్కీకి చెందిన ఒక యూట్యూబర్ ఖురాన్‌ను దగ్ధం చేసి ధ్వంసం చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. రూర్కీ పోలీసులు ఈ వ్యవహారంపై తక్షణ చర్య తీసుకోవాలంటూ పేర్కొన్నాడు. కాగా, అతడు వీడియోను కానీ, ఆ సమాచార వాస్తవికతను కానీ చెక్ చేయకుండా పోస్ట్ చేశాడు. వాస్తవానికి ఫ్యాక్ట్ చెక్కర్‌గా ప్రాచుర్యం పొందిన జుబైర్ ఈ విషయాన్ని చెక్ చేయలేదు. బదులుగా, అది నిజమని నమ్మేలా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఆ పోస్ట్ చేశాడు. అది పాత వీడియోనా లేక మరింకేమైనా అనే విషయాన్ని కూడా స్పష్టం చేయలేదు. కాగా హరిద్వార్ పోలీసులు వెంటనే జుబైర్ మాటలను కొట్టిపడేశారు. అది ఎక్స్-ముస్లిం సమీర్ అనే వ్యక్తికి చెందిన వీడియో అని, అతడు ఆ ప్రాంతంలో మూడేళ్లుగా నివసించడం లేదని, హరిద్వార్ జిల్లాలో అటువంటి ఘటన చోటు చేసుకున్నట్టు తమ దృష్టికి రాలేదని, కనుక సరైన సమాచారం లేకుండా వీడియోలను షేర్ చేయవద్దని, అలా చేస్తే చట్టబద్ధమైన చర్య తీసుకుంటామని వారు ఆ వీడియోకి సంబంధించి ఫ్యాక్ట్ చెక్ చేసి హెచ్చరించారు. జుబైర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ★

# బిహెచ్ఈఎల్ లో నారద జయంతి




**బిహెచ్ఈఎల్ :** సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైశాఖ బహుళ విదియ మే 24 నాడు దేవర్షి నారద జయంతి కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో జయలక్ష్మి మాత భవనంలో జ్యోతి ప్రజ్వలనతో మొదలైంది. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు, బీరంగూడ, రామచంద్రపురం నగరాల నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరైనారు.

జిల్లా ప్రచార ప్రముఖ్ బోయిని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రచార విభాగం జాతీయవాద జర్నలిజం గురించిన సందేశాన్ని సమాజంలో వ్యాపింప చేస్తుందని తెలిపారు.

"ఆర్గనైజర్" వారపత్రికకు దక్షిణ భారత -బ్యూరో చీఫ్, కుంటి సురేందర్ మాట్లాడుతూ జాతీయవాద జర్నలిజం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమైందని తెలిపారు. నారదమహర్షిని ఆదర్శంగా తీసుకొని ప్రస్తుత పాత్రికేయులు లోక కళ్యాణం కోసం, దేశ రక్షణ కోసం పనిచేయాలని తెలిపారు. సమాచార భారతి జాయింట్ సెక్రటరి ఉప్పల ప్రదీప్ మాట్లాడుతూ నారద మహర్షి జయంతి ప్రపంచ పాత్రికేయ దినోత్సవంగా జరుపుకోవటం చాల సంతోషం అని తెలిపారు.

రామచంద్రపురం, బీరంగూడ నగర ప్రచార ప్రముఖులు అరవిందర్, మనోజ్ కార్యక్రమానికి హాజరైన పాత్రికేయులకు, నగర వాసులకు ధన్యవాదాలు తెలియజేశారు. ★






**ఇందూరు:** ఇందూరు నగరంలోని శ్రీ నీలకంఠేశ్వర ఉద్యోగి ప్రభాత్ శాఖ వార్షికోత్సవం మే 26న జరిగింది. ముఖ్యవక్తగా సామాజిక సమరసత వేదిక తెలంగాణ కన్వీనర్ అప్పాల ప్రసాద్ పాల్గొని మార్గ దర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంఘచాలక్ శ్రీనివాస్, ఇతర కార్యకర్తలు, శ్రీ నీలకంఠేశ్వర శాఖ స్వయంసేవకులు కుటుంబాలతో కలిసి 200మంది పాల్గొన్నారు.



'ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి' అన్న మాటలను తు.చ. తప్పకుండా పాటించిన, పాటిస్తున్న కేజ్రీవాల్‌కు రోజులు అస్సలు బాగోలేవు. అవినీతిపై పోరాటం పేరుతో జాతీయ వేదికపైన వెలిసి, అనేకమంది విద్యావంతులైన, నిరక్షరాస్యులైన యువతలో స్ఫూర్తిని, ఆశను నింపిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిని తుడిచిపెట్టేందుకు 'చీపురు' పట్టుకువస్తే, నమ్మి అందరూ పరిశుద్ధమైన ప్రభుత్వం కోసం ఓట్లు వేసి గెలిపించుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కేజ్రీవాల్ ఎన్ని వేషాలు వేసినా, ఆశచావక అతడిని సమర్థించుకుంటూనే వచ్చారు. చివరాఖరకు ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అతడిని అరెస్టు చేసినప్పుడు కూడా వారిలో అతడి పట్ల చిరు ఆశ మిగిలే ఉంది. కానీ, ఎప్పుడైతే ఆప్ రాజ్యసభ సభ్యురాలు, పార్టీ సీనియర్ నాయకురాలు స్వాతి మాలివాల్‌పై ముఖ్యమంత్రి నివాసంలోనే, ఆయన సన్నిహితులు దాడి చేసినప్పుడే జనాల్లో ఆ ఆశ చచ్చిపోయింది.

# 'చెప్పేటందుకే నీతులు'

లిక్కర్‌గేట్ స్కాండల్ (మద్య విధానంలో అవినీతికేసు)లో ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీ కీలకమంత్రులంతా కటకటాలు లెక్కిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. వారికి తోడుగా, ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను కూడా ఎట్టకేలకు ఆధారాలు సంపాదించి పంపారు. తనకు బెయిల్ ఇమ్మంటూ ఎన్నిసార్లు కోరినా అంగీకరించని అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల సందర్భంగా అతడికి ఒక మూడు వారాల పాటు ఎన్నికల ప్రచారం కోసం బెయిల్ ఇచ్చింది (విదేశీ శక్తుల హస్తం కారణంగానే ఇది వచ్చిందనే ఆరోపణలున్నాయి). దానిని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న కేజ్రీ మరొక వారం తనకు స్వేచ్ఛ ఇవ్వమని కోరగా కోర్టు ఒప్పుకోకపోవడంతో నిరాశపడ్డట్టున్నారు.

రాజకీయాలలో ఒక గొప్ప మలుపు తీసుకు వస్తాడని భావించిన కేజ్రీవాల్ పాలనలో ఏది ముట్టుకున్నా అవినీతిమయమేననే విషయం ఇటీవలే వెల్లడైంది. కోట్లాది రూపాయల విలువైన అతడి అధికారిక నివాసం 'శీష్ మహల్'ను నిర్మించేందుకు కూడా ఆయన అనేక చెట్లను నరికి, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారట.

**విదేశీ మారకద్రవ్య నిబంధనల ఉల్లంఘన**

ఆప్ పార్టీ ఫోరెక్స్ నిబంధనలను ఉల్లంఘించి రూ. 7.08 కోట్ల రూపాయలను వసూలు చేసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి) హోం మంత్రిత్వ శాఖకు తెలియచేసింది. అమెరికా, కెనెడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్, ఒమన్ సహా ఇతర దేశాలలోని అనేకమంది డోనార్ల నుంచి ఆప్ నిధులను అందుకుంది. అయితే, రాజకీయ పార్టీలకు విదేశీ విరాళాలపై ఉన్న నిబంధనలను తప్పించుకునేందుకు ఆప్ తన ఖాతా పుస్తకంలో విదేశీ డోనార్ల గుర్తింపును మరుగు పరిచిందని ఈడీ ఆరోపించింది.

విదేశీ విరాళాలకు సంబంధించిన ఈ డేటాను విశ్లేషించినప్పుడు, పలువురు దాతలు ఒకటే పాస్‌పోర్టు నంబర్‌ను, ఒకటే ఇమెయిల్ ఐడిలు, మొబైల్ నంబర్లను, అవే క్రెడిట్ కార్డు నంబర్లను వాడినట్టు తేలింది. ఈ విషయం కూడా పాకిస్తాన్ నుంచి హెరాయిన్‌ను స్మగ్లింగ్ చేస్తున్న ఒక అంతర్జాతీయ మాదక ద్రవ్య ముఠాకు వ్యతిరేకంగా పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాలో నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్నప్పుడు ఆప్ అందుకుంటున్న విదేశీ నిధులలో అవకతవకలు, ఎఫ్‌సిఆర్ఎ ఉల్లంఘనలు బయట పడ్డాయి.

ఆ సందర్భంగా, ఫజిల్కాలోని ప్రత్యేక కోర్టు నాటి భోలాత్ ఆప్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరాను నిందితుడిగా విచారణ ఎదుర్కొనవలసిందిగా సమన్లు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా, ఖైరా, అతడి సహచరులపై నిర్వహించిన సోదాలలో విదేశీ విరాళాలకు సంబంధించిన వివరాలతో కూడిన పత్రాలు బయటపడటంతో ఈడీ వాటిని స్వాధీనం చేసుకుంది. పంజాబ్‌లో 2017లో ఎన్నికలు జరగడానికి సరిగ్గా రెండేళ్లముందు అంటే 2015లో ఆప్ పార్టీ అమెరికాలో ఏర్పాటు చేసిన విదేశీ నిధుల సేకరణ ప్రచారం సందర్భంగా మొత్తం 1,19,000 డాలర్లు విదేశీ చందాలు వసూలు అయ్యాయి.

కాగా, ఆప్ పార్టీ చెక్కుల ద్వారా, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా విదేశీ విరాళాలను అందుకుంటున్న విషయాన్ని ఆప్ జాతీయ కార్యదర్శి పంకజ్ గుప్తా అంగీకరించినట్టు ఈడీ ప్రకటించినా, ఇదంతా ఈడీ, సీబీఐ, హోంమంత్రిత్వ శాఖ, ఎలక్షన్ కమిషన్ పన్నిన కుట్రంటూ ఆప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆప్ మీద బురదజల్లేందుకు బీజేపీ చేస్తున్న కుట్ర అని కూడా ఢిల్లీ మంత్రి అతీషీ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారే తప్ప అసలు విషయాలలో నిజానిజాలేమిటన్న విషయం బయటపెట్టకపోవడం గమనార్హం.

**మనీ లాండరింగ్ కేసులు**

నక్కలెరుగని బొక్కలా అన్న సామెతలా ఇండియన్ రెవిన్యూ సర్వీసెస్ అధికారి అయిన కేజ్రీవాల్‌కు చట్టంలో ఉండే లొసుగులు తెలుసు. అందుకే ఎక్కడా చిక్కకుండా వందల కోట్ల మద్య విధాన స్కాంను నడిపించేశారు. ముఖ్యమంత్రిగా టీం లీడర్ అయినప్పటికీ, ఏ ఫైలు మీదా సంతకాలు పెట్టకుండా తప్పించుకున్నాననుకున్నారు. కానీ ఎత్తుకుపై ఎత్తులు వేయగల ఈడీ అధికారులు మాత్రం చిన్నదో చితకదో ఆధారాన్ని కోర్టుకు చూపడంతో వెంటనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయవలసిందిగా కోర్టు ఆదేశించింది. ఈడీ సమన్లను తొమ్మిదిసార్లు తిరస్కరిస్తే జరిగేది ఇదే అని తెలిసినప్పటికీ, ఎన్నికల తేదీల ప్రకటనల వరకూ వాయిదా వేస్తూ వచ్చారు. ఆ సమయంలో తనను అరెస్టు చేస్తే తనకు సానుభూతి వస్తుందని ఊహించారు. అయితే, కేజ్రీవాల్ ఒక్కొక్క లీలా బయటపడుతుండడంతో పరువుపోయిందే తప్ప ఫలితం దక్కలేదు.

**చార్జిషీటులో పార్టీ పేరు కూడా!**

కేంద్ర ఏజెన్సీలు ఎక్సైజ్ విధానం కేసుకు సంబంధించి దాఖలు చేసిన ఛార్జిషీటులో అర్వింద్ కేజ్రీవాల్‌నే కాదు, ఆమ్ ఆద్మీ పార్టీని కూడా నిందితులుగా చేర్చింది. ముఖ్యమంత్రి, ఒక రాజకీయ పార్టీపై మనీ లాండరింగ్ ఆరోపణలు రావడం ఇదే తొలిసారి. ఈడీ దాఖలు చేసిన ఈ కేసుకు సంబంధించి ఎనిమిది ఛార్జిషీట్లను దాఖలు చేసి 18మందిని ఇప్పటివరకూ అరెస్టు చేసింది. అంతేకాదు, బీఆర్ఎస్ నాయకురాలు కె.కవిత, నలుగురు ఇతర నాయకులపై కూడా ఇటువంటి ఫిర్యాదునే నమోదు చేసింది.

ఢిల్లీ ఎక్సైజ్ స్కాంలో కేజ్రీవాల్ సూత్రధారి

కావడమే కాదు, కీలక కుట్రదారు అని కూడా ఏజెన్సీ చేసిన ఆరోపణలలో ఏ మాత్రం అసత్యం లేదు. గోవా ఎన్నికల సమయంలో కేజ్రీవాల్ సెవెన్ స్టార్ హోటల్‌లో ఉండటమే కాదు, ఆయన బిల్లులను సాక్షికంగా ఈ కేసులో నిందితుడు ఒకరు చెల్లించినట్టు తమ వద్ద ప్రత్యక్ష ఆధారాలున్నాయని, ప్రస్తుతం రద్దు చేసిన ఎక్సైజ్ విధానాన్ని రూపొందించడంలో అతడే కీలక పాత్ర పోషించాడనే వాదనలు సుప్రీం కోర్టులో జరిగాయి. అతడు ఢిల్లీ మంత్రులు, ఆప్ నాయకులు ఇతరులతో కలిసి పని చేశాడనే ఆరోపణలు కూడా ఏజెన్సీ చేసింది.

ఆప్ రాజకీయ పార్టీ అయినందున ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద దానిని ఒక సంస్థగా నిర్వచిస్తారని, కనుక దానిని పిఎంఎల్ఎ 70వ సెక్షన్ కింద కంపెనీగా వర్గీకరించి, విచారించవచ్చని ఈడీ అభిప్రాయపడింది. నేరం జరిగిన సమయంలో ఈ కంపెనీకి అర్వింద్ కేజ్రీవాల్ ఇన్‌చార్జి కనుక మనీలాండరింగ్ వ్యతిరేక చట్టం కింద అతడే దోషి కనుక అతడిని విచారించి, శిక్షించాలని కూడా సూచించింది.

**పులి మీద పుట్రలా స్వాతీ మాలివాల్ కేసు**

పార్టీ అధినేత కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా ఆ పార్టీకి చెందిన ఇద్దరు రాజ్యసభ ఎంపీలు – స్వాతి మాలివాల్, రాఘవ్ చద్దాలు దేశం బయట ఉండటమే కాదు, వారు ప్రకటనలు చేయడం కానీ, హడావిడిగా పరుగెత్తుకు రాకపోవడం కానీ జరుగకపోవడం చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. అంతో ఇంతో రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారు మాత్రం అక్కడ ఏవో లెక్కలు సరి చేయడానికి వెళ్లుంటారని భావించారు. కారణాలేవైనా, మొత్తానికి కేజ్రీవాల్‌కు బెయిల్ వచ్చిన తర్వాత మాత్రమే వీరిరువురూ భారత్‌లో ప్రత్యక్షమయ్యారు.

వీరిలో స్వాతి మాలివాల్ దాదాపు రెండు దశాబ్దాలుగా కేజ్రీవాల్‌తో కలిసి పని చేస్తున్న వ్యక్తి. అతడు 'అన్నా ఆందోళన'కు ముందు స్వచ్ఛంద సంస్థను నడుపుతున్న కాలం నుంచీ స్వాతి కూడా కేజ్రీవాల్‌తో కలిసి పని చేశారు. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత స్వాతిని మహిళా కమిషన్ అధ్యక్షురాలిని చేసి, అనంతరం రాజ్యసభ ఎంపీని చేశారు. ఇంత సాన్నిహిత్యం ఉన్నప్పటికీ, ఆమె కేజ్రీవాల్‌ను కలుసుకునేందుకు అతడి అధికారిక నివాసాన్ని వెడితే పిఎ బిభవ్ కుమార్ చేత కొట్టించడం, ఆ విషయాన్ని స్వయంగా మాలివాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రజలు నివ్వెరపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటి నుంచీ స్వాతి వ్యక్తిత్వ హననం ప్రారంభమైంది. ఢిల్లీ పోలీసులు ముఖ్యమంత్రి నివాసం నుంచి సిసిటివి డివిఆర్‌ను స్వాధీనం చేసుకోవడంతో స్వాతి మీద మాటల దాడులు ప్రారంభమయ్యాయి. చిత్రమైన విషయమేమిటంటే, ఘటన జరిగిన సమయంలో డిజిటల్ వీడియో రికార్డర్ బ్లాంక్‌గా ఉందని పోలీసులు ఆరోపించారు. వాస్తవానికి స్వాతిమాలివాల్‌పై జరిగిన ఘటన తీవ్రమైనదని, ప్రాణహాని కలిగించగలిగి ఉన్న కేసని తన రిమాండ్ పత్రంలో పోలీసులు పేర్కొన్నారు.

ఇందుకు తోడుగా పోలీసులు కేజ్రీవాల్ పిఎ బిభవ్ కుమార్‌ను ఈ కేసులో అరెస్టు చేయడంతో, ఆప్ బీజేపీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేసే ప్రయత్నం చేసి విఫలమైంది. బిభవ్ కుమార్ పోలీసులతో సహకరించకపోవడమే కాదు, సమాధానాలను కూడా సరిగ్గా ఇవ్వలేదని పోలీసులు ఆరోపించారు. ఒక పార్లమెంటు సభ్యురాలిపై తీవ్రమైన దాడి జరిగిన కేసు ఇదని, నిర్దిష్టమైన, సూటి ప్రశ్నలు వేసినప్పటికీ దర్యాప్తులో సహకరించేందుకు నిందితుడు ముందుకు రాలేదనివారు రిమాండ్ పత్రంలో వ్యాఖ్యానించడం గమనార్హం.

అలాగే బిభవ్ తన ఫోనును ముంబైలో ఫార్మాట్ చేయించుకున్నాడని, తన మొబైల్ పాస్‌వర్డ్‌ను చెప్పడం లేదని వారు పేర్కొన్నారు. స్వంతదారు అందుబాటులో లేకుండా అందులో యాప్‌లను కూడా ఉపయోగించలేరని, మొబైల్ డేటాను సేకరించి, వాస్తవాలను నిర్ధారించేందుకు అతడిని నిపుణుల వద్దకు తీసుకువెళ్లవలసి ఉంటుందని పోలీసులు చెప్పడం గమనార్హం. అతడిని వదిలి పెడితే, ఆధారాలను తారు మారు చేసే అవకాశం ఉందని వారంటున్నారు.


**తాజాగా అతిషీకి సమన్లు**

తాజాగా, మే 28న ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు మంత్రి, ఆప్ నాయకురాలు అయిన అతిషీకి పరువు నష్టం దావాలో సమన్లు జారీచేసింది. ఆప్ నాయకులు బీజేపీలో చేరేందుకు 20–30 కోట్ల రూపాయలను ఇవ్వచూపుతూ తమ దగ్గరకు వచ్చారన్న ఆరోపణలకు ప్రతిగా ఢిల్లీ బీజేపీ మీడియా అధిపతి ప్రవీణ్ శంకర్ వేసిన పరువు నష్టం కేసులో ఆమె జూన్ 29న కోర్టులో హాజరుకావలసిందిగా పేర్కొంది. తమ శాసనసభ్యులను వలవేసి పట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తునదని, అందుకు లంచం కూడా ఇవ్వచూపిందన్న ఆరోపణలకు సంబంధించిన కేసు ఇది.

ఈ ఆరోపణలు తన పార్టీ ప్రతిష్ఠను, తన ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయంటూ వేసిన కేసుకు స్పందిస్తూ, అతిషీని దోషిగా గుర్తించి సమన్లు జారీ చేసింది. కేవలం ఆమే కాకుండా, ఒక్కొక్కరికీ 25 కోట్లు ఇస్తామంటూ బీజేపీ ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే ప్రయత్నం చేసిందంటూ ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌ను కూడా పేర్కొన్నారు.

**రాజ్యాంగం చదవాలి**

ఆప్ సహా ప్రతిపక్షాలు అన్నీ కూడా ప్రధాని మోదీ ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందన్న ఆరోపణలను తోసిపుచ్చుతూ, ఈ ఆరోపణలు చేస్తున్నవారంతా దేశ రాజ్యాంగాన్ని, చట్టాన్ని సరిగ్గా చదవడం మంచిదంటూ సూచించారు. ఎవరు జైలుకు వెడతారన్న విషయాన్ని ప్రధాని మోదీనే నిర్ణయిస్తారంటూ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలకు స్పందిస్తూ, వారు రాజ్యాంగాన్ని, చట్టాన్ని సరిగ్గా చదివితే తాను ఎవరికీ ఏమీ చెప్పాల్సిన అవసరం ఉండదు అంటూ మోదీ ఒక ఇంటర్వ్యూలో స్పందించారు. కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన తర్వాత, తన ప్రచారంలో భాగంగా ఆయన బీజేపీపై, ప్రధాని మోదీపై తీవ్రంగా ధ్వజమెత్తారు ★





# ప్రభుత్వం మారినా పోక

**ప్రభుత్వం మారినా ఆలోచనలు మారలేదు. సర్కారు బదలాయింపు జరిగినా చేతల్లో మార్పులు కనిపించడం లేదు. ప్రభుత్వాలు ఫక్తు వ్యాపార సంస్థలుగా వ్యవహరించే పరిస్థితులు వచ్చాయి. గత ప్రభుత్వాలు చేశాయి కదా.. అదే కొనసాగిద్దాం.. అన్న ధోరణి స్పష్టంగా గోచరిస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తీరు గత సర్కారు హయాం స్మరణకు వస్తోంది.**

తెలంగాణలో సర్కారు భూముల అమ్మకాల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎన్నికల సమయంలో రూపొందించిన మేనిఫెస్టోల్లో అంశాలు, బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే సంపదను సమకూర్చుకోవడం తప్పనిసరిగా మారిపోయింది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలతో మేనిఫెస్టో రూపొందించింది. వాటన్నిటిని హామీలు అమలు చేయాలంటే నిధుల సమీకరణ తప్పనిసరి. అందుకే వేలం వేయడానికి అనువైన ప్రభుత్వ భూములను గుర్తించే పనిలో ప్రభుత్వం పడింది. ఈ క్రమంలోనే పలు ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములు ఉన్నట్లు, వాటికి డిమాండ్ ఉన్నట్లు గుర్తించింది. ముఖ్యంగా హైదరాబాద్ అవుటర్ రింగ్‌రోడ్డు లోపల ప్రభుత్వ భూములు దాదాపుగా లేవని, ఓఆర్ఆర్ నుంచి ఆర్.ఆర్.ఆర్. మధ్య ఉన్న భూములపై దృష్టి సారించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను వేలం వేయడం ద్వారా 14వేల కోట్ల రూపాయలు సేకరించింది.

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూములు వేలం వేసేందుకు అదే తీరులో కసరత్తు చేస్తోంది. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే .. నిధుల సమీకరణకు భూములు విక్రయించడమే సులభమైన మార్గమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయానికి వచ్చేశారు. హైదరాబాద్ శివారు జిల్లాలతో పాటు ఎక్కువ ఆదాయం వచ్చేందుకు అవకాశమున్న జిల్లాల్లో విక్రయించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. భూముల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో పాటు లేఅవుట్లు డెవలప్ చేస్తే వచ్చే ఆదాయాలపై ప్రభుత్వం ఇప్పటికే అంచనాలు వేసింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో లేఅవుట్లను అభివృద్ధి చేసి ప్లాట్లను విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. భూములు, ప్లాట్ల విక్రయాల్లో జిల్లాల్లోని రెవెన్యూ, ఇతర విభాగాలకు పూర్తిస్థాయిలో సామర్థ్యం లేకపోవడంతో హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ సంస్థల సేవలను వినియోగించుకోనుంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా అమ్మకానికి వీలున్న భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ పరిధిలో ఉన్న భూములపై ఫోకస్ పెట్టాలని నిర్ణయించారు.

భూముల విక్రయం ద్వారా కోట్ల రూపాయలు గడించి.. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకు బీఆర్ఎస్ సర్కార్ అమలు చేసిన వ్యూహాన్నే ప్రస్తుతం రేవంత్ సర్కార్ అనుసరిస్తోంది. ఆరు గ్యారెంటీల అమలును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రేవంత్‌రెడ్డి, అందుకు అవసరమైన ఆర్థిక వనరులపై దృష్టి సారించారు. గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో.. అందుకు అనుగుణంగా నిధుల కొరత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలకు ఆటంకాలు లేకుండా ఉండేలా ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం సిద్ధమవుతోంది. రైతుల పంట రుణమాఫీ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరమవుతాయని భావిస్తున్న సీఎం, అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడం కంటే భూములను విక్రయిస్తే సులభంగా ఉంటుందని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగానే భూముల విక్రయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఔటర్ రింగ్ రోడ్ – రీజనల్ రింగ్‌రోడ్‌కు మధ్య ఉన్న ప్రభుత్వ భూములు, వాటితో పాటు భూ సమీకరణలో భాగంగా రైతులు ముందుకొస్తే ఆయా భూములను కూడా అభివృద్ధి చేసి ఆదాయం సమకూర్చుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. అటు అభివృద్ధి– ఇటు ఆదాయం.. ఉభయతారకంగా ముందుకెళ్లాలని భావిస్తోంది. ఓర్‌ఆర్‌ఆర్– ఆర్‌ఆర్‌ఆర్ మధ్య కూడా భారీగానే ప్రభుత్వ భూములు ఉన్నాయి. అక్కడ అభివృద్ధి ప్రణాళిక ఎలా ఉండాలన్న దానిపైనా ప్రభుత్వం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఇక హైదరాబాద్ శివారు మహేశ్వరంలోని ఫార్మాసిటీ భూముల గురించి కూడా సర్కారు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఫార్మాసిటీని 19,300 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించగా, అందులో ప్రభుత్వానిదే 9,133 ఎకరాల భూములు ఉన్నాయి. దానికితోడు రైతుల నుంచి నాలుగువేల ఎకరాలు సేకరించారు. ఈ భూముల్లో గత ప్రభుత్వ హయాంలోనే రోడ్లు, నీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలనూ కొంతమేరకు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక..

సుజాత గోపగోని, 6302164068



# డలు అవే...!!


ఆ భూముల్లో ఫార్మాసిటీ కాకుండా టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని, అలాగే కాలుష్య రహిత పరిశ్రమలను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో ఫార్మాసిటీ భూములకు సంబంధించి ప్రభుత్వం భారీ ప్రణాళికనే రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ క్రమంలోనే ఫార్మాసిటీ భూముల్లో మల్టీ మోడల్ ఇండస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు. ఫార్మాసిటీ క్లస్టర్లను నగరానికి దూరంగా వేర్వేరు చోట్ల అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో రంగారెడ్డి జిల్లా కందుకూరు, కడ్తాల్, యాచారం మండలాల్లో సేకరించిన భూములు ప్రభుత్వానికి అందుబాటులోకి రానున్నాయి. వాటిలో నివాస టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయడం కోసం కొంత భూమిని వేలం వేయడం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడం లాంటి అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అలాగే కొంతమేర వివిధ రంగాలకు చెందిన భూమిని పరిశ్రమలకు కేటాయించే అవకాశముంది. కొంత భూమిని హెల్త్ సిటీ కోసం.. అంటే ప్రైవేటు ఆస్పత్రులకు కూడా భూ కేటాయింపు చేసే అవకాశాలు ఉన్నాయి. అక్కడ జరిగే అభివృద్ధిలో ఉద్యోగాల కల్పన కూడా ఉండాలని.. అలా ఉంటేనే నివాస సముదాయాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఫార్మా సిటీ భూముల్లో హెల్త్‌సిటీ, పారిశ్రామిక సంస్థలు.. అదేవిధంగా కొంత మేర కాలుష్య రహిత ఫార్మా కంపెనీలకు కూడా భూములు కేటాయించే అవకాశాలు న్నాయి. ఈ భూములపై కూడా ప్రభుత్వానికి భారీగా నికర ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఒక్క హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 7 జిల్లాల్లోనే 8,260 ఎకరాలు ఉంది. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 7,452 ఎకరాలు, హైదరాబాద్ జిల్లాలో 299 ఎకరాలు, మెదక్ పరిధిలో 558 ఎకరాల భూమిని హెచ్ఎండీఏకి కేటాయించారు. ఇందులో సుమారు 3,886 ఎకరాల వరకు ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించారు. ఇంకా సుమారు 4,374 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు హెచ్ఎండీఏ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోనే అత్యధికంగా 3,899 ఎకరాలుండగా, హైదరాబాద్ పరిధిలో 37 ఎకరాలు, మెదక్ పరిధిలో 437 ఎకరాలుంది. అయితే ఇవన్నీ పాత లెక్కలే. బీఆర్ఎస్ హయాంలో వీటిలో కొన్ని భూములను పలు అవసరాల కోసం కేటా యించారు. మరికొన్నింటిని వేలం వేశారు. 3వేల ఎకరాలకు పైగా న్యాయ వివాదాల్లో ఉన్నాయి. వీటి పరిష్కారంపైనా సర్కారు దృష్టిపెట్టింది. ఇక ఇప్పటికిప్పుడు ఏ ఇబ్బందులూ లేకుండా ఉన్న భూముల వివరాల నివేదికను రూపొందించాలని సర్కారు నిర్ణయించింది.

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూముల వేలం ద్వారా సుమారు 14 వేల కోట్ల వరకు సమకూర్చుకున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో హెచ్ఎండీఏ పరిధిలోని కోకాపేటలో 49 ఎకరాలను వేలం ద్వారా విక్రయించగా రూ. 2000 కోట్లు సమకూరాయి. ఇదే తరహాలో అందుబాటులోని భూములను వేలం ద్వారా విక్రయించి సంక్షేమ పథకాల అమలుకు ఖర్చు చేయాలనే యోచనలో రేవంత్ సర్కారు ఉంది. కోకాపేట సమీపంలోని నియోపొలిస్‌లో వేలం ద్వారా ఒక్కో ఎకరం రూ. 59- 100 కోట్లు పలికాయి. ఇంకా అక్కడ విలువైన భూమి కొంత ఉంది. చుట్టూ భారీ ఆవాసాలు, ఆకాశహర్మ్యాలు, ఐటీ టవర్లు ఉన్న ఈ ప్రాంతంలో ఉన్న వాణిజ్య భూమికి మంచి ధర వస్తుందని సర్కారు అంచనా వేస్తోంది. ఇటు బుద్వేల్‌లో కూడా గత ప్రభుత్వం ఎన్నికలకు కొద్ది నెలల ముందే కొన్ని భూములను వేలం వేసింది. ఎకరా 20-30 కోట్ల వరకు పలికింది. అక్కడ కూడా ఇంకా ఖరీదైన ప్రభుత్వ భూములున్నాయి.

ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ముందు జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న భూముల వివరాలను సేకరిస్తోంది. అత్యంత ప్రాధాన్య కార్యక్రమంగా దీన్ని తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిశాక విడతల వారీగా భూముల వేలం ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలుస్తోంది. హెచ్ఎండీఏతోపాటు రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలపై సమగ్ర నివేదిక రూపొం దించాలని, కోర్టు వివాదాల్లో లేని భూములను వేలం వేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ★





# ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యాతో

రష్యాలోని ఆర్కిటిక్ ప్రాంతంలో నేటివరకూ తవ్వితీయని చమురు, సహజ వాయువు నిల్వలే కాదు కీలకమైన, ఉద్భవిస్తున్న ఎఐ, విద్యుత్ వాహనాలు, సెమీ కండక్టర్ల పరిశ్రమలలో ఉపయోగించగల రేర్ ఎర్త్ మినరల్స్ కూడా ఉన్నాయి. ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఆర్కిటిక్ సముద్రం బహిర్గతం కావడం అన్నది భారత్‌కు ఒక వరమనే చెప్పాలి. ఇది భారత్‌కు దీర్ఘకాలిక నిలకడైన ఇంధన సరఫరానే కాదు కీలక ఖనిజాలను కూడా సరఫరా లభ్యతకు కూడా అవకాశాన్ని కల్పిస్తోంది.

**భారత శాస్త్రవేత్తలకు రష్యా ఆహ్వానం**

ప్రస్తుతం ఆర్కిటిక్ (ఉత్తర ధ్రువంలో) బలమైన పరిశోధనా ప్రాజెక్టును రష్యా నిర్వహిస్తోందని రష్యా ఆర్కిటిక్, అంటార్కిటిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎఎఆర్ఐ) డైరెక్టర్ అలెగ్జాండర్ మకరోవ్ గోవాలోని వాస్కోడ గామా నగరానికి వచ్చిన సందర్భంలో మీడియాకు వెల్లడించారు. తమ శాస్త్రవేత్తలు ఎత్తైన అక్షాంశాలలో శాస్త్రీయ పరిశోధనలను నిర్వహించేందుకు అత్యాధునిక పరికరాలు, సాంకేతికత కలిగిన, మంచును తట్టుకోగల ప్రత్యేకమైన ఓడ మద్దతుతో పని చేస్తున్నారని, ఈ పరిశోధనలో తమ భారతీయ సహచరులను కూడా కలవవలసిందిగా కోరామని, వారు ఎంతో ఆసక్తితో ఉన్నారని ఆయన వెల్లడించడం విశేషం. ఎందుకంటే, రష్యా కేవలం ఆయుధాల విషయంలోనే కాక ఇతర రంగాలలో కూడా భారత్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉందనే విషయం దీనితో మరొక్కసారి స్పష్టమయింది.

భారత్‌కు చెందిన సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషానిక్ రీసెర్చ్ అధికారులతో తాము చర్చలలో ఉన్నామని, వారు ఈ ప్రాజెక్టుల పట్ల ఆసక్తి ప్రదర్శించారని అన్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించేందుకు రష్యా ఆసక్తితో ఉన్న విషయాన్ని భారత్‌కు చెందిన శాస్త్రవేత్తలు కూడా వెల్లడిస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో ఎనిమిది మంది సభ్య దేశాలు కలిగిన ఆర్కిటిక్ కౌన్సిల్ కార్యకలాపాలలో స్తబ్ధత రావడం వల్ల కూడా రష్యా మిత్రుల కోసం వెతుకుతోందన్నది వాస్తవం. పశ్చిమ ఆసియాలోలా కాకుండా ఆర్కిటిక్ ఇంధన వనరులు, వాటి సరఫరా ఎటువంటి రాజకీయ అస్థిరతలతో ప్రభావితం అయ్యే అవకాశం లేదు. అయితే, ఆర్కిటిక్ అనేది భారత్‌కు నిలకడైన ఇంధన సరఫరా మార్గంగా ఉండగలదని, ఈ క్రమంలో దీర్ఘకాలిక ఒప్పందాలకు కూడా అవకాశ ముందని శాస్త్రవేత్తలు చెప్తున్న మాట.

**వైవిధ్య వాణిజ్య సంబంధాలకు ఆస్కారం**

ఉత్తర ధ్రువ ప్రాంతంతో సరిహద్దుగల లేదా ఎనిమిది దేశాలు సభ్యులుగాగల ఆర్కిటిక్ కౌన్సిల్‌లో రష్యాకే అతిపెద్ద ప్రత్యేక ఎకనామిక్ జోన్ (ఇఇజెడ్) ఉంది. హైడ్రోకార్బన్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, అనుసంధానత, టింబర్, మైనింగ్ వంటి కార్యకలాపాలు ఆర్కిటిక్ ప్రాంతంలో భారత్–రష్యాల మధ్య భవిష్యత్ సహకారాన్ని మలచగలవు.

భారత్, రష్యా సంబంధాలలో రక్షణరంగానికి సంబంధించిన వాణిజ్యానికే ప్రాధాన్యత ఉన్నందున, ఇరు దేశాలూ తమ మధ్య వాణిజ్య సంబంధాలను వైవిధ్య పరచుకోవాలని థింక్ ట్యాంక్ మేధావులు చెబుతున్నారు. భారత్, రష్యా సంబంధాలను వైవిధ్య పరచుకునేందుకు ఉన్న ఒక మార్గం ఆర్కిటిక్ ప్రాంతమేనని నిపుణులు చెబుతున్న మాట.

ఇటీవలే, మే 22–24వరకు పెట్రోజవోడ్స్క్‌లో 'ది ఆర్కిటిక్ అండ్ అవర్ గ్లోబల్ నైబర్‌హుడ్' అన్న ఇతివృత్తంతో రష్యా అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. దీనిని రష్యాకు చెందిన థింక్ ట్యాంక్ ఇంటర్‌రీజినల్ సైంటిఫిక్ ఫోరం (ఐఎస్ఎఫ్) నిర్వహించింది. అయితే ఇందులో వివిధ దేశాలకు చెందిన నిపుణులు, థింక్ ట్యాంక్‌ల సభ్యులు కూడా పాలుపంచుకున్నారు.

భారత్ మార్చి 2022లో 'ఆర్కిటిక్ విధానాన్ని' ఆవిష్కరించినప్పటి నుంచీ ఈ ధ్రువ ప్రాంతంలో తన కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. ఈ విధానం ఆరు స్తంభాలపై నిలిచింది. అవి – శాస్త్రీయ పరిశోధనను, సహకారాన్ని బలోపేతం చేయడం, పర్యావరణ, వాతావరణ పరిరక్షణ, ఆర్థిక, మానవ అభివృద్ధి, రవాణా– అనుసంధానత, పాలన, అంతర్జాతీయ సహకారం, జాతీయ సామర్థ్య నిర్మాణం.

**ఆర్కిటిక్‌లో భారత్- రష్యా ప్రాజెక్టులు**

రష్యా ఆర్కిటిక్ ప్రాంతంలోని తేమైర్‌లోని వాంకోర్‌లో, యకుతియాలోని తాస్– యుర్యాక్స్ క్షేత్రాలను అభివృద్ధి చేయడంలో ఇరు దేశాలు నిమగ్నమై ఉన్నాయని ఒక అంతరరాష్ట్రీయ శాస్త్రీయ ఫోరం విడుదల చేసిన వ్యాసం పేర్కొనడం గమనార్హం. వ్లాడివోస్టోక్‌లోని రష్యన్ మారిటైమ్ శిక్షణా సంస్థలో భారతీయ నావికులు ఆర్కిటిక్ జలాలలో ప్రయాణించేందుకు శిక్షణ ఇచ్చేందుకు రష్యా అంగీకరించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో భారతీయ రేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ రష్యాలో పర్యటించినప్పుడు ఈ అంగీకారానికి వచ్చారు.

ముఖ్యంగా, రష్యాలోని ఇఇజెడ్ గుండా వెళ్లే నార్తర్న్ సీ రూట్ (ఎన్ఎస్ఆర్)ను రష్యాతో కలిసి

భారత్‌–రష్యాల మధ్య అనుబంధం నేటిది కాదు. అయితే, ఈ సంబంధాలు కేవలం రక్షణ పరికరాల మేరకు మాత్రమే ఉండేవి. అయితే ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రస్తుత ప్రభుత్వం ఆ పరిధిని దాటి, చమురు కొనుగోలు సహా ఆర్కిటిక్‌ ప్రాంతం, అంతరిక్ష రంగంలో సహకారానికి ఈ సంబంధాలను విస్తరింప చేస్తోంది. ఆర్కిటిక్‌ ప్రాంతంలో ఉమ్మడి ప్రాజెక్టు ఏర్పాటు కోసం భారత్‌ ఇప్పటికే రష్యాతో చర్చలు ప్రారంభించింది. ఈ అంశం ఇంత ప్రాధాన్యతను సంతరించుకోవడానికి కారణం, దీనిని అంతర్జాతీయ అంతరిక్షణ కేంద్రం (ఇంటర్నేషనల్‌ స్పేస్‌ స్టేషన్‌ –ఐఎస్‌ఎస్‌)తో పోల్చదగినంత ప్రాధాన్యం ఉండటమే!

# కీలక సహకారం

జాగృతి డెస్క్‌

ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు న్యూఢిల్లీ తీవ్ర ఆసక్తిని ప్రదర్శించింది. ఈ ధ్రువ మార్గం ఇండో–పసిఫిక్‌ ద్వారా వెళ్లే భిన్నమైన మార్గాన్ని భారత్‌– ఐరోపాల మధ్య ఇది తెరవగలదనే తీవ్ర అభిప్రాయం నేడు ఉందని గత ఫిబ్రవరిలో జరిగిన విదేశీ విధాన సదస్సులో భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌ చెప్పడం విశేషం.

**ఆర్కిటిక్‌లో పరిశోధనలు భారత్‌కు కొత్త కాదు**

కేవలం రష్యాతోనే కాకుండా ఆర్కిటిక్‌ ప్రాంతంలో ప్రస్తుత ఆర్కిటిక్‌ కౌన్సిల్‌ అధ్యక్షతన నిర్వహిస్తున్న నార్వేతో కూడా భారత్‌ ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, న్యూఢిల్లీ 2008లోనే నార్వేలో 'హిమాద్రి' అన్న పేరుతో తొలి పోలార్‌ రీసెర్చ్‌ స్టేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలోనే నార్వేజియన్‌ విదేశాంగ మంత్రి, ఆర్కిటిక్‌ కౌన్సిల్‌లో సహకారంతో యుక్రైన్‌ సమస్యను 'కంపార్ట్‌మెంటలైజ్‌' చేసి చూడాలంటూ, ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరిగిన రైజినా డైలాగ్స్‌లో పేర్కొనడాన్ని భారత దేశ నిపుణులు ఆహ్వానించారు. 'ఈ అంశాలలో కొన్నింటిని మనం విభజించి చూసేందుకు ప్రయత్నించాలి. ఈ విషయంలో మనం ఇప్పటివరకూ విజయాన్ని సాధించామని భావిస్తున్నాను. ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో కూడా రష్యాతో మేం నిలకడైన మత్స్య సహకారాన్ని కొనసాగించాం. ఆ చేపల నిల్వలను నిలకడగా ఉంచేందుకు ఈ మత్స్య సహకారం ఇప్పటికీ మా మధ్య ఉన్నది. ఈ సమస్యలను నిర్వహించడంలో ఆర్కిటిక్‌ కౌన్సిల్‌ సమర్ధవంతంగా ఉండాలి' అని క్రావిక్‌ పేర్కొన్నారు. అంతర్జాతీయ దౌత్యంలో పూర్తి శత్రువులు, మిత్రులు ఉండరనే విషయం దీనితోనే స్పష్టమవుతుంది.

ఆర్కిటిక్‌ ప్రాంతంలో పర్యావరణ మార్పు వంటి అంశాలు మానవాళికి అంతటినీ ప్రభావితం చేసేవి. 'ఆర్కిటిక్‌ కౌన్సిల్‌ పని చేయకపోవడం దురదృష్టకరం. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కూడా ఆర్కిటిక్‌పై సహకారం ఎప్పుడూ నిలిచిపోలేదు. పరిశీలక దేశంగా భారత్‌ ఆర్కిటిక్‌ కౌన్సిల్‌ తిరిగి పని చేయడం ప్రారంభించాలని కోరుకోగలదు అంతే' అంటూ ఒక నిపుణుడు పేర్కొనడం ఈ మండలి ప్రాధాన్యతను పట్టి చూపుతుంది.

**ఆర్కిటిక్‌ కౌన్సిల్‌కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్‌ ?**

ఆర్కిటిక్‌ కౌన్సిల్‌లో సుదీర్ఘ ప్రతిష్టంభన వస్తే, అక్కడ శాస్త్రీయ, అన్వేషక ప్రాజెక్టులను నిర్వహించేందుకు రష్యా మరొక విధానాన్ని అనుసరించే అవకాశం ఉంది. బ్రిక్స్‌ ఆ వేదిక కావచ్చు. ఈ ఏడాది రష్యాలో జరుగనున్న బ్రిక్స్‌ వార్షిక సదస్సులో ఈ మేరకు ప్రకటన కూడా వెలువడవచ్చని భారతీయ నిపుణులు అంటున్నారు.

**ఇప్పటికే రంగంలో చైనా**

ఇటీవలి సంవత్సరాలలో ఆర్కిటిక్‌లో శాస్త్రీయ, ఇంధన ప్రాజెక్టులను నిర్వహించేందుకు రష్యాకు చైనా



సన్నిహిత భాగస్వామిగా అవతరించింది. బీజింగ్‌ 2018లో తన ఆర్కిటిక్‌ విధానాన్ని ప్రకటించినప్పటి నుంచీ ధ్రువ ప్రాంతంలో తన ఉనికిని, వాటాను పెంచుకుంటూ పోతున్నది. అయితే, రష్యా పూర్తిగా చైనాపై ఆధారపడదలచుకోలేదనే విషయం భారత్‌ సహకారం కోరినప్పుడే అర్థమవుతుంది.

ఇప్పటికే ఇరు దేశాలకు సంబంధించిన నిపుణులు ఆర్కిటిక్‌లో భవిష్యత్తు అన్వేషణలను ఖరారు చేసేందుకు ఒక రోడ్‌ మ్యాప్‌ను తయారు చేయడం కోసం క్రమం తప్పకుండా సమావేశమవుతున్నారు. ఐఎస్‌ఎస్‌ లేదా హెడ్రాన్‌ కొలైడర్‌ వంటి భారీ ప్రాజెక్టులను పరిశీలిస్తే అవి అంతర్జాతీయమైనవనే విషయం అవగతమవుతుందని 'ఆరి' డైరెక్టర్‌ మకరోవ్‌ పేర్కొనడం ద్వారా ఈ ప్రాజెక్టులు పరిమాణాన్ని చెప్పకనే చెప్పారు. భారత్‌ నుంచి సహచరుల భాగస్వామ్యం ద్వారా ఆర్కిటిక్‌ లో కూడా అటువంటి అనుభవాన్నే అమలులోకి తేవచ్చని ఆయన అభిప్రాయ పడ్డారు.

**ఆర్కిటిక్‌పై భారత్‌కు ఎందుకు ఆసక్తి?**

ఇప్పటికే, భారత్‌, రష్యాలు అంటార్కిటికాలో సహకరించుకుంటున్నాయి, ఇటువంటి ఏర్పాటే ఆర్కిటిక్‌లో జరిగితే బాగుంటుందన్నది రష్యా శాస్త్రవేత్తల అభిప్రాయం. దశాబ్దాలపాటు ఆర్కిటిక్‌లోని భిన్న కోణాలను అధ్యయనం చేసిన భారతీయ శాస్త్రవేత్తలకు రష్యా సహకారం లభిస్తే ఆ ప్రాంత రహస్యాలను కనుగొనేందుకు అవకాశం ఉంటుంది.

ఆర్కిటిక్‌ ప్రాంతంపై భారతీయ శాస్త్రవేత్తల ఆసక్తి ఇటీవలి కాలంలో చాలా పెరిగింది. ఇందుకు కారణం ఎత్తైన అక్షాంశాలలో వాతావరణ మార్పు అనేది మొత్తం భూగోళాన్ని ప్రభావితం చేయడమే అని రష్యా శాస్త్రవేత్తలు అంటున్నారు. ఆర్కిటిక్‌లో వాతావరణ వ్యాప్తి, ప్రసరణలో మార్పులనేవి భారత్‌లో రుతుపవనాల వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఇది వ్యవసాయంపై గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఇప్పటికే భారత పౌరుల జీవితాలను ప్రభావితం చేస్తున్న రుతువుల రాకపోకల్లో మార్పులు, రుతుపవనాల తీవ్రత, హీట్‌వేవ్‌లు అవతరించడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు.

రష్యా కూడా ఆర్కిటిక్‌ ప్రాంతంలో భారత్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని కోరుకుంటోంది. సహజవాతావరణాన్ని నిరంతరం అధ్యయనం చేస్తుండటమే కాదు, చోటు చేసుకుంటున్న మార్పులను వెంటనే అధ్యయనం చేస్తుండాలని శాస్త్రవేత్తలు అంటున్నారు. నూతన శాస్త్రీయ విజ్ఞానం మన భవిష్యత్‌ పర్యావరణ మార్పులను తగిన సమయంలో అనుసరించేందుకు తోడ్పడి జరుగబోయే విధ్వంసాన్ని తగ్గిస్తుంది. ఇది ప్రపంచంలోని అందరు శాస్త్రవేత్తలకూ, ముఖ్యం ఉపయోగకరమన్నది రష్యన్‌ శాస్త్రవేత్తలు చెప్తున్న మాట. ★

# మమత బుజ్జగింపు..

*ఇండీ కూటమి వస్తే దేశంలో హిందువులను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేస్తారంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యకు విపక్షాలు మండిపడ్డాయి. కానీ వాస్తవం అది కాదు అని చెప్పడానికి అవకాశాలు లేవు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ మార్కు రాజకీయం, రిజర్వేషన్‌లు ఇదే చెబుతున్నాయి. అంటే మోదీ చెప్పినట్టు ఇండీ కూటమి మాత్రమే కాదు, దానితో అంటీముట్టనట్టు ఉంటున్న ఇతర భాగస్వాములు కూడా హిందువులకు అదే గతి పట్టిస్తారు. కొత్త రిజర్వేషన్‌లలో హిందూధర్మంలోని ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీలు వెనక్కి పోయి, ముస్లింలు ముందుకు వస్తున్నారు. కానీ ఇది రాజ్యాంగం అంగీకరించదు. అయినా మూర్ఖంగానే విపక్షాలు బుజ్జగింపునే పట్టుకు వేలాడుతున్నాయి. బెంగాల్ ఓబీసీ వ్యవహారమే ఇందుకు గొప్ప ఉదాహరణ.*

రాజ్యాంగం అంగీకరించదు కాబట్టి బెంగాల్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన ఓబీసీ సౌకర్యాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు కొట్టి వేసింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు చెంపపెట్టులాంటి తీర్పు ఇది. ఇలాంటి తీర్పులే దేశమంతటా వచ్చినా విపక్షాలు ముస్లింలను మోసగిస్తూనే ఉన్నాయి. ముస్లిం వర్గాలు కూడా గుడ్డిగా వారినే విశ్వసిస్తున్నాయి. ఆ క్రమం ఏమిటో చూద్దాం. పశ్చిమ బెంగాల్‌లో 77 ఉప కులాలకు కల్పించిన వెసులుబాటు చట్ట విరుద్ధం అని ప్రకటించింది కలకత్తా హైకోర్టు. దాదాపు 5 లక్షల ఓబీసీ సర్టిఫికెట్లన్నీ రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ముస్లింలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేయడం ద్వారా మమతా బెనర్జీ సంతుష్టీకరణ విధానాలను ఎండగట్టింది న్యాయస్థానం. దేశ వ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్, ఇండీ కూటమి పక్షాలకు కూడా ఇదొక హెచ్చరిక. మీరు ముస్లింలను రాజకీయ పరికరాలుగా ఉపయోగించుకుంటున్నారు అని సాక్షాత్తు కోర్టు అభిశంసించింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 3వీ మోడల్‌ను అనుసరిస్తున్నారు. అవే వికాస్ (అభివృద్ధి), విశ్వాస్ (నమ్మకం), వ్యాపార్ (వ్యాపారం). మమతా బెనర్జీ మాత్రం 3టీ విధానాన్ని పాటిస్తారు. అవే తానాషాహి (నియంతృత్వం), టోలాబాజీ (డబ్బులు గుంజడం), తుష్టీకరణ్ (సంతుష్టీకరణ). కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా ఇటీవల బెంగాల్‌లో ఎన్నికల ప్రచార సభలో ఈ వ్యాఖ్యలు చేశారు.

మన దేశంలో సంతుష్టీకరణ రాజకీయాలు చేసే నాయకులకు బహుమతులు ఇస్తే మొదటి స్థానం కచ్చితంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకే ఇవ్వక తప్పదు. ఇతర పార్టీలు ఓట్ల కోసం మైనారిటీలను దువ్వినా, బహిరంగంగా అంగీకరించేందుకు ఇష్టపడరు. గుట్టుగానే వారి సంబంధాలు కొనసాగిస్తారు. కానీ మమత దీదీ మాత్రం అంతా బహిరంగమే. కొద్ది సంవత్సరాల క్రితం 'శ్రీరామ నవమి ఉత్సవాలను జరగనివ్వను.. మొహర్రం రోజున దుర్గాపూజ చేయడానికి వీలులేదు.. దీనిని ముస్లిం సంతుష్టీకరణ అని మీరు అనుకుంటే నా జీవితమంతా ఇదే విధానాన్ని అనుసరిస్తా..' అన్నారు మమతా బెనర్జీ. భౌగోళికంగా పశ్చిమ బెంగాల్ చాలా సమస్యాత్మక ప్రాంతం. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో పశ్చిమ బెంగాల్‌లోకి చొరబాట్లు కొనసాగుతుంటాయి. గతంలో రాష్ట్రాన్ని పాలించిన వామపక్షాలు తమ ఓటు బ్యాంకు కోసం చొరబాట్లను ప్రోత్సహించాయి. ఈ విధానాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లి అందులో ఛాంపియన్‌గా నిలిచారు మమతా బెనర్జీ.



**దొడ్డి దారిలో రిజర్వేషన్లు**

బెంగాల్‌లో ముస్లింలను మరింత ప్రసన్నం చేసుకోవాలని వారికి ఎలాగైనా రిజర్వేషన్లు కల్పించాలని గతంలో అధికారంలో ఉన్న బుద్ధదేవ్ భట్టాచార్య నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం నిర్ణయించింది. మత ప్రాతిపదిక రిజర్వేషన్లు ఇవ్వడానికి రాజ్యాంగపరమైన చిక్కులు వస్తాయని భావించి వారిని దొడ్డి దారిన ఓబీసీ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. రిటైర్డ్ ఐపీఎస్ ఉపేన్ బిస్వాస్ సారథ్యంలో బీసీ కమిషన్‌ను నియమించారు. ఆ సమయంలో రాష్ట్రంలో కమ్యూనిస్టు ప్రభుత్వంపై వ్యతిరేకత పతాక స్థాయిలో చేరింది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలు ముంచుకు వస్తున్నాయి. దీంతో 2010లో కమిషన్ నివేదిక రాకముందే మధ్యంతర నివేదిక ఆధారంగా కమ్యూనిస్టు ప్రభుత్వం 77 ముస్లిం వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చింది. వారికి సర్టిఫికెట్లు జారీ చేసింది. కొద్ది కాలానికే ఎన్నికల్లో వామపక్ష ప్రభుత్వం ఓడిపోయి, మమతా బెనర్జీ నేతృత్వంలో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధించి అధికారం చేపట్టింది. 2011 సంవత్సరంలో అధికారంలోకి రాగానే ఓబీసీ రిజర్వేషన్ల అంశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లింది మమతా బెనర్జీ. బీసీ కమిషన్ సమగ్ర నివేదిక రాకముందే ఓబీసీ జాబితాను ఆమోదించి 2012లో చట్టంగా మార్చింది. మరో 37 వర్గాలను ఓబీసీలుగా గుర్తించింది. అంటే మొత్తం 114 వర్గాలకు ఓబీసీ కోటా రిజర్వేషన్లు చేరుకున్నాయి. మొత్తం ఓబీసీ రిజర్వేషన్ల శాతం 7 నుంచి 17 శాతానికి చేరింది. ఈ సర్టిఫికెట్లు అడ్డం పెట్టుకొని లక్షలాది మంది విద్య, ఉద్యోగ అవకాశాలను పొందారు. దీన్ని సవాలు చేస్తూ కొందరు న్యాయస్థానం తలుపులు తట్టారు.

**కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు**

లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు బాంబులా పేలింది. పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం ఉప కులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ జస్టిస్ తపబ్రత చక్రవర్తి, జస్టిస్ రాజశేఖర్ మంథా నేతృత్వంలోని కలకత్తా హైకోర్టు ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. 2010 తరువాత ప్రభుత్వ ఉద్యోగాలు, సర్వీసుల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు 77 ముస్లిం ఉప కులాలను ఓబీసీలుగా గుర్తిస్తూ తీసుకొచ్చిన ఉత్తర్వులు చట్ట విరుద్ధమని పేర్కొంది.

2012లో చేసిన చట్టం కింద కొన్ని కులాలకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కులాలను ఓబీసీలుగా ప్రకటించడానికి మతాన్ని ఏకైక

క్రాంతి

# కోర్టుల యావగింపు...



ప్రామాణికంగా పరిగణించారని వ్యాఖ్యానించింది. 77 తరగతుల ముస్లింలను వెనుకబడిన వర్గాలుగా ఎంపికచేయడం మొత్తం ముస్లిం సమాజాన్ని అవమానించడమేనని స్పష్టం చేసింది. 'ఈ సమాజాన్ని (ముస్లింలు) రాజకీయ ప్రయోజనాల కోసం ఒక వస్తువుగా పరిగణిస్తున్నారు' అంటూ ధర్మాసనం చాలా ఘాటు వ్యాఖ్యలు చేసింది.

2011లో టీఎంసీ అధికారంలోకి రాగానే బీసీ కమిషన్ సమగ్ర నివేదిక రాకముందే ఓబీసీ జాబితాను ఆమోదించి చట్టంగా మార్చేసిందని పిటిషనర్ ఆరోపించారు. దీనివల్లే ఓబీసీ జాబితాలో లోటు పాట్లు జరిగాయని హైకోర్టు బెంచ్ ఎదుట వాదన వినిపించారు. దీనివల్ల అసలైన ఓబీసీలకు అన్యాయం జరిగిందన్నారు. దీంతో 2010 ఏప్రిల్ – సెప్టెంబరు మధ్య 77 కులాలను ఓబీసీలుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను, 2012 చట్టం ఆధారంగా కొత్తగా చేర్చిన మరో 37 కులాల ఓబీసీ హోదాను కోర్టు కొట్టివేసింది.

రాష్ట్రంలో 2010 తరవాత ఓబీసీలుగా వర్గీకరణ పొందినవారు 5 లక్షల వరకు ఉంటారని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. ఇప్పటికే ఈ విధమైన రిజర్వేషన్లు పొందినవారు, ప్రభుత్వ ఉద్యోగాలు, సర్వీసులకు ఎంపికైనవారికి తమ తీర్పు వర్తించదనీ, వారు యథావిధిగా కొనసాగవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే 2010కి ముందు రాష్ట్ర ప్రభుత్వం 66 కులాలను ఓబీసీలుగా వర్గీకరించడాన్ని ఎవరూ సవాలు చేయనందున అందులో తాము జోక్యం చేసుకోవడం లేదని న్యాయస్థానం తెలిపింది. ఓబీసీల రిజర్వేషను శాతాన్ని 7 నుంచి 17 శాతానికి పెంచుతూ 2010 సెప్టెంబరులో జారీ చేసిన ఉత్తర్వులను సైతం ధర్మాసనం కొట్టివేసింది. ఈ తీర్పుపై స్టే కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది.

బెంగాల్ బీసీ కమిషన్ చట్టం–1993 ప్రకారం ఓబీసీల కొత్త జాబితాను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కొత్త జాబితాను రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించాలని నిర్దేశించింది.

2010 సంవత్సరం తర్వాత రాష్ట్ర సర్కారు జారీ చేసిన ఓబీసీ సర్టిఫికెట్లు 1993 చట్టానికి వ్యతిరేకంగా ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాష్ట్ర ఓబీసీ జాబితాను సమీక్షించి చేరికలు, తొలగింపులపై సిఫార్సులతో శాసనసభకు నివేదిక ఇవ్వాలని, బీసీ కమిషన్‌తోనూ సంప్రదింపులు జరపాలని పశ్చిమబెంగాల్ బీసీ సంక్షేమ విభాగానికి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

**సుప్రీం కోర్టుకు పోతాం: మమత**

కలకత్తా హైకోర్టు తీర్పుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని తాము అంగీకరించబోమని తెలిపారు. దీనిని వ్యక్తీకరించిన తీరు కూడా అత్యంత రాజ్యాంగ విరుద్ధంగానే ఉంది. 'ఓబీసీ రిజర్వేషన్ల జాబితాను అప్పట్లో రూపొందించింది నేను కాదు. రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఉపేన్ బిస్వాస్ సారథ్యంలోని కమిటీ ఆ లిస్టును తయారు చేసింది. ఈ రిజర్వేషన్లకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించి బిల్లు తీసుకొచ్చాం. రాజ్యాంగానికి లోబడి తీసుకొచ్చిన ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఎన్నికల సమయంలో బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి దీన్ని నిలిపివేయాలని కుట్ర పన్నింది. ఈ తీర్పును మేం అంగీకరించోం. ఓబీసీ రిజర్వేషన్లు కొనసాగుతాయి' అని మమతా స్పష్టంచేశారు. సర్వోన్నత న్యాయ స్థానంలో సవాలు చేస్తామని ప్రకటించారు. హైకోర్టు న్యాయమూర్తుల మీద కూడా ఆమె విరుచుకుపడ్డారు. 'ఒక జడ్జి నేను ఆర్ఎస్ఎస్ వ్యక్తిని అంటుంటే, మరొకరు బీజేపీలో చేరారు' అని వ్యాఖ్యానించారు.

**ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ: మోదీ**

కలకత్తా హైకోర్టు 77 ముస్లిం ఉపకులాల ఓబీసీ హోదాను రద్దుచేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో జరిగిన బీజేపీ ఎన్నికల సభలో మోదీ మాట్లాడుతూ.. 'ముస్లిం అనే పదాన్ని నేను వాడినప్పుడల్లా మతపరమైన ప్రకటనలు చేస్తున్నానని ఆరోపించారు. వాస్తవాలు ప్రజల ముందుంచడం ద్వారా విపక్షాల ఓటుబ్యాంకు రాజకీయాలను బహిర్గతం చేయడమే నేను చేసిన పని' అన్నారు. మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఖండించారు.

**కనువిప్పు కలగాలి**

స్వాతంత్ర్యానికి పూర్వం ముస్లింలీగ్ మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కోసం వాదించేది. ఈ వేర్పాటువాద భావజాలమే దేశ విభజనకు కారణమైంది. అప్పుడా బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ పదే పదే ముస్లింలకు రిజర్వేషన్ల మీద మాట్లాడుతోంది. ఓటు బ్యాంకు సంతుష్టీకరణ రాజకీయాల కోసం సమాజంలో చిచ్చుపెట్టి సామాజిక సమరతను దెబ్బ తీస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. 'ఈ దేశ వనరులపై ముస్లింలకు మొదటి హక్కు ఉండాలి' అని గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి హోదాలో ఉన్నప్పుడు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ముస్లింలకు రిజర్వేషన్లు తేగా హైకోర్టు కొట్టేసింది. దీంతో దొడ్డి దారిలో వారికి రిజర్వేషన్లు ఇవ్వాలనే కుట్రకు తెర లేపారు కాంగ్రెస్ నాయకులు.

ఇప్పటికే రిజర్వేషన్ల జాబితాలో ఉన్న బీసీ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల కోటాను తగ్గించి ముస్లింలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. ఇందు కోసమే వారిని ఓబీసీల జాబితాలో చేరుస్తున్నాయి కాంగ్రెస్ ప్రభుత్వాలు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలందరినీ ఓబీసీ కేటగిరీలో చేర్చి రిజర్వేషన్లు కల్పించింది. ఇండీ కూటమిలోని ఇతర పార్టీలు కూడా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లిలకు రిజర్వేషర్లు ఇవ్వాలంటున్నాయి. మమతా బెనర్జీ తరహాలోనే ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ ఈ వాదనను బలంగా వినిపిస్తున్నాయి. హిందువుల న్యాయమైన డిమాండ్లను, రామ మందిర నిర్మాణాన్ని కాంగ్రెస్‌తో పాటు ఇండీ కూటమి భాగస్వామ్య పక్షాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. పౌరసత్వ సవరణ చట్టాన్ని, త్రిపుల్ తలాక్ రద్దును, ఆర్టికల్ 370 రద్దును, ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నారు. వీటన్నింటిలో కూడా మత కోణాన్ని మాత్రమే చూస్తున్నారు. ఇలాంటి సంతుష్టీకరణ విధానాలు ఆ పార్టీలకు మాత్రమే కాదు దేశానికి కూడా ప్రమాదకరమని గ్రహించాలి. కలకత్తా హైకోర్టు ఇచ్చిన తాజా తీర్పు ఈ పార్టీలకు కనువిప్పు కలిగించాలని కోరుకుందాం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# మారిన సామాజిక ముఖచిత్రం



రాజ్యాంగ హక్కుల రక్షణతో, సక్రమ అమలుతో దేశ సామాజిక చిత్రాన్ని ఎంతగా మార్చవచ్చునో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం నిరూపించింది. వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ అధ్యక్షుడు హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ మే 18వ తేదీన విడుదల చేసిన ప్రకటన దానికి అద్దం పడుతున్నది. 2014-15 విద్యా సంవత్సరం నుంచి 2021-22 విద్యా సంవత్సరం వరకు వివిధ వర్గాలకు చెందిన విద్యార్థుల సంఖ్య విద్యాలయాలలో విశేషంగా పెరిగింది. అంటే ఆ వర్గాల విద్యార్థులు విద్యాలయాలలో చేరారు.

పైన పేర్కొన్న ఎనిమిదేళ్ల కాలంలో షెడ్యూల్డ్ కాస్ట్ విద్యార్థుల సంఖ్య 44 శాతం పెరిగింది. అంటే 4.16 మిలియన్‌ల నుంచి 6.62 మిలియన్‌లకు చేరింది. మైనారిటీ వర్గాల విద్యార్థినుల సంఖ్య కూడా 41.3 శాతం పెరిగింది. అంటే 1.07 మిలియన్‌ల నుంచి 1.52 మిలియన్‌లకు చేరింది. ఈ వర్గాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను విస్తృతం చేయడం వల్ల ఇది సాధ్యమైందని హన్స్‌రాజ్ గంగారామ్ వెల్లడించారు.

ఎస్‌సీ, ఎస్‌టీ విద్యార్థినుల సంఖ్య కూడా పెరిగింది. పైన పేర్కొన్న ఎనిమిదేళ్ల కాలంలో ఎస్‌సీ విద్యార్థినుల సంఖ్య 51 శాతానికీ, ఎస్‌టీ విద్యార్థినుల సంఖ్య 65.2 శాతానికి పెరిగింది. కేవలం ఎస్‌టీ విద్యార్థినుల పెరుగుదల 80 శాతం పెరిగిన సంగతి తెలుస్తుంది.

వివిధ విద్యా సంస్థలలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్‌ను ఎంత పకడ్బందీగా అమలు చేసినదీ కూడా ఈ నివేదిక వివరించింది. ఈ రిజర్వేషన్ సౌకర్యంతో 2021-22 విద్యా సంవత్సరంలోనే కేంద్ర విద్యా సంస్థలలో 34,133 మంది ఓబీసీ విద్యార్థులకు ప్రవేశం లభించింది. నవోదయ విద్యాలయాలలో 19,710 మంది ఓబీసీ విద్యార్థులకు అవకాశం వచ్చింది. ఇదే విద్యా సంవత్సరంలో సైనిక స్కూళ్లలో 1,026 మంది ఓబీసీ విద్యార్థులు ప్రవేశించారు. ఎంబీబీఎస్‌లో ఓబీసీ విద్యార్థులు ప్రవేశాలు చూస్తే 2021లో 1,662గా ఉన్న సంఖ్య 2023 నాటికి 2,090కి చేరింది. అదే కాలానికి మెడిసిన్ పీజీ కోర్సులలో వారి ప్రవేశాలు వరసగా 2,662 (2021), 3,032 (2022), 3,322 (2023) పెరిగాయి. 2014-15 నుంచి 2020-21 విద్యా సంవత్సరాల నడుమ సెంట్రల్ యూనివర్సిటీలలో ఓబీసీ విద్యార్థుల సంఖ్య 32.6 శాతం పెరిగింది. ఓబీసీ విద్యార్థినుల చేరిక 40.4 శాతం పెరిగింది.

# జయలలిత హిందుత్వ నేత



తమిళనాడు రాజకీయ పార్టీల వైఖరి ఎంతో వికృతంగా ఉంటుంది. తమిళులు ఎక్కువ మంది భక్తులు. తమిళనాడులో ప్రతిచోటా, చిన్నదో పెద్దదో ఓ హిందూ దేవాలయం కనిపిస్తుంది. చెన్నై నగరంలో అయితే ఎంత చిన్న గుడి అయినా దాని ముందు ఆగి నాలుగు గుంజీలు తీయకుండా వెళ్లే వాళ్లు తక్కువ. కానీ వీళ్లని ఆరవై ఏళ్ల నుంచి ఏలుతున్న ద్రవిడ పార్టీలకు మాత్రం హిందూ శబ్దం బూతు పదంలా వినిపిస్తుంది. బీజేపీ తమిళనాడు శాఖ అధ్యక్షుడు కె. అన్నామలై ఇటీవల జయలలితను ఒక సందర్భంలో హిందూత్వ నాయకురాలు అని పేర్కొన్నారు. దీనితో జయలలిత ప్రాతినిధ్యం వహించిన అన్నాడీఎంకేకు అపారమైన ఆగ్రహం వచ్చింది. ఆ పార్టీ వ్యవస్థా వ్యవహారాల కార్యదర్శి డి. జయకుమార్ వెంటనే అన్నామలై అభిప్రాయాన్ని ఖండిస్తూ ఒక ప్రకటన ఇచ్చారు. జయను హిందుత్వ నాయకురాలు అని పేర్కొని అన్నామలై ఆమెను అవమానించారని ఆయన అంటాడు. జయలలిత అంటే కులాలకీ, మతాలకీ అతీతమైన నాయకురాలు. ఆమె ఒక సమ్మిళిత నేత. అన్ని మతాలను సమానంగా గౌరవించారు. బాబ్రీ మసీదు కూలినపుడు మిగిలిన రాష్ట్రాలన్నీ అతలాకుతలం కాగా తమిళనాడు మాత్రమే ప్రశాంతంగా ఉంది' అని జయకుమార్ వివరించారు. అన్నామలై ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జయలలిత గాఢమైన హిందూత్వ నాయకురాలనీ, తమిళ రాజకీయాలలో ఆమె మరణంతో ఏర్పడిన శూన్యాన్ని బీజేపీ భర్తీ చేస్తుందని అన్నారు. జయలలిత ద్రవిడ సిద్ధాంతాలతోనే ప్రభుత్వాన్ని నడిపించారని జయకుమార్ గుర్తు చేశారు. అన్నామలై ఇలాంటి ప్రకటన ఇవ్వడం వెనుక పెద్ద అజెండాయే ఉంటుందని మాజీ మంత్రి ఆర్‌బీ ఉదయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆఖరికి అన్నా డీఎంకే నుంచి గెంటేసిన నాయకురాలు వీకే శశికళ కూడా అన్నామలై ప్రకటనను తప్పు పట్టారు.



డీఎంకేతో పోల్చుకుంటే అన్నాడీఎంకే హిందూత్వం పట్ల కొంత మెత్తని వైఖరితో ఉంటుందని విశ్లేషకులు భావిస్తూ ఉంటారు. జయలలిత ఒక ఆలయానికి ఏనుగును బహూకరించారు కూడా.




# అమెరికాలో హిందూఫోబియా నిజమే

అమెరికాలో కూడా నిజాలు చెప్పేవాళ్లు ఉంటారన్నమాట. ఎప్పుడూ భారతదేశంలో మైనారిటీలని (విస్తృతార్థంలో ముస్లింలు) నానా హింసలు పెడుతున్నారని, వాళ్లకీ మీడియాకీ అసలు హక్కులే లేవనీ అక్కడ నుంచి అదే పనిగా నివేదికలు వస్తూ ఉంటాయి. వాటిని పట్టుకుని మన దేశంలో ఒక వర్గం మీడియా, ఉదారవాదులు రెచ్చిపోతూ ఉండడం కూడా మామూలే. కానీ తాజాగా కాలిఫోర్నియా పౌరహక్కుల శాఖ విడుదల చేసిన ఒక నివేదిక భారత్ మీద విషం చిమ్మే నివేదికలని తెల్లమొహం వేసేటట్టు చేసింది. కాలిఫోర్నియా ప్రాంతంలో నమోదవుతున్న మత విద్వేషం ఉదంతాలలో 23.3 శాతం హిందువుల మీద జరిగిన దాడులకు సంబంధించనవేనని తేల్చి చెప్పింది. అయితే హిందువుల మీద కంటే యూదుల మీద మరిన్ని ఎక్కువ దాడులు జరుగుతున్నాయని కూడా పౌర హక్కుల శాఖ తెలియచేసింది. అలాంటి దాడులు 36.9 శాతం. కాలిఫోర్నియా ప్రాంతంలో ఇస్లాంను వ్యతిరేకించే కొన్ని సమూహాలు ఉన్నాయని ప్రచారంలో ఉన్నప్పటికీ వాస్తవంగా అక్కడ ముస్లింల మీద జరిగిన దాడులు 14.6 శాతం. కాబట్టి ముస్లింల మీద కంటే యూదులు, హిందువుల మీద జరుగుతున్న దాడులే అక్కడ ఎక్కువ.

కొన్ని సంఘటనలు చూద్దాం. శాన్‌ఫ్రాన్సిస్కో బే అనే ఒక్క ప్రాంతంలోనే గడచిన ఆరు మాసాలలోనే ఆరు హిందూ దేవాలయాలని ధ్వంసం చేశారు. ఇవి కాకుండా కాలిఫోర్నియా ప్రాంతంలో హిందువులను బహిరంగ ప్రదేశాలలో అవమానించిన సంఘటనలు కూడా చాలా నమోదైనాయి. టాకో బెల్ ఫ్రెమాంట్ అనే చోట ఒక హిందూ వినియోగదారుని అలా అవమానించారు. కాలిఫోర్నియాలో మరొక వింత వాతావరణం నెలకొని ఉంది. హిందువుల మీద జరుగుతున్న ద్వేష పూరిత దాడుల గురించి కొందరు లోకం దృష్టికి తీసుకురావాలని ప్రయత్నిస్తుంటే దక్షిణాసియాకు చెందిన కొన్ని ముఠాలు దానిని అడ్డుకుంటున్నాయి. వారు చెప్పేవన్నీ అబద్ధాలని వీరు ప్రచారం చేస్తున్నారు. అంటే అసలు హిందువుల మీద ద్వేషపూరితంగా ఎవరూ లేరని చెప్పడమే వీళ్ల ఉద్దేశం. అక్కడ హిందువుల మీద ద్వేషం ప్రదర్శిస్తున్నారంటూ ఎవరు ప్రచారం చేసినా దానిని నమ్మవద్దని, అదంతా చేసేది మోదీ అనుకూల శక్తులని న్యూయార్క్‌టైమ్స్‌కు హార్వార్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఒకరు వ్యాసం రాయడం విశేషం. అందుకే కాలిఫోర్నియా పౌర హక్కుల విభాగం విడుదల చేసిన ఈ వాస్తవాలకు ఎలాంటి గతి పడుతుందోనని చాలామంది ఆందోళన చెందుతున్నారు.

హిందూ సమాజం మతం కారణంగా ద్వేషపూరిత దాడులను ఎదుర్కొంటోందని వారు చెబుతున్నారు. ఫిర్యాదు చేసిన ఘటనలలో అత్యధికంగా 23శాతంతో హిందువులే ఉన్నారుట.

'సిఎ వర్సస్ హేట్' అన్న బహుభాషా హాట్‌లైన్ నుంచి సేకరించిన డాటా ఆధారంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒక్క ఏడాది కాలంలోనే మొత్తం 1,020 ద్వేషపూరిత నేరాలు నమోదయ్యాయి.

బర్క్లీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన 'పాజిబిలిటీ ల్యాబ్' ఈ డాటాను విశేషించి, మతం ఆధారంగా లక్ష్యం చేసుకున్న ఘటనలలో 23.3శాతం హిందువుల పట్ల ద్వేషంతో చేసినవిగా కనుగొంది. మతాల ఆధారంగా జరుగుతున్న దాడుల విషయమై 'సిఎ వర్సస్ హేట్' డాటాను విశ్లేషించిన కాలిఫోర్నియా యూనివర్సిటీ దిగువ గణాంకాలను వెల్లడి చేసింది –

యూదు వ్యతిరేకత (35.9శాతం), హిందూ వ్యతిరేకత (23.3శాతం), ముస్లిం వ్యతిరేకత (14.6శాతం) అన్నవే మతాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడులకు కారణమని పేర్కొంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సిఎ వర్సస్ హేట్ హాట్‌లైన్ అందుకున్న ముస్లిం వ్యతిరేక ద్వేషం కలిగినవిగా ఆరోపితమైన ఘటనలు హిందూ వ్యతిరేక ఘటనల కన్నా 8.7శాతం తక్కువగా ఉండడం.

ఈ హాట్‌లైన్‌ను సోమవారం నుంచి శుక్రవారం వరకూ అత్యవసరం కాని ద్వేషపూరిత నేరాలు, ఘటనలకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6వరకు ఉపయోగించవచ్చు. బాధితులు అజ్ఞాత రూపంలో మొత్తం 200 భాషలలో ఫిర్యాదు చేయవచ్చు.

**హిందూ ఫోబియాను కప్పిపుచ్చేందుకు యత్నాలు**

హిందూ ఫోబియా ప్రస్ఫుటంగా తన కోరలను చాస్తున్నప్పటికీ, ఇందుకు భిన్నంగా హిందూ వ్యతిరేక, ఇస్లామిక్ అనుకూల సంస్థలన్నీ కూడా హిందూఫోబియాను కప్పిపుచ్చేందుకు పడరాని తిప్పలన్నీ పడ్డాయి.

ఇస్లామిక్ అనుకూల సంస్థ అయిన హిందూస్ ఫర్ హ్యూమన్‌రైట్స్ (హెచ్ఎఫ్ హెచ్ఆర్) అయితే, ఇస్లామోఫోబియా, యూదు వ్యతిరేకతతో సమానంగా చూపేందుకు పెట్టిన తప్పుడు పేరంటూ వ్యాఖ్యానించింది.

ప్రముఖ ఒఎస్ఐఎన్‌టి హాండిల్ అయిన 'డిజ్ ఇన్ఫోల్యాబ్' ప్రకారం హెచ్ఎఫ్‌హెచ్ఆర్‌ను 2019లో ఏర్పరచారు. ఆ ఏడాది సెప్టెంబర్ 22న ప్రధాని నరేంద్ర మోదీ హ్యూస్టన్ పర్యటనకు వ్యతిరేకంగా ప్రదర్శనల నిర్వహణకు నాయకత్వం వహించి, వాటిలో ముందు వరుసలో ఉండేందుకు ఏర్పాటు చేశారు.

'హిందూస్ ఫర్ హ్యూమన్‌రైట్స్' సహ వ్యవస్థాపకురాలు సునీతా విశ్వనాథ్ కూడా 2019లో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)కు వ్యతిరేకంగా భారతీయ ముస్లింలలో ఆందోళనను, హిస్టీరియాను సృష్టించేందుకు ప్రయత్నించింది. ఆమె 'వుమెన్ ఫర్ ఆఫ్ఘాన్ వుమెన్' అనే సంస్థకు కూడా సహ వ్యవస్థాపకురాలు. ఈ మధ్య అందరికీ చిరపరిచితమైన భారత ద్వేషి జార్జ్ సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ (ఓఎస్ఎఫ్)/ ఓపెన్ సొసైటీ ఇనిస్టిట్యూట్ (ఓఎస్ఐ) నిధులు సమకూరుస్తున్నాయి.

2021లో హిందూ వ్యతిరేక 'డిజ్‌మాంట్లింగ్ గ్లోబల్ హిందుత్వ' సదస్సును 'హిందూస్ ఫర్ హ్యూమన్‌రైట్స్' సంస్థ బలపరిచింది. అంతేకాదు, 2023 జూన్‌లో యుఎన్‌లో అధికారికంగా పర్యటిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు 'ప్రత్యేక్ టూల్‌కిట్'ను కూడా ప్రతిపాదించింది.

గత ఏడాది అక్టోబర్‌లో, చట్టపరమైన డిమాండ్ కారణంగా హెచ్ఎఫ్ హెచ్ఆర్ 'ఎక్స్' (నాటి ట్విట్టర్) హ్యాండిల్‌ను భారత్‌లో నిలువరించారు.

చరిత్రను వక్రీకరించే ఆడ్రే ట్రుష్కే (రట్గర్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్) వంటివారు గతంలో అమెరికాలో ఉంటున్న హిందువులు ఎదుర్కొంటున్న హింసను అధికారికంగా గుర్తించేందుకు ఉద్దేశించిన 1131 యుఎస్ సభా తీర్మానాన్ని వ్యతిరేకించారు. ★

కథ

అయిదున్నరకల్లా ఠంచనుగా చెవి దగ్గర రొద మొదలు. "కుహూ ...కుహూ" ఆగి ఆగి రెండు నిమిషాలకోసారి కోయిలపిల్ల అరుపులు. ఎంత మధురంగా ఉన్నా మంచి నిద్రలోంచి మెలుకువలోకి దిగడానికి మనశ్శరీరాలు సహకరించాలి కదా. అటు ఒత్తిగిలి ఇటు ఒత్తిగిలి ఇహ తప్పదన్నట్టు లేచి ముందుగా అలారం ఆఫ్ చేసి, కళ్లు నులుముకుని లైట్ ఆన్ చేసింది జాను. అప్పుడే అయిదు నలభై. ఒక్క నిమిషం ఒక అయిదు నిమిషాలు పడుకుందామా అనిపించింది. కాని, నిద్రపట్టిందో ఇహ మెళుకువ రావడం ఏ గంటకో.

లేచి కూచుని రెండు నిమిషాల్లో మనశ్శరీరాలు స్వాధీనంలోకి తెచ్చుకుని రోజు వారీ పనిలోకి దిగిపోయింది.

బ్రష్ చేసుకునేలోగా ఎలెక్ట్రిక్ కెటిల్‌లో నీళ్లు స్టౌ మీద పాలు పెట్టి, పిల్లల గదిలోకి తొంగి చూసింది.

అప్పటికే నిద్రలేచిన అత్తగారు మామగారు పక్క బట్టలు మడతలు పెడుతున్నారు. పిల్లలు పెద్ద చదువుల కోసం వెళ్లినా ఇంకా ఆ గది పిల్లల గదిగానే వ్యవహరించడం ఎంత మానుకుందామన్నా కుదరడం లేదే.

# తరాల స్నేహం

స్వాతీ శ్రీపాద



గోరు వెచ్చని నీళ్లలో నిమ్మరసం తేనె కలిపి డైనింగ్ టేబుల్ మీదుంచి కాఫీ డికాషన్ వెయ్యడానికి సిద్ధమయింది.

" అప్పుడే లేచేసావా జానూ, అయినా నేను వస్తున్నాగా అన్ని పనులూ నీ నెత్తిన వేసుకుంటే ఎలా చెయ్యగలవు?" అత్తగారు మెత్త మెత్తగా నొచ్చుకున్నారు.

" అదో పెద్ద పనా అత్తయ్యా?" అంటూ తన పనిలో మునిగిపోయింది.

" సరే, తలుపులు దగ్గరకు వేసి వెళ్తున్నాం" ఉదయం లేవగానే ఇద్దరికీ ఓ అరగంట నడక అలవాటు చేసింది జానకి.

మొదట్లో వెళ్లలేమని మొరాయించినా ససేమిరా ఒప్పుకోలేదు జానకి,

"మొదలు కొంచం ఇబ్బంది అనిపించినా ఆరోగ్యంగా ఉండాలంటే కాస్సేపు నడక మంచిది అత్తయ్యగారూ , నెమ్మదిగానే నడవండి" అంటూ రెండు మూడు రోజులు ఆవిడతో పాటు వెళ్లి అలవాటు చెసింది.

వాళ్లు తిరిగి వచ్చేసరికి ఇద్దరికీ కాఫీ సిద్ధంగా ఉంచుతుంది.

కూతుళ్లిద్దరూ పీజీ చదువులకు చెరో చోటికీ వెళ్లాక కొంచం వెసులుబాటుగా ఉంది.

అత్తగారు తిరిగి వచ్చి కాఫీ తాగాక వీలైనంత సాయం చేస్తూనే ఉంటారు.

తొమ్మిదింటికల్లా ఇద్దరూ ఆఫీస్‌కు వెళ్లాలి మరి. అయినా తను అదృష్టవంతురాలే అనుకుంది జానకి.

ఆ అదృష్టం వెనక ఎంత స్వయం కృషి, ఎంత సంఘర్షణ.

పెళ్లై కొత్తగా ఆ ఇంటికి వచ్చిన రోజులు గుర్తుకు వచ్చాయి.

చదువు తప్ప మరో లోకం తెలీదు ఇంకా. ఎంతసేపూ పుస్తకాలు పరీక్షలూ అనే సరిపోయేది. అటు చదువు పూర్తయీ కాకముందే మంచి సంబంధం అంటూ పెళ్లి చేసేశారు.

నలుగురాడపిల్లల్లో ఒక్కడే కొడుకు. అమ్మాయిలంతా ఇంకా చిన్నవాళ్లు చదువు కుంటున్నారు.

బెరుకు బెరుగ్గా ఆ ఇంట్లో కాలు పెట్టింది.

గట్టిగా నోరు విప్పి మాటే మాట్లాడేది కాదు. ఆరున్నరకి కాని నిద్రలేచే అలవాటు లేదు. ముందు లేవాలని చూసినా నిద్ర చాలక రోజంతా తలనొప్పితో బాధపడేది.

పెద్దగా పని అలవాటు లేదు. పుట్టింట్లో ఎవరి పనులు వారు చేసుకోడం వల్ల ఎవరి మీదా పెద్ద పని భారం పడేది కాదు.

ఇక్కడ అలాకాదు మరి. తిన్న కంచాల దగ్గరనుంచీ సింక్‌లో పారేసి ఉంచుతారు. ఆడపిల్లలు కాలేజీకి వచ్చినా, చివరి పిల్ల హైస్కూల్లో ఉన్నా ఇక్కడి పుల్ల అక్కడ పెట్టరు. స్నానాలు చేసి బట్టలు బాత్ రూంలో వదిలేసి వెళ్తారు.



తను రాకముందు ఏం చేసే వారో తెలియదు. కాని ఇంటి చాకిరీ మొత్తం కోడలు చెయ్యాలని అత్తగారి అభిలాష. మొహమాటానికి నాలుగు రోజులు చేసే సరికి ఒళ్లు పులిసిపోయి జ్వరం వచ్చేసింది.

భర్త సత్యమూర్తికి తన బాధ చెప్పుకోక తప్పలేదు.

అంతవరకూ ఇంటి విషయాలు పెద్దగా పట్టించుకోని అతనికి నెమ్మదిగా పరిస్థితులు అర్థమాయ్యాయి.

చెల్లెళ్లను మందలించాడు. ఎవరిపనులు వాళ్లు చేసుకోకపోతే ఎలాగ అన్నాడు.

తల్లి మధ్యలో రాబోతే –

" నువ్వూరుకో అమ్మా, వాళ్లు తిన్నకంచాలు

కడుక్కోలేరా? విప్పిన గుడ్డలు ఉతుక్కోలేరా? అయినా నువ్వెనా ఒక్కదానవూ ఈ పనులు ఎవరు చెయ్యమన్నారు? పని మనిషిని మాట్లాడు" అనేసాడు.

ఎదురుగా ఏం అనలేక " ఇప్పుడు పెళ్లాం వచ్చేసరికి పనిమనిషి కావలసి వచ్చింది" అని గింజుకుందావిడ.

సత్యమూర్తి పొద్దున తొమ్మిది కల్లా ఆఫీస్‌కి వెళ్తే తిరిగి వచ్చేసరికి ఏడయేది.

ఖాళీగా ఉండటం ఎందుకని గ్రూప్ వన్ పరీక్షలకు చదువు మొదలు పెట్టింది జానకి.

ఖాళీగా ఉన్న ఆదివారం ఏ గుడికో సినిమాకో వెళ్లేవారు.

అదీ తప్పుగానే తోచింది. అత్తగారికీ మామగారికీ. ఒక సెలవురోజు తీరిగ్గా ఉదయమే సత్యమూర్తిని కూచోబెట్టి మొదలు పెట్టారు.

"పిల్లకు ఒక్క పనీపాటా రాదు, ఎంతసేపూ ఆ పుస్తకాలూ చదువులే. సెలవు దొరికే సరికి మీరిలా ఆడపిల్లల ముందు తిరగడం అస్సలు బాగాలేదు. అలా కుదరదు. ఇష్టమైతే ఉండమను లేకపోతే లేదు." అంటూ ఇద్దరూ ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పడం.

చివరగా '' లేదంటే పిల్లను వాళ్లింట్లో దింపేసిరా" అన్నారు మామగారు.

సత్యమూర్తి ఖిన్నుడైపోయాడు. ఏం చెప్పాలో తెలియలేదు.

అన్నీ వింటున్న జానకి కాస్సేపు ఆలోచించు తలుపులు వేసి మాట్లాడుకుంటున్న ఆ గది తలుపుతోసి లోపలికి వెళ్లింది.

''అత్తయ్య గారూ , మామగారూ ఇలా వచ్చినందుకు క్షమించండి. కాని నేను చెప్పదలుచు కున్నది చెప్పే వెళ్తాను. పని రాదని నన్ను మా పుట్టింటికి పంపడానికి నేను ఈ ఇంటి కోడలిగా వచ్చాను. పనిమనిషిగా కాదు. ఈ పనులు అవసరం ఉన్నంత వరకే చేసుకోగలం కాని శక్తికి మించి కాదు. నేను గ్రూప్ వన్ పరీక్షలకు చదువుకుంటున్నాను. ఈ ఇల్లు నాది. నలుగురు ఆడపిల్లల పెళ్లిళ్లు చెయ్యాలనే బాధ్యత తలమీద ఉన్నప్పుడు నేనూ ఒక ఉద్యోగం చూసుకోవాలనే చూస్తున్నాను. గుడికీ గోపురాలకీ వెళ్లడం తప్పంటే మీరూ అత్తయ్య గారూ వెళ్లడం లేదా? రేపు పెళ్లిళ్లు చేసాక మీ కూతుళ్లు, అల్లుళ్లూ, ఊళ్లు వెళ్లరా? అనవసరంగా నా మీద అధికారం చెలాయించాలని చూడకండి. ఈ ఇంట్లో ఉండటం నా హక్కు"

అనేసి బయటకు వెళ్లిపోయింది. అక్కడితో సాధింపులకు తెరపడింది. అయినా జానకి ఉద్యోగంలో చేరి జీతం ఇవ్వడం లేదని కొంచం కినుకగానే ఉండేది.

నాలుగేళ్ల తరువాత కూతురు పెళ్లికి కట్నం మొత్తం జానకి సమకూర్చడం ఇద్దరినీ సిగ్గుపడేలా చేసింది.

**"అత్తయ్య గారూ , మామగారూ ఇలా వచ్చినందుకు క్షమించండి. కాని నేను చెప్పదలుచు కున్నది చెప్పే వెళ్తాను. పని రాదని నన్ను మా పుట్టింటికి పంపడానికి నేను ఈ ఇంటి కోడలిగా వచ్చాను. పనిమనిషిగా కాదు. ఈ పనులు అవసరం ఉన్నంత వరకే చేసుకోగలం కాని శక్తికి మించి కాదు. నేను గ్రూప్ వన్ పరీక్షలకు చదువుకుంటున్నాను. ఈ ఇల్లు నాది.**

జానకి ఉద్యోగానికి వెళ్లినా పిల్లలను అత్తగారే అరచేతుల్లో పెట్టుకుని చూసుకునే వారు.

"అవసరం వచ్చినప్పుడు కుండబద్దలుకొట్టినట్టు మాట్లాడాలి కూడా" అనుకుంటూ కాఫీ కలపడం మొదలు పెట్టింది.

అరగంటలో తిరిగి వచ్చిన అత్తగారు తోటకూర తరుగుతూ "పక్కింటి వనజాక్షి కోడలు కూడా వచ్చింది వాకింగ్‌కి. అత్తకూ కోడలికీ ఒక్క నిమిషం పడదట. వేరు కాపురం వెళ్లి పోదామంటే మొగుడు పట్టించుకోడం లేదట" "అదేం పాపం" పప్పు కుక్కర్ లో పెడుతూ అడిగింది జానకి.

"అదేమిటే వేరు కాపురం పెడితే ముదికాలానికి తల్లినీ తండ్రినీ చూసేదెవరు? అయినా ఆ జ్ఞానం తలిదండ్రులకూ ఉండాలి. కోడలూ కూతురులాంటిదే కదా అనుకోవాలి. ఇద్దరికిద్దరూ బిగుసుకుపోతే ఇహ అనుబంధాలెక్కడ?"

"మనమేం చెయ్యగలం?"

"అలాగని చూస్తూ ఊరుకుంటామా? సాయంత్రం అత్తనూ కోడలినీ రమ్మన్నాను. మనం రాజీ కుదర్చగలమేమో చూద్దాం" అందావిడ.

* * *

సాయంత్రం జానకి ఇల్లు చేరేసరికి

వీధివాకిట్లో కుర్చీలు వేసుకుని మామగారూ పక్కింటాయనా మాట్లాడుకుంటున్నారు.

లోపల అత్తగారితో పాటు వనజాక్షీ ఆమె అత్తగారూ ఉన్నారు.

"ఏమ్మా వచ్చావా? మొహం కడుక్కునిరా కాఫీ రెడిగా ఉంది" అన్నారు అత్తగారు.

"ఇప్పుడు చెప్పండి. ఎందుకు ఇద్దరూ ఇలా మనసును దుఃఖపెట్టుకుంటున్నారు?"

పెద్దావిడ కాఫీలు తాగాక మొదలుపెట్టింది.

"ఏం చెప్పను ఆంటీ పెళ్లయి వచ్చినది మొదలు అన్నింటికీ వంకలే. ఏ పని చేసినా నచ్చదు. అందుకే అసలు చెయ్యడమే మానేసా?"

"వంకలా? ఒక్కపనైనా సవ్యంగా చెయ్యడం వచ్చునా? అసలు ఏదైనా నేర్పితే కదా?"

"అదుగో అదేనండి మాట్లాడితే మా వాళ్లనెందుకు అనడం? ఇక్కడ ఈవిడకు అన్నీ బాగా వచ్చినట్టు"



"ఆగండాగండి. ఒకళ్లనొకళ్లు అనుకోడంమాని మీ సమస్య చెప్పండి చాలు"

"ఈవిడ ఇక్కడ దర్జాగా తిని కూచుంటే చేసి పెట్టడానికి నేనేమీ పనిమనిషిని కాదు" అత్తగారి ఈసడింపు.

" నేను మాత్రం పనిమనిషిగా వచ్చానా?" కోడలి విసురు.

గంటన్నర మాట్లాడినా ఇదే వరస.

జానకి కల్పించుకుంది.

"సరే మీ ఇద్దరూ చెప్పాల్సినది అర్థమయింది. మాకు తోచిన మాట చెప్తాము. వింటారా మీ ఇష్టం, వినకపోడమూ మీ ఇష్టమే.

మీకు రెండు దారులున్నాయి.

ఒకటీ రాజీ అదీ ఒకవైపు నుండి కాదు. వనజా ఒక పది రోజులపాటూ మీ అత్తగారు ఏం మాట్లాడినా మీ అమ్మే అనుకుని చూడు. అలాగే మీ అత్తగారూ నువ్వేం చేసినా కూతురే అనుకుని ఆలోచించాలి. ఇదొక పరీక్ష అనుకుని ప్రయత్నించండి.

రెండోది – ఆవిడకు కొడుకు కావాలి, నీకూ భర్త కావాలి. ఎవరినీ త్యాగం చేసి వదులుకొమ్మని అనలేం కదా?

పైన ఎలాగూ అద్దెకిచ్చారు కదా, ఖాళీ చేయించి పైన ఒకరు ఉండంది.

దూరంగా ఉన్నప్పుడు ప్రేమలు పెరుగుతాయి. కాని ముందు మొదటి మార్గం ట్రై చేసి చూడండి.

పెళ్లిళ్లు కుటుంబాలు కలసి ఉండటానికి కాని విడిపోయేందుకు కాదు. ఏమంటారు అత్తయ్యగారూ

"అంతే అంతే.. తరాల మధ్య స్నేహం పెరగాలి కాని అంతరం కాదు.

పది రోజుల తరువాత విషయం వారి వారి సంస్కారాల మీద విజ్ఞత మీద ఆధారపడి ఉంటుంది." అందావిడ.

వచ్చేవారం కథ..
**రేపటి వర్తమానం**
వై.మంజుల భావన





2024-ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌కు అమెరికా, వెస్టిండీస్ క్రికెట్ బోర్డుల సంయుక్త ఆతిథ్యంలో తెరలేచింది. జూన్ 29 వరకూ జరిగే 20 దేశాల ఈ సమరంలో రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత్ మరోసారి హాట్ ఫేవరెట్‌గా టైటిల్ వేటకు దిగుతోంది.

# భారత్‌కు టీ-20 ప్రపంచకప్ 'చిక్కే'నా?

ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టు భారత్‌కు టీ-20 ప్రపంచకప్ అందని ద్రాక్షలా తయారయ్యింది. ధోనీ నాయకత్వంలో 2007 ప్రపంచకప్‌ను గెలుచుకున్న నాటి నుంచి గత 17 ఏళ్లుగా భారత్ మరో ప్రపంచకప్ కోసం చకోర పక్షిలా ఎదురు చూస్తోంది. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, కుల్దీప్ యాదవ్ లాంటి ప్రపంచ మేటి ఆటగాళ్లు, అత్యుత్తమ ర్యాంకు ఉన్నా.. భారత్ పరిస్థితి 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో...' అన్నట్లుగా తయారయ్యింది.

**హిట్ మ్యాన్‌కు ఇదే ఆఖరి చాన్స్...!**

భారత క్రికెట్ హిట్ మ్యాన్ రోహిత్ శర్మ దేశానికి ఓ ప్రపంచకప్ సాధించి పెట్టి మరీ సగర్వంగా రిటైర్ కావాలని భావిస్తున్నాడు. ఐసీసీ టెస్టు లీగ్ ఫైనల్, 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్స్‌లో పాల్గొన్న భారతజట్లకు రోహిత్ శర్మే నాయకత్వం వహించాడు. అయితే.. రన్నరప్ స్థానాలతోనే భారత్ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే.. ప్రస్తుత టీ-20 ప్రపంచకప్‌ను ఆరునూరైనా నెగ్గితీరాలన్న పట్టుదలతో భారత్ బరిలోకి దిగుతోంది.

**తొలిసారిగా అమెరికా గడ్డపై ...**

టెస్టు హోదా పొందిన దేశాలకు మాత్రమే పరిమితమైన క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేయటం కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నేపాల్, ఉగాండా లాంటి చిన్నాచితకా జట్లకు సైతం ప్రపంచకప్‌లో పాల్గొనే అవకాశం కల్పించింది.

ప్రస్తుత ప్రపంచకప్‌ను రికార్డుస్థాయిలో 20 జట్లతో నిర్వహిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రీడామార్కెట్ అమెరికాకు క్రికెట్‌లోని మజాను పరిచయం చేయటానికి ఐసీసీ తొలిసారిగా అమెరికా, కరీబియన్ ప్రాంత దేశాలు వేదికగా 2024 ప్రపంచకప్‌ను నిర్వహిస్తోంది.. జూన్ 29 వరకూ ఈ గ్రూప్ లీగ్ కమ్ నాకౌట్ సమరాన్నిఅమెరికాలోని డాలస్, న్యూయార్క్ నగరాలతో పాటు వెస్టిండీస్ (కరీబియన్ ద్వీప దేశాల) వేదికల్లో సైతం నిర్వహిస్తున్నారు.

**55 మ్యాచ్‌లతో టీ-20 ప్రపంచకప్...**

టీ-20 ప్రపంచకప్ గ్రూపు లీగ్ కమ్ నాకౌట్

## టికెట్ ధర 33 లక్షలు!

2024 టీ-20 ప్రపంచకప్‌లో దాయాదుల సమరం మ్యాచ్ టికెట్ల ధరలు చుక్కలంటాయి. అమెరికాలోని భారత ఉపఖండ దేశాల సంతతి అభిమానులు టికెట్ల కోసం రికారుస్థాయిలో డాలర్లు కుమ్మరిస్తున్నారు. భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ టికెట్ల కోసం రెండుదేశాల అభిమానులు ఎగబడుతున్నారు. మ్యాచ్ టికెట్లు సొంతం చేసుకోడానికి ఎంతైనా చెల్లించడానికి వెనకాడటం లేదు. ప్రీమియం టికెట్ ధర రూ. 33 లక్షలంటే ముక్కుమీద వేలేసుకోవాల్సిందే.

న్యూయార్క్ వేదికగా జూన్ 9న జరిగే భారత్- పాక్ జట్ల మ్యాచ్ టికెట్లు హాటు కేకుల్లా అమ్ముడైనట్లు నిర్వాహక సంఘం ప్రకటించింది. భారత ఉపఖండానికి చెందిన ఈ రెండుదేశాల మ్యాచ్‌కు మాత్రమే టికెట్ల ధర రికార్డుస్థాయికి చేరడంతో ఐసీసీ ఉక్కిరిబిక్కిరవుతోంది. రీ-సేల్ మార్కెట్లో మ్యాచ్ టికెట్ల ధర ఆకాశాన్ని అంటింది.

అధికారికంగా కనీస టికెట్ ధరను 6 డాలర్లు (497 రూపాయలు), ప్రీమియం టికెట్ల ధరను 400 డాలర్లు ( 33వేల 148 రూపాయలు)గా ఐసీసీ నిర్ణయించింది. అయితే..గతంలోనే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వ్యక్తులు తమ టికెట్లను రీసేల్ మార్కెట్లో స్టబ్ హబ్, సీట్ గీక్ వేదికల ద్వారా కళ్లు చెదిరే ధరకు విక్రయించారు. 400 డాలర్ల ధర 40వేల డాలర్లకు (33 లక్షల రూపాయల) చేరింది.

ఈ టికెట్ల ధరకు ప్లాట్ ఫామ్ ఫీజును కలుపుకొంటే 50 వేల డాలర్లు (41 లక్షల రూపాయలు) అవుతుందని రీసేల్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. న్యూయార్క్ లోని విశ్వవిఖ్యాత సూపర్ బౌల్ స్టేడియం వేదికగా గతంలో జరిగిన ఎన్‌బీఏ మ్యాచ్‌ల సూపర్ బౌల్-58 టికెట్ ధర 9వేల డాలర్లు, కోర్ట్ సైడ్ సీట్ల ధర 24వేల డాలర్లు మాత్రమే కాగా...ప్రపంచకప్ క్రికెట్ మ్యాచ్ టికెట్ ధర 40వేల డాలర్లు పలకడాన్ని సరికొత్త రికార్డుగా చెబుతున్నారు.




రౌండ్ మ్యాచ్‌లను కరీబియన్ ద్వీపాలలోని ఆరు (బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్, ట్రినిడాడ్‌లోని బ్రియాన్ లారా అకాడమీ స్టేడియం, గయానాలోని ప్రావిడెన్స్ స్టేడియం, ఆంటీగా లోని సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియం, సెయింట్ లూకాలోని డారెన్ సామీ క్రికెట్ గ్రౌండ్, సెయింట్ విన్సెంట్‌లోని ఆర్నోస్ వాలే స్టేడియం) వేదికలుగాను, అమెరికాలోని మూడు (న్యూయార్క్ లోని ఐసెన్ హోవర్ పార్క్, ఫ్లోరిడాలోని లాడెర్ హిల్, టెక్సస్‌లోని గ్రాండ్ ప్రయరీ) వేదికల్లోనూ 55 మ్యాచ్‌ల గ్రూప్ లీగ్ కమ్ నాకౌట్ ప్రపంచకప్ మ్యాచ్ లు నిర్వహించనున్నారు.

జూన్ 1 నుంచి 18 వరకూ గ్రూపు దశ పోటీలు జరుగుతున్నాయి. 19 నుంచి 24 వరకూ సూపర్ – 8, జూన్ 26, 27 తేదీలలో సెమీఫైనల్స్, జూన్ 29న ఫైనల్స్ నిర్వహిస్తారు.

గ్రూప్– ఏ లీగ్‌లో హాట్ ఫేవరెట్ భారత్, మాజీ చాంపియన్ పాకిస్థాన్ జట్లతో ఐర్లాండ్, కెనడా, అమెరికా జట్లు తలపడతాయి.గ్రూపు– బీ లీగ్‌లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, నమీబియా, స్కాట్లాండ్, ఒమన్ జట్లు పోటీపడతాయి. గ్రూప్– సీ లీగ్‌లో న్యూజిలాండ్, అఫ్ఘనిస్థాన్, ఉగాండా, పాపువా న్యూగినియా, గ్రూప్– డీ లో దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్ ఢీ కొంటాయి.

తొలిదశ గ్రూపులీగ్‌లో మొత్తం 20 జట్లు నాలుగు గ్రూపులుగా ఢీ కొంటాయి. గ్రూపులీగ్ దశ నుంచి రెండోదశకు చేరిన ఎనిమిది అత్యుత్తమ జట్ల నడుమ సూపర్– 8 రౌండ్ పోరును నిర్వహిస్తారు. ఈ రౌండ్‌లో మొదటి నాలుగు స్థానాలలో నిలిచిన జట్లు సెమీఫైనల్ నాకౌట్ రౌండ్‌లో పోటీపడతాయి.

జూన్ 5న న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో భారత్ తన తొలి గ్రూపుమ్యాచ్ ఆడనుంది. జూన్ 9న జరిగే కీలక పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. 15న ఫ్లోరిడా వేదికగా జరిగే పోటీలో పసికూన కెనడాతో భారత్ తలపడనుంది. భారత్ సూపర్ –8 రౌండ్ చేరితే జూన్ 20, 22, 24 తేదీలలో మ్యాచ్ లు ఆడాల్సి ఉంది.

ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్ల నుంచి భారత్‌కు గట్టిపోటీ ఎదురుకానుంది. భారత పరుగుల యంత్రం విరాట్ కోహ్లీ ఐపీఎల్‌లో కనబరచిన జోరునే ప్రపంచకప్‌లో సైతం కొనసాగించగలిగితే రోహిత్ సేనకు తిరుగే ఉండదు. భారతజట్టులోని సగంమంది ఆటగాళ్లకు ఇదే ఆఖరి ప్రపంచకప్ కానుండడంతో చావో బతుకో అన్నట్లుగా పోరాడుతారనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

జట్టులోని కీలక ఆటగాళ్లంతా స్థాయికి తగ్గట్టుగా రాణించగలిగితే భారత్ మరోసారి టీ–20 ప్రపంచకప్ అందుకోడం ఏమంత కష్టం కాబోదు. 29 రోజుల పాటు 55 మ్యాచ్ లుగా సాగే టీ–20 ప్రపంచకప్ విశ్వవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులకు పసందైన క్రికెట్ విందే అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ★



**క్రీడా కృష్ణ, 84668 64969**
సీనియర్ జర్నలిస్ట్

# ప్రచారకర్తగా మానవచిరుత!

పరుగులో జగజ్జేత, మానవ చిరుత ఉసెన్ బోల్ట్ సరికొత్త అవతారం ఎత్తాడు. 2024-ఐసీసీ టీ-20 ప్రపంచకప్‌కు ప్రచార కర్తగా వ్యవహరించనున్నాడు. ఈ టోర్నీకి బ్రాండ్ అంబాసిడర్‌గా జమైకన్ థండర్ ఉసెన్ బోల్ట్‌ను ఐసీసీ నియమించింది. తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్ ఆటకు ప్రచారకర్త కావడం గర్వ కారణమని, ప్రపంచకప్‌కు తనను ఐసీసీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం తన అదృష్టమని బోల్ట్ చెప్పాడు.

కరీబియన్ ద్వీప దేశాల ప్రజల దైనందిన జీవితంలో క్రికెట్ ఓ ప్రధాన భాగమని, ఏ ద్వీపానికి వెళ్లినా క్రికెట్ ఆడుతూనే కనిపిస్తారని,



తన గుండెల్లో క్రికెట్‌కు ప్రత్యేక స్థానముందని బోల్ట్ ప్రకటించాడు.

అమెరికాలాంటి దేశం వేదికగా ప్రపంచకప్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం గొప్ప విషయమని, క్రికెట్‌కు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పాడు. 2028 లాస్ ఏంజలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను పతకం అంశంగా ప్రవేశ పెట్టడం కూడా గొప్ప పరిణామమని చెప్పాడు.

**ఇప్పుడు కాకపోతే మరెప్పుడూ కాదు.....**

టీ-20 ప్రపంచకప్ కోసం భారత్ గత 14 సంవత్సరాల నుంచి చకోరపక్షిలా వేచి చూస్తోంది. అంతేకాదు..పరిమిత ఓవర్ల క్రికెట్లో విరాట్ కోహ్లీ నాయకత్వం వహిస్తున్న ఆఖరు టీ-20 ప్రపంచకప్ ఇదే కావడం భారతజట్టుకు అసలు సిసలు సవాలు కానుంది. అసాధారణ నాయకులు, గొప్ప మెంటార్ లతో పాటు అత్యంత పటిష్టమైన జట్టుతో బరిలో నిలిచిన భారత్ విజేతగా నిలవాలని కోరుకొందాం.! ★

**తెలంగాణలో ముస్లిములు హిందువుల విశ్వాసాలపై దాడి చేసిన మరో ఘటన వెలుగు చూసింది. కురవ కులస్థులు దైవంగా భావించి ఆరాధించే సంత్ కనకదాసు విగ్రహాన్ని బలవంతంగా తొలగించి వేసారు. మే 22న ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న విగ్రహాన్ని తీసేసిన సంఘటనపై పోలీసుల మౌనం హిందువులకు ఆగ్రహం కలిగిస్తోంది. కొంచెం ఆలస్యంగా వెలుగుచూసిన ఆ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.**

# హిందువుల విగ్రహాల తొలగింపుపై మౌనం ఎందుకు?



జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డిలో హిందూ ధర్మానికి చెందిన కురవ కులస్తులు ఉన్నారు. వారు సంత్ కనకదాసు అనే హరిదాసు సంప్రదాయాన్ని పాటించేవారు. కనకదాసును వారు దైవంతో సమానంగా, తమ కులదైవంగా పూజిస్తారు. ప్రతీయేటా కనకదాసు జయంతి రోజు ఘనంగా ఆయన సంకీర్తనలు పాడుకోవడం, ఆయనకు పూజలు చేయడం వారికి దశాబ్దాలుగా ఉన్న ఆనవాయితీ.

ఆ క్రమంలో ఈ సంవత్సరం కనకదాసు జయంతి నాటికి ఆయన విగ్రహం ఒకటి శాశ్వతంగా నిర్మించుకుని అక్కడ పూజలు చేసుకోవాలని భావించారు. ఆ మేరకు తమ ప్రైవేటు స్థలంలో కనకదాసు విగ్రహం పెట్టుకున్నారు. మే 22న విగ్రహావిష్కరణకు ముహూర్తం నిర్ణయించుకున్నారు. ఆ సందర్భంగా అక్కడ తెల్లవారుజామున 4 గంటల నుంచీ పూజలు, ఉత్సవం చేసుకుంటున్నారు. ఉదయం 7 గంటల సమయంలో ఆ చుట్టుపక్కల ప్రాంతంలోని ముస్లిములు మూకుమ్మడిగా అక్కడికి చొరబడ్డారు. ప్రశాంతంగా పూజలు చేసుకుంటున్నవారిని దూషిస్తూ, హింసాత్మకంగా ప్రవర్తిస్తూ ఆ విగ్రహాన్ని తొలగించివేసారు.

స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం ఆ విగ్రహం పెట్టిన ప్రదేశం ఒక ప్రైవేటు స్థలం. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అన్నీ పక్కాగా ఉన్నాయి. ఆ ప్రైవేటు స్థలం యజమానులకు అక్కడ ఏం నిర్మించుకోవాలన్నా పూర్తి హక్కులున్నాయి. అక్కడ తమ కులదైవం విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం నేరం ఏమీ కాదు. అయితే ముస్లిములు ఆ విగ్రహం అక్కడ రహదారికి అడ్డంగా కట్టారని, తమ ఇళ్లకు వెళ్లే దారిని అడ్డగించారనీ తప్పుడు ఆరోపణలు చేసారు. నిజానికి ముస్లిముల ఇళ్లకు వెళ్లడానికి సరిపడా దారి విడిగా ఉంది. అయినప్పటికీ వారు తప్పుదోవ పట్టించే సమాచారంతో హిందువులు స్థాపించుకున్న విగ్రహాన్ని బలవంతంగా తీసి పడేసారు. నిజానికి వారి అభ్యంతరం రహదారి కాదు, హిందువులు తాము దైవంగా భావించే సంత్ విగ్రహం పెట్టుకోవడమే.

ఆ దురాగతంలో పాల్గొన్న అల్లరిమూకలో మొహమ్మద్ అనే మాజీ ఎంపిటిసి, మాబు సాహెబ్, నవాబ్, రంజుగా కూడా ఉన్నట్టుగా గుర్తించారు. స్థానిక ఇమామ్ కూడా విగ్రహం తొలగింపులో పాల్గొన్నారు. దారుణం ఏంటంటే జిల్లా అధికారులు సైతం ముస్లిములకు అనుకూలంగా పక్షపాత ధోరణితో వ్యవహ రించడం. మరోసారి అక్కడ విగ్రహం పెట్టడానికి ప్రయత్నించవద్దంటూ స్థానిక హిందువులను అధికారులు బెదిరించారు.

గ్రామంలో సుమారు 800 కుటుంబాలు ఉన్నాయి. వాటిలో ముస్లిం కుటుంబాలు 20 నుంచి 25 మాత్రమే ఉన్నాయి. అయినా వారు హిందువులను తమ పూజలు చేసుకోనీయకుండా హింసాత్మకంగా అడ్డుపడితే అధికారులు సైతం వారికే వంత పాడుతున్నారంటూ గ్రామస్తులు వాపోయారు.

ఈ సంఘటనపై తెలంగాణ విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి శశిధర్ స్పందించారు. "గొర్లఖాన్‌దొడ్డిలో ముస్లిముల దుండగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. నేరస్తులను పోలీసులు అరెస్ట్ చేసి శిక్షించాలి. తెలంగాణలో ముస్లిముల విద్వేషచర్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిముల తీవ్రవాద ధోరణులకు మౌనంగా మద్దతు పలుకుతున్నట్లుంది. ముస్లిముల సెంటిమెంట్లను, వారి మతవిశ్వాసాలను హిందువులు గౌరవిస్తూ వస్తున్నారు. కానీ తమ విశ్వాసాలను గౌరవించాలని ముస్లిములను కోరుతున్నా, వారు విద్వేషంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఒకపక్క హిందువులపై దాడులు చేస్తూ, మరోవైపు తామే బాధితులం అని చెప్పుకునే ముస్లిముల ప్రవర్తన సమస్యాత్మకంగా ఉంది" అని శశిధర్ ప్రకటించారు.

సంత్ కనకదాసు 16వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యంలో భక్తి ఉద్యమాన్ని వ్యాపింపజేసిన ప్రముఖ సాధువు. కర్ణాటకకు చెందిన ఆ ఆధ్యాత్మిక తత్వవేత్త రచించి స్వరపరిచిన భజనలు, కీర్తనలు దక్షిణ భారతదేశ సాంస్కృతిక వికాసంలో ప్రముఖ పాత్ర పోషించాయి. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం రత్నాలయం



హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట్ మండలం అలియాబాద్ రోడ్ కూడలి, రాజీవ్ రహదారి పక్కన నిర్మించిన ఆలయమిది. దీనిని రత్నాలయం అని కూడా అంటారు. ఇక్కడ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్నారు. అద్భుతమైన శిల్పకళా సంపదతో ఈ ఆలయం విరాజిల్లుతోంది. పర్వదినాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో వస్తుంటారు.

## కథ | పొగరుబోతు గొర్రెకు బుద్ధి చెప్పిన నక్క



ఒక అనగనగా ఓ అడవి. ఆ అడవిలో బాగా కొమ్ములు తిరిగిన ఓ గొర్రె ఉండేది.

ఆ గొర్రె చాలా పొగరుతో ఉండేది. తన కొమ్ములతో ఎవ్వరినైనా ఓడించగలనన్న ధైర్యంతో, చాలా అహంకారంతో ఉండేది. దారిలో వచ్చీ పోయే ప్రతి జంతువును తన కొమ్ములతో పొడిచి వేధించడం మొదలుపెట్టింది.

ఈ విషయం తెలుసుకున్న నక్క.. గొర్రెపోతుకు ఎలాగైనా గుణపాఠం చెప్పాలనుకుంది.

సమయం చూసుకొని గొర్రెపోతు దగ్గరకు వెళ్లింది. ‘ఈ చిన్న చిన్న ప్రాణుల మీద పోట్లాడటానికి నీ కొమ్ములతో పొడిచి నువ్వు తక్కువ కావద్దు. నీకు నేను సరైన

## పద్యము

**పసుల వన్నె వేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి**
**దర్శనంబులారు దైవంబు ఒక్కటె**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** మనుషులంతా ఒక్కటే. పశువులు వేరువేరు రంగులలో ఉన్నప్పటికీ అవి ఇచ్చే పాలు మాత్రం తెల్లగానే ఉంటాయి. అలాగే మనుషులు వివిధ వర్ణాల వారైనా మనసులు ఒకటిగా మసలుకోవాలంటాడు వేమన. పూవులు వేరువేరు రంగులతో ఉన్నా పూజకు వినియోగపడటంలో అవన్నీ ఒక్కటే గదా! అని అర్థం.

## శ్లోకము

**పరోపకారాయ ఫలంతి వృక్షాః**
**పరోపకారాయ వహంతి నద్యః**
**పరోపకారాయ దుహంతి గావః**
**పరోపకారార్థ మిదం శరీరం**

**భావం :** పరులకు ఉపకారం చేయడానికే చెట్లు ఫలాలను అందిస్తున్నాయి. నదులు ప్రవహిస్తు న్నాయి. గోవులు పాలు ఇస్తున్నాయి. పరోపకారం కోసమే ఈ శరీరము

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| గిర్ నేషనల్ పార్క్ | తమిళనాడు |
| కార్బెట్ నేషనల్ పార్క్ | గుజరాత్ |
| మదుమలై అభయారణ్యం | ఉత్తరాఖండ్ |
| దచిగామ్ నేషనల్ పార్క్ | అస్సోం |
| కజిరంగ అభయారణ్యం | జమ్ముకశ్మీర్ |

**సమాధానాలు :** గిర్ నేషనల్ పార్క్–గుజరాత్; కార్బెట్ నేషనల్ పార్క్–ఉత్తరాఖండ్; మదుమలై అభయారణ్యం–తమిళనాడు; దచిగామ్ నేషనల్ పార్క్– జమ్ముకశ్మీర్; కజిరంగ అభయారణ్యం–అస్సోం.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### గణపతిరావు గోవిందరావ్ జాదవ్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గణపతిరావు గోవిందరావ్ జాదవ్ మే 5, 1908న మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలోని గగన్ బవడలో జన్మించారు. జ్యోతిరావ్ పూలే 1873లో స్థాపించిన సత్యశోధక్ సమాజ్ కార్యకలాపాలలో చురుగ్గా పాలుపంచుకున్నారు. 1930లో భారత శాసనోల్లంఘన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వానికి, ఉద్యమకారులకు మధ్య సమాచార వారధిలా పనిచేశారు. మే 20, 1987న తుదిశ్వాస విడిచారు.

పోటీదారుడిని చూపిస్తాను' అని అంది.

నక్క మాటలు విన్న గొర్రెకు ఆసక్తి కలిగింది. తన సామర్థ్యం ఏమిటో నిరూపించుకోవాలని కుతూహలం కలిగింది. వెంటనే ఆ పోటీదారుడు ఎవరని అడిగింది.

అప్పుడు నక్క.. 'అదిగో నీ ఎదురుగా ఉన్న కొండను చూడు. అది నీ కంటే బలంగా, గంభీరంగా కనిపిస్తోంది.' అని చూపించింది.

దీంతో పొగరుగా వెళ్లి తన కొమ్ములతో కొండను ఢీకొట్టింది గొర్రెపోతు. దెబ్బకు దాని కొమ్ములు విరిగిపోయాయి. ★



## జనరల్ నాలెడ్జ్

1. స్త్రీలకు ఓటుహక్కు కల్పించిన మొదటి దేశమేది?
2. సౌరకుటుంబంలో అతిపెద్ద గ్రహమేది?
3. మనిషి శరీరంలో ఎన్ని జ్ఞానేంద్రియాలు ఉంటాయి?

జవాబులు : 1. న్యూజిలాండ్; 2. బృహస్పతి; 3. ఐదు

## మెదడుకు మేత

ఇంట్లో మొగ్గ..
బయటికొస్తే పువ్వు..
ఏమిటది?

జవాబు : గొడుగు

## మంచిమాట

మెదడు అన్ని రకాల ఆలోచనల్ని ఇస్తుంది.. వాటిలో ఏది ఎంచుకోవాలో విజ్ఞత మాత్రం నీదే!






**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

ఆదాయం ఆశించినరీతిలో ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు కొన్ని పరిష్కరించుకుంటారు. ఆస్తుల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. నిరుద్యోగులకు ఊహించని ఉద్యోగాలు దక్కుతాయి. వ్యాపారస్తులకు పెట్టుబడులు మరింతగా అందుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, పరిశోధకులు అనుకున్న విజయాలు సాధిస్తారు. 6,7 తేదీల్లో వృథాఖర్చులు. శారీరక రుగ్మతలు. గణేశాష్టకం పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

పొరపాట్లు సరిదిద్దుకుని కొన్ని కార్యక్రమాలను చక్కదిద్దుతారు. కొన్ని వివాదాలు చాకచక్యంగా పరిష్కరించుకుంటారు. నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు అంచనాలు నిజం కాగలవు. 3,4 తేదీల్లో ప్రయాణాలలో ఆటంకాలు. శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఎంతటి సమస్య ఎదురైనా అధిగమిస్తారు. భూములు, వాహనాలు సమకూర్చుకుంటారు. అనుకున్న ఆదాయం సమకూరుతుంది. వారసత్వ ఆస్తిలాభ సూచనలున్నాయి. ఆరోగ్యం గతం కంటే మెరుగుపడుతుంది. వ్యాపారస్తులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. కళాకారులు, వైద్యులకు మరింతగా కలసివచ్చే కాలం. రచయితలకు మంచి గుర్తింపు లభిస్తుంది. 5,6 తేదీల్లో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. శివస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

కొత్త వ్యక్తులు పరిచయమై మీకు ఇతోధికంగా సహకరిస్తారు. అనుకున్న రాబడి దక్కి ఉత్సాహంతో ముందడుగు వేస్తారు. ఆస్తులు కొనుగోలు చేస్తారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు లాభాలు గతం కంటే మెరుగుపడతాయి. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. కుటుంబంలో ఒత్తిడులు. దుర్గాస్తుతి మంచిది.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

అనుకున్న కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. బంధువులు, మిత్రుల సహాయసహకారాలు అందుతాయి. ఆర్థికంగా మరింత బలం చేకూరుతుంది. ఇంటి నిర్మాణాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. నిరుద్యోగులకు శుభవర్తమానాలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. క్రీడాకారులకు అవకాశాలు దక్కవచ్చు. 8,9 తేదీల్లో దుబారా వ్యయం. అనారోగ్యం. ఆదిత్య హృదయం పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

పట్టుదలతో కొన్ని కార్యక్రమాలు పూర్తిచేస్తారు. ఆదాయం అవసరాలకు తగినంతగా అందుతుంది. మీ శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనావేసినవారు పరివర్తన చెందుతారు. రాజకీయనాయకులు గతంకంటే మెరుగైన పరిస్థితులను చూస్తారు. క్రీడాకారులు, రచయితలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 3,4 తేదీల్లో ధననష్టం. కుటుంబంలో చికాకులు. దుర్గామాతకు కుంకుమార్చన చేయండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు


చెప్పుకోతగ్గ రీతిలో డబ్బు అందుతుంది. కొన్ని సమస్యలు తీరే సమయం. ఇంటి నిర్మాణాల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. వ్యాపారాలకు మరిన్ని లాభాలు దక్కుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు గతంనుంచి వేధిస్తున్న వివాదాలు తీరతాయి. చిరకాల మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. 5,6 తేదీల్లో శారీరక రుగ్మతలు, శివాలయ దర్శనం చేయండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పట్టుదలే మీ ఆయుధంగా మలుచుకోండి, సంతోషంగా ముందుకు సాగుతారు. వ్యాపారాలలో ప్రగతి కనిపిస్తుంది. ఉద్యోగస్తుల కృషిఫలిస్తుంది. కళాకారులకు కొంత అనుకూలత ఉంటుంది. క్రీడాకారులు, చిత్రకారులకు సంతోషకర సమాచారం అందుతుంది. 8,9 తేదీల్లో ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

డబ్బు అందుతుంది. చిరకాల కోరిక నెరవేరి ఉత్సాహంగా గడుపుతారు. చేపట్టిన కార్యక్రమాలను అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వ్యాపారాలు మరింత పుంజుకుని లాభాలు అందుతాయి. రాజకీయవేత్తలు, కళాకారుల ప్రయత్నాలు క్రమేపీ ఫలిస్తాయి. రచయితలు, పరిశోధకులకు ఆదరణ పెరుగుతుంది. 4,5 తేదీల్లో బంధువిరోధాలు. శారీరక రుగ్మతలు. శివాష్టకం పఠించండి.



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికంగా గతం కంటే మెరుగైన పరిస్థితి ఉంటుంది. ఆప్తులు, శ్రేయోభిలాషుల సలహాల మేరకు నిర్ణయాలు తీసుకుంటారు. స్థిరాస్తి వివాదాలు కొంత మేర పరిష్కారమవుతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళాకారులు, రచయితలు, క్రీడాకారులకు సంతోషకరంగా గడుస్తుంది. 3,4 తేదీల్లో దూరప్రయాణాలు. అనారోగ్యం. ధనవ్యయం. దేవీస్తుతి మంచిది.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఇంతకాలం మీ పట్ల విముఖంగా ఉన్న వ్యక్తులే మీదారికి వస్తారు. ఆదాయం సమృద్ధిగా ఉండి అవస రాలు తీరతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటనతో ఊరట. వ్యాపారస్తులకు పెట్టు బడులు మరింత అందుతాయి. పారిశ్రామిక, రాజకీయ వేత్తలు, చిత్రకారులు అనుకున్న విజయాలు సాధిస్తారు. ఆహ్వానం సంతోషం కలిగిస్తుంది. 6,7 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

సమర్థులైనా కొన్ని వ్యవహారాలలో పొరపాట్లు దొర్లి నిరాశకు లోనవుతారు. రుణదాతలు ఒత్తిడులు పెంచుతారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు కొంత గందరగోళంగా మారవచ్చు. ఉద్యోగస్తులకు శ్రమ తప్ప ఫలితం ఉండదు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు కృషి ఫలించదు. 4,5తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక ధనప్రాప్తి. కుజగ్రహ స్తోత్రాలు పఠించండి.

# పదరసం-466

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | 4 | | 5 | |
| | ■ | | ■ | 6 | ■ | | ■ | | ■ |
| 7 | | | | | ■ | | ■ | 8 | 9 |
| | ■ | | ■ | 10 | | | | ■ | |
| ■ | 11 | | 12 | | ■ | | ■ | 13 | |
| ■ | | ■ | | ■ | 14 | | | ■ | |
| 15 | | 16 | ■ | 17 | ■ | | ■ | 18 | |
| | ■ | 19 | | | | | ■ | | ■ |
| | ■ | | ■ | | ■ | ■ | 20 | | 21 |
| 22 | | | | ■ | 23 | | | ■ | |

## ఆధారాలు

**అడ్డం**

1) లభించు (4)

3) ఎప్పుడూ జరిగే అందరికీ తెలిసిన విషయం వాడుక భాషలో (5)

7) తిరగబడ్డ సాయం సమయం (5)

8) చెక్క, దుంగలను కోసే సాధనం (2)

10) నోటిలో ఊరే ద్రవం (4)

11) ఓర్వలేనివాడు (4)

13) శత్రువు (2)

14) వివేకానందుని అసలు పేరుకు అంతులేదు (3)

15) గుడిలో పెదతారు,అమ్ముతారు కూడా (3)

18) కార్యార్థం అక్రమంగా చేతులు మారే సొమ్ము (2)

19) వేదాలను విభజించి కావ్యాలను కూడా రచించినవాడు (5)

20) తేనె అందించే కీటకానికి తలలేదు (3)

22) చివరిసారి (4)

23) చిన్న తోబుట్టువు తడబడ్డాడు (3)

**నిలువు**

1) కలయిక (4)

2) తల్లివేళ్ళు (5)

4) రాజమహేంద్రవరం స్థాపించిన చాళుక్యరాజు (8)

5) ఎడ్ల మెడవెనుక ఎత్తుగా ఉండేభాగం (3)

6) త్రాసున తూచే తూనిక తలక్రిందులైంది (4)

9) సాధారణంగా పల్లెటూళ్ళలోఉండే పాతకాలపు మంచం (5)

11) క్షేమం (3)

12) జంతువుల ముట్టె (2)

15) ఒక పద్ధతి, విధానం ప్రకారం చేసిన పథకం (4)

16) ఒకవేదం పైకొచ్చింది (4)

17) వర్తకం సరిగాలేదు (3)

18) యోగా, వ్యాయామాదులు చేయునప్పుడు వాడే గోచీ (3)

20) (సాధారణంగా ఊపిరితిత్తులలోచేరే) తేమ (2)

21) సముద్రాలలో లభించే పురుగుచిప్ప (2)

## పదరసం - 465 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| చ[1] | క్కె | ర[2] | కే | ళి[3] | ■ | ధి[4] | ని[5] | తి | ప్ర[6] |
| ట్టు | ■ | ప | ■ | తా | ■ | ■ | చ్చె | ■ | తి |
| బం[7] | డా | రం | ■ | ■ | వి[8] | ధా | న | స[9] | భ |
| డ | ■ | ప[10] | ర[11] | వ | స్తు | ■ | ■ | ము | ■ |
| లు[12] | ష్టం[13] | ■ | భ | ■ | ■ | నే[14] | ■ | ద్రం[15] | భ[16] |
| ■ | మా[17] | న | స | స[18] | రో | వ | రం | ■ | గ |
| న[19] | స | ■ | ■ | జా | ■ | ళం | ■ | బా[20] | వ |
| రం | ■ | క[21] | రు | వు | ■ | ■ | కు[22] | ■ | ద్గీ |
| య[23] | ధే | చ్ఛ | ■ | ■ | జా[24] | గ | రూ | క | త |
| గా | ■ | పి[25] | డి | కి | లి | ■ | పి | ■ | ■ |

అరుణ




ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు సోదరుడు శిరీష్ తనయుడు ఆశిష్‌రెడ్డి రెండేళ్ల క్రితం 'రౌడీ బోయ్స్'తో హీరోగా తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టాడు. అతని రెండవ సినిమా 'సెల్ఫిష్' సెట్స్ మీద ఉండగానే, మూడో చిత్రం 'లవ్ మీ' షూటింగ్ మొదలైంది. దీనిని ముందు పూర్తి చేసి, మే 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌ను గత ఏడాది స్థాపించి, హర్షిత్, హన్షిత 'బలగం' సినిమాను నిర్మించారు. అదే బ్యానర్‌లో రెండో సినిమాగా 'లవ్ మీ' విడుదలైంది. నైజాంలో సింగిల్ థియేటర్లను మూసిన యజమానులు కొందరు 'లవ్ మీ' కోసం వాటిని తిరిగి తెరిచారు.

# ధైర్యముంటేనే

'లవ్ మీ' మూవీ టైటిల్ కు 'ఇఫ్ యు డేర్' అనేది ట్యాగ్ లైన్. దెయ్యాన్ని ప్రేమించే ఓ యువకుడి కథ ఇది. యూ ట్యూబర్ అయిన అర్జున్ (ఆశిష్ రెడ్డి)కి చిన్నప్పటి నుండి తెగువ, ధైర్యం ఎక్కువ. ఎవరైనా ఏదైనా చెయ్యొద్దని చెబితే అదే చేస్తాడు. పట్టుమని ఇరవై గడపలైనా లేని తమ ఊరిలో దెయ్యం కథలను విని పెరిగి పెద్దవాడైన అర్జున్... దెయ్యాలు లేవని నిరూపించడానికి తహతహ లాడుతుంటాడు. ఆ పేరుతో మోసం చేసే వాళ్ల గుట్టు రట్టుచేసి, వాటిని వీడియోలుగా తీసి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈ విషయంలో అర్జున్ సోదరుడు ప్రతాప్ (రవి కృష్ణ) సాయం చేస్తుంటాడు. అతని స్నేహితురాలు ప్రియ (వైష్ణవి చైతన్య) కూడా తన వంతుగా ఇన్‌పుట్స్ అందిస్తుంది. అలా, అర్జున్‌కు తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని ఓ పాడుపడిన అపార్ట్‌మెంట్‌లో దివ్యవతి అనే యువతి దెయ్యంగా తిరుగుతోందనే విషయాన్ని ప్రియ చెబుతుంది. దాంతో దివ్యవతికి సంబంధించిన మిస్టరీ తెలుసుకోవడానికి అర్జున్ అక్కడకు వెళతాడు. ఆ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లిన తర్వాత తనకు తెలియకుండా దివ్యవతితో అర్జున్ ప్రేమలో పడతాడు. అందరూ అనుకుంటున్నట్టు దివ్యవతి దెయ్యమేనా... లేకపోతే ఆమె బ్రతికే ఉండి అలా నాటకం ఆడుతోందా? అదే నిజమైతే... అందుకు కారణం ఏమిటీ? అనేదే మిగతా కథ.

'దెయ్యాన్ని ప్రేమించే ఓ యువకుడి కథ' అని మూవీ ప్రచారంలో మేకర్స్ చెప్పినా... దెయ్యాలను నమ్మని హీరో ప్రేమించేది దివ్యవతి అనే ఓ యువతినే. ఆమె గతానికి సంబంధించిన మిస్టరీని ఛేధించడమే ఇందులోని ప్రధానాంశం. అయితే... క్లయిమాక్స్‌లో ప్రేక్షకులకు దర్శకుడు ఓ చిన్న ట్విస్ట్ ఇచ్చాడు. కానీ అదేమంత థ్రిల్‌కు గురిచేసే అంశం కాదు. ఎందుకంటే... ఇదో హారర్ మూవీ అని, హారర్ కామెడీ అని, రొటీన్‌కు భిన్నమైన స్టోరీ అని ఊహించుకుని థియేటర్‌కు వెళ్లే ప్రేక్షకులను 'లవ్ మీ' నిరాశకు గురిచేస్తోంది.

సినిమా ప్రారంభం ఆసక్తికరంగానే ఉన్నా... ఓ పదినిమిషాలు నడిచే సరికి పరమ రొటీన్ రూట్ లోకి వెళ్లిపోయింది. అర్జున్, ప్రతాప్, ప్రియ మధ్య అనుబంధాన్ని దర్శకుడు బలంగా చూపించే ప్రయత్నం చేయలేదు. దాంతో వారి మధ్య ఉన్న రిలేషన్ ఏమిటో తెలియక ప్రేక్షకుడు కన్ఫ్యూజన్‌కు గురవుతాడు. దెయ్యాలంటే భయం లేని అర్జున్ దివ్యవతి మిస్టరీ ఛేదించడానికి వెళ్లడం వరకూ బాగానే ఉంది. కానీ సమాధుల నుండి పుర్రెలు తీసుకొచ్చి, వాటిని రీ-కన్ స్ట్రక్షన్ చేసి, ఆ అమ్మాయిల నేపథ్యాన్ని తెలుసుకోవడం, వారి మరణం వెనుక ఉన్న మిస్టరీని బయట పెట్టడం... ఇవన్నీ ప్రేక్షకుడిని తికమక పరుస్తాయి.


దర్శక నిర్మాతలకు ఈ విషయంలో క్లారిటీ ఉండొచ్చేమో కానీ థియేటర్‌లో కూర్చున ప్రేక్షకుడికి మాత్రం ఇదేదో సాల్వ్ చేయలేని పజిల్‌లా అనిపిస్తుంది. దానికి తోడు ప్రీ క్లయిమాక్స్ ట్విస్ట్ మరికొంత అసహనానికీ గురిచేస్తుంది. థియేటర్ నుండి బయటకు వచ్చేప్పుడు ట్యాగ్‌లైన్‌ను తలుచుకుంటూ... ఇలాంటి సినిమా చూడాలంటే నిజంగానే డేర్ ఉండాలి అని అనుకోవడం సహజం.

నటీనటుల విషయానికి వస్తే... 'రౌడీ బాయ్స్'తో పోల్చితే ఆశిష్ రెడ్డి నటనలో కొంత మెచ్యూరిటీ కనిపించింది. 'బేబీ' సినిమాతో హీరోయిన్‌గా మారిన వైష్ణవి చైతన్య... ఈ పాత్రను ఎలా ఒప్పుకుందనే సందేహం ప్రథమార్థంలో ప్రేక్షకులకు కలుగుతుంది. కానీ పతాక సన్నివేశానికి వచ్చే సరికీ ఆమె పాత్ర ఈ సినిమాలో ఎంత కీలకమైందో అర్థమౌతుంది. అయితే... ఆ పాత్రను మలిచిన తీరు ఏ మాత్రం కన్విన్సింగ్‌గా లేదు. రెండు గంటల పాటు కథను నింపాదిగా నడిపిన దర్శకుడు, చివరికి వచ్చే సరికీ హడావిడిగా ముగించేశాడు. దాంతో హీరోయిన్ పాత్రకు సంబంధించిన ఎమోషన్స్‌కు ఆడియెన్ కనెక్ట్ కాదు. పైగా ఎంచుకున్న అంశం కూడా ఏ మాత్రం కన్విన్సింగ్‌గా లేదు. ఇందులోని మరో రెండు కీలక పాత్రలను రవి కృష్ణ, సిమ్రాన్ చౌదరి చేశారు. రాజీవ్ కనకాల, సమ్మెట గాంధీ, రూపలక్ష్మీ తదితరులు ఒకటి రెండు సన్నివేశాలలో కనిపిస్తారు. ఎం.ఎం. కీరవాణి స్వర పర్చిన స్వరాల కంటే... నేపథ్య సంగీతం బాగుంది.


పి.సి. శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్ గా తన సత్తాను మరోసారి చాటాడు. నిర్మాణ పరంగా హర్షిత్, హన్షిత, నాగ మల్లిడి రాజీ పడలేదు కానీ కథను కన్విన్సింగ్‌గా చెప్పడంలో దర్శకుడు అరుణ్ భీమవరపు ఫెయిల్ అయ్యాడు. ఈ సినిమా అర్థం కావాలంటే మరోసారి చూడాలనే మాట వినిపిస్తోంది. కానీ క్షణం తీరిక లేకుండా జనం పరిగెత్తే ఈ రోజుల్లో అర్థం కాని సినిమాను అర్థం చేసుకోవడానికి రెండోసారి చూసే సాహసం ఎవరు మాత్రం చేస్తారు!?

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.220/-





వెల : ₹.200/-




వెల : ₹.390/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.360/-





వెల : ₹.90/-





వెల : ₹.200/-





వెల : ₹.100/-





వెల : ₹.150/-





వెల : ₹.999/-





వెల : ₹.395/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.599/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ – 2, దూరవాణి : 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 30

